
'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 286

శనివారం 29-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



న్యూస్‌మేకర్


అర్చనా రావు

అశ్వత్థామకు దుస్తులు కుట్టింది

అశ్వత్థామకు మరణం లేదు.
మహాభారత కాలం నుంచి
కల్కి వచ్చే కాలం వరకూ బతికే ఉండాలి.
మరి అతను ఎలా ఉంటాడు?
ఆ పాత్ర ధరించింది సాక్షాత్తు అమితాబ్
అయితే అతన్ని అశ్వత్థామలా మార్చే
దుస్తులు ఎలా ఉండాలి?
తెలుగు ఫ్యాషన్ డిజైనర్ అర్చనా రావు
'కల్కి' సినిమాకు చీఫ్ ఫ్యాషన్ డిజైనర్‌గా
అద్భుతంగా కాస్ట్యూమ్స్ డిజైన్ చేసి
ప్రశంసలు అందుకుంటోంది.
హైదరాబాద్ నిఫ్ట్‌లో, న్యూయార్క్‌లో
చదువుకున్న అర్చనా రావు పరిచయం.



'సినిమాకు పని చేయడంలో అసలైన సవాలేమిటంటే పేపర్ మీద గీసుకున్నది తెర మీద కనిపించేలా చేయగలగాలి. అందుకు టీమ్ మొత్తంతో మంచి కోఆర్డినేషన్‌లో ఉండాలి' అంటుంది అర్చనా రావు.

హైదరాబాద్‌కు చెందిన అర్చనా రావుకు 'అర్చనా రావు లేబుల్' పేరుతో సొంత బ్రాండ్ ఉంది. ఆమె దుస్తుల డిజైనింగ్ మాత్రమే కాదు ప్రాడక్ట్ డిజైనింగ్ కూడా చేస్తుంది. అంటే పాదరక్షలు, హ్యాండ్ బ్యాగ్‌లు, బెల్ట్‌లు... అన్నీ హ్యాండ్‌మేడ్. ఆమె సృజన మొత్తంలో తప్పనిసరిగా భారతీయత కనిపిస్తుంది.

'నాకు ఇండియన్ కళాత్మక విలువలంటే ఇష్టం. అవే నన్ను కల్కి సినిమా కాస్ట్యూమ్ డిజైనింగ్‌లో గెలిచేలా చేశాయి. నేడు నా పనికి మంచి ప్రశంసలు అందుతుంటే ఆనందంగా ఉంది' అందామె.

నిఫ్ట్ స్టూడెంట్

అర్చనా రావు హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగింది. చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం ఆమెకు ఇష్టంగా ఉండేది. ఏదో ఒక సృజనాత్మక రంగంలో చదువు కొనసాగించాలనుకున్నా స్పష్టత రాలేదు. ఇంటర్ ముగిసే సమయానికి హైదరాబాద్‌లో నిఫ్ట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ) ఏర్పడింది. అందులో క్లాత్ డిజైనింగ్ కోర్సుకు అప్లై చేస్తే సీటు వచ్చింది. 'కాలేజీలో చేరాక ఇదే నేను చదవాల్సింది అని తెలిసొచ్చింది. మన దగ్గర క్రియేటివిటీ ఉండటం ఒకటైతే చదువు వల్ల తెలిసే విషయాలు ఉంటాయి. నిఫ్ట్‌లో ఒక ఫ్యాబ్రిక్‌కు సంబంధించిన టెక్నికల్ నాలెడ్జ్ పూర్తిగా తెలిసింది. ఫ్యాషన్ డిజైన్ చేయాలంటే ముందు ఫ్యాబ్రిక్‌ని కనిపెట్టాలి. అలా చదువు పూర్తయ్యాక పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం న్యూయార్క్ వెళ్లాను. న్యూయార్క్ నగరమే ఒక క్యాంపస్. ఏ మనిషిని చూసినా ఏ వీధిని చూసినా ఫ్యాషన్ కనపడుతూనే ఉంటుంది. నేను మరింత ఎదగడానికి న్యూయార్క్ ఉపయోగపడింది. అయితే నేను అమెరికాలో స్థిరపడాలనుకోలేదు. ఇండియా ఫ్యాషన్ రంగంలో పుంజుకుంటోంది. నా పని ఇక్కడే అని నిశ్చయించుకుని వచ్చేశాను. నా బ్రాండ్ మొదలెట్టాను' అని తెలిపిందామె.

మహానటితో...

దర్శకుడు నాగ్ అశ్విన్ ఏదో సందర్భంలో పరిచయం కావడంతో అతను 'మహానటి' చిత్రం కోసం కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేయమన్నాడు. 'అప్పటికి నాకు సినిమాలకు కాస్ట్యూమ్స్ ఎలా తయారు చేయాలో తెలియదు. కాని నాగ్ అశ్విన్ ప్రోత్సాహంతో మహానటిలో సమంత, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్‌లకు కాస్ట్యూమ్స్ చేశాను. కథాకాలాన్ని బట్టి 1940ల నాటి ఫ్యాషన్‌లను, 1980ల నాటి ఫ్యాషన్‌లను స్టడీ చేయాల్సి వచ్చింది. సినిమాలకు కాస్ట్యూమ్స్ చేయడంలో ముఖ్యమైన సంగతి ఏమిటంటే లైట్ పడితే ఏ రంగు ఎక్కువ మెరుస్తుంది తెర మీద ఏ రంగు మృదువుగా ఉంటుందో తెలుసుకోవడమే. మహానటితో నేను పని తెలుసుకున్నాను. ఆ సినిమాకు నాకు జాతీయ అవార్డు రావడం మరింత సంతోషం' అందామె.

కల్కి సినిమాలో మహామహులకు...

'కల్కి సినిమా మొదలెట్టే ముందు నిర్మాత దగ్గర నాగ్ అశ్విన్ పెట్టిన మొదటి షరతు నన్ను చీఫ్ ఫ్యాషన్ డిజైనర్‌గా ఉంచాలని. నా మీద నాగ్ పెట్టుకున్న నమ్మకం అది. నాలుగేళ్ల క్రితం అతను ఈ కథను చెప్పినప్పుడు చాలా పెద్ద ప్రాజెక్ట్ అని అర్థమైంది. అశ్వత్థామ పాత్ర గురించి చెప్తే ఎవరు చేస్తున్నారు అనడిగాను. అమితాబ్ అన్నాడు. దాంతో నాకు ఎక్కడ లేని నెర్వస్‌నెస్ వచ్చింది. ఆయనను అశ్వత్థామగా చూపించడం ఎలా? మహాభారత కాలం నుంచి ఆయన జీవించే ఉన్నాడంటే నా మనసులో వచ్చిన భావం మనిషిని చూడగానే ఒక పురాతన వృక్షాన్ని చూసినట్టు ఉండాలని. ఆయనకు వాడే దుస్తులను మళ్లీ మళ్లీ పరీక్షకు పెట్టి తయారు చేశాను. ఆయన ముఖానికి శరీరానికి ఉండే కట్లు రక్తం, పసుపు కలిసిపోయి ఏర్పడిన రంగులో ఉంచాను. మొదటిసారి అమితాబ్ నా కాస్ట్యూమ్స్ ధరించినప్పుడు అది సినిమా అని అక్కడున్నది సినిమా సెట్ అని తెలిసినా రోమాలు నిక్కపొడుచుకున్నాయి. ఇక ప్రభాస్ కోసం నేను డిజైన్ చేసిన సూట్‌ను కాలిఫోర్నియాలో తయారు చేయించాం. కమలహాసన్‌కు అయన వ్యక్తిగత డిజైనర్ సహాయంతో కలసి కాస్ట్యూమ్స్ చేశాను. సినిమాలో మూడు ప్రపంచాలుంటాయి. పిరమిడ్ సిటీలో కనిపించే ఆర్మీ కోసం కాస్ట్యూమ్స్‌ని మన దిష్టిబొమ్మల నుంచి ఇన్‌స్పైర్ అయి చేశాను. కల్కి సినిమాకు అందరం కష్టపడి పని చేశాం. అది ప్రేక్షకులకు నచ్చడం చాలా సంతోషంగా ఉంది' అందామె.

బ్యూటిప్స్

వర్షాకాలం పాదాల సంరక్షణ

- ఐదు టేబుల్ స్పూన్ల ఎప్సమ్ సాల్ట్, కప్పుడు వైట్ వెనిగర్, గోరువెచ్చని నీళ్లలో కలపాలి. ఆ నీటిలో పాదాలను పదిహేను నిమిషాలు ఉంచాలి. తర్వాత పొడి క్లాత్‌తో తుడిచి, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. రోజూ రాత్రి పడుకునే ముందు ఈ విధంగా చేస్తుంటే కాలి పగుళ్లు తగ్గుతాయి. పాదాల చర్మం మృదువుగా మారుతుంది.
- వాన నీళ్లలో నానితే వేళ్ల మధ్య తడి వల్ల ఫంగస్ చేరుతుంటుంది. ఇలాంటప్పుడు బేకింగ్ పౌడర్‌లో మూడు చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ కలిపి, పాదాలకు, వేళ్ల మధ్య రాసుకోవాలి. ఫంగస్ తగ్గడంతో పాటు చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.



ఆర్ట్

కళాకారులు మనదైన ఆత్మను కళ ద్వారా జీవం పోస్తారు. ఆ కళను నలుగురికి పరిచయం చేయడమే కాకుండా దానిని ఉపాధి వనరుగా మార్చి మరికొంత మందికి చేయూతగా నిలుస్తున్నారు డాక్టర్ ముప్పిడి రాంబాబు. హైదరాబాద్ రాయదుర్గంలో ఉంటున్న ఈ కళాకారుడు ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఫ్యాకల్టీగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆరేళ్లుగా మహిళలకు, యువతకు జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో ఉచితంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలోని మహిళలకు శిక్షణ ఇస్తున్న సందర్భంగా భారతీయ కళను జ్యూట్ బ్యాగుల మీదకు ఏ విధంగా తీసుకువస్తున్నారో తెలియజేశారు.


• శిక్షణనిస్తూ...

జ్యూట్ బ్యాగులపైన భారతీయ కళ


• రాంబాబు

"జ్యూట్ బ్యాగుల తయారీ సాధారణమే కదా అనుకుంటారు. కానీ, ఇండియన్ ఆర్ట్ మోటిఫ్స్ కలంకారీ, చేర్యాల, వర్లీ, గోండు, పటచిత్ర, మధుబని... డిజైన్స్‌ను ఉపయోగిస్తూ, స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా జ్యూట్ మీదకు తీసుకువస్తున్నాం. దీని ద్వారా జ్యూట్‌కి కొత్త కళ వస్తుంది. అలాగే, మొన్నటి ఏరువాక పౌర్ణమిని దృష్టిలో పెట్టుకొని రైతు పొలం పనులకు వెళ్లే డిజైన్‌ని తీసుకువచ్చాను. ఈ కళ ద్వారా పర్యావరణ హితం, మనదైన ఆత్మను పరిచయం చేస్తున్నాం.

ఉపాధికి మార్గం

కరీంనగర్, ఏలూరు, జంగారెడ్డి గూడెం, పార్వతీపురం, బొబ్బిలి.. మొదలైన ప్రాంతాలలో ఉచితంగా శిక్షణ ఇస్తూ వచ్చాను. నేషనల్ జ్యూట్ బోర్డ్ వాళ్లు నన్ను సర్టిఫైడ్ డిజైనర్‌గా తీసుకున్నారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఈ స్కిల్ క్రాఫ్ట్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్స్ చేస్తుంటాను. ప్రస్తుతం మన్యం జిల్లా పార్వతీపురంలో 24 మంది మహిళలు శిక్షణ తీసుకుంటున్నారు. 45 రోజుల శిక్షణ కార్యక్రమంలో బ్యాగుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్ నేర్చుకుంటున్నారు. ఇప్పటికే బ్యాగుల తయారీ నేర్చుకున్నవారు, సొంతంగా ఉపాధి మార్గాలను పొందుతున్నారు. ఈ స్కిల్ ప్రోగ్రామ్‌లో పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్నవారు ఉన్నారు. బ్యాగులే కాకుండా పాదరక్షలు, లెదర్ బ్యాగులు, వైర్లతో చెయిర్లు, ఇతర యాక్సెసరీస్ తయారుచేస్తుంటాను. వీటితో కంప్యూటర్ ఆధారిత త్రీడీ సాఫ్ట్‌వేర్ డిజైన్లు కూడా ప్లాన్ చేస్తుంటాను.

కళాకారులను కలిసి...

మా ఊరు పశ్చిమగోదావరి దగ్గరిలోని జంగారెడ్డి గూడెం. సినిమా నటుల బ్యానర్లను సృజనాత్మకంగా తయారు చేసి, అందించిన కుటుంబం మాది. నాకున్న పెయింటింగ్ ఆసక్తిని మా అన్నయ్య శ్రీనివాసరావు గుర్తించాడు. దీంతో ఇంటర్మీడియెట్ తర్వాత ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పైన పూర్తి దృష్టి పెట్టాను. ముంబయ్ నిఫ్ట్ నుంచి మాస్టర్ ఆఫ్ డిజైన్ చేశాను. స్కూల్ చదువు నుంచి డాక్టరేట్ చేసేవరకు మా అన్నయ్య ప్రోత్సాహం ఎంతో ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ ఎఫ్‌డిఐలో ఉద్యోగం చేస్తున్నాను. సాంకేతికంగానూ భారతీయ కళను క్రాఫ్ట్ తయారీలో ఎలా మేళవించవచ్చో పరిశోధన, ప్రాక్టీస్ చేస్తుంటాను. రాబోయే తరాల కోసం క్రాఫ్ట్స్‌ని డిజిటలైజేషన్ చేసే పనిలో ఉన్నాను. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న హస్తకళాకారులను నేరుగా కలుసుకొని చేసిన పరిశోధనకు బంగారు పతకాన్ని అందుకున్నాను. నా పరిశోధన ద్వారా తెలుసుకున్న విషయాలను జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో మన కళ, కళాకారుల ప్రత్యేకతను తెలియ జేయడం అదృష్టంగా భావిస్తాను. ఏటి కొప్పాక కొయ్యబొమ్మల కళాకారులతో కలిసి, బొమ్మల తయారీ నేర్చుకున్నాను. నేను తయారు చేసిన కొయ్య బొమ్మలకు డిజైన్లకు, పేపర్ బాస్కెట్ డిజైన్స్‌కి పేటెంట్ హక్కులు పొందాను. కళను భవిష్యత్తు తరాలు గుర్తించేలా మరింత సృజనతో మెరుగ్గా తీర్చిదిద్దాలని.. దీని ద్వారా యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నాను' అని చెప్పారు రాంబాబు.



ఈ కళాకారుడు తన పనిలో సంపూర్ణ విజయాన్ని సాధించాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి

లైఫ్@360

పరిసరాలను పట్టించుకుంటున్నారా?



చాలామంది ఇంటిని, ఒంటిని శుభ్రంగా ఉంచుకుంటారు కానీ మన చుట్టూ ఎలా ఉంటే ఏమవుతుందిలే అన్నట్లు ఉంటారు. అయితే ఇల్లు, ఇంటిలోని మనుషులు మాత్రమే శుభ్రంగా ఉండి పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉంటే ఏం ప్రయోజనం? అనారోగ్యం, అంటువ్యాధులు పొంచే ఉంటాయి. ఇంతకీ పరిసరాల పరిశుభ్రత అంటే ఏమిటో, పరిసరాలను ఏవిధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలో చూద్దామా?





ఇంట్లో మురికిగా ఉండే ప్రదేశాలను శుభ్రం చేయడం ఎంత ముఖ్యమో, చుట్టుపక్కల ఉండే హానికారక సూక్ష్మజీవులను నిరోధించడంపై దృష్టి పెట్టడం కూడా అంతేముఖ్యం. చేతులు కడుక్కోవడం, బట్టలు ఉతకడం, ఫ్లోర్‌ని తుడవటం ఆరోగ్యవంతమైన వాతావరణానికి కీలకం.

ఒక సర్వే మేరకు అపరిశుభ్రమైన పరిసరాలలో మెసలడం వల్ల పిల్లలు ప్రమాదకరమైన అంటురోగాల బారిన పడతారని తెలిసింది. అందువల్ల ఆయా ప్రదేశాలను శుభ్రం చేయడంపై దృష్టి పెట్టాలని, అవి శుభ్రంగా కనిపించినప్పటికీ తగిన శ్రద్ధ పెట్టి ఎలాంటి క్రిములూ లేకుండా చూడాలని, అప్పుడే హానికారక సూక్ష్మ క్రిముల వ్యాప్తిని అడ్డుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

బ్యాక్టీరియా ఎలా పోతుంది?

ఆహారాన్ని తయారు చేసిన తర్వాత నేలను, రాతి దిమ్మెలను శుభ్రం చేయడానికి క్లాత్‌కు బదులు పేపర్ టవల్స్ వాడి చూడండి. ఇలా చేయడం వల్ల వంటగదిలో ఉపయోగించే గుడ్డలు అపరిశుభ్రం కాకుండా, కలుషితం కాకుండా ఉంటాయి.

ఎలా శుభ్రం చేయాలి?

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అంటే మురికితోపాటు రోగ కారక క్రిములను అరికట్టడం. తద్వారా అంటువ్యాధులు సోకకుండా చూసుకోవడం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటురోగాల వ్యాప్తిని తగ్గించొచ్చు. తద్వారా మన పిల్లల్ని రక్షించుకోవడంతో పాటు, ఆసుపత్రులపై ఒత్తిడిని కూడా తగ్గించొచ్చు.

ఇంటిని మాత్రమే కాదు, ఇంటి పరిసరాలలో ఎక్కడైనా మురికిగుంటలు, చెత్తకుప్పలు, అపరిశుభ్ర వాతావరణం ఉంటే దానిపై దృష్టి పెట్టాలి. శ్రమ అనో, ఖర్చనో అనుకోకుండా చెత్తను క్లీన్ చేయాలి లేదా చేయించాలి. కొంతమంది తమ ఇంటిలోని చెత్తనంతటినీ తీసుకొచ్చి ఖాళీగా ఉన్న ప్రదేశాలలో పడేస్తుంటారు. క్రమేణా అవి చెత్తకు, ఆ తర్వాత అపరిశుభ్రతకు, అంటువ్యాధులకు నిలయాలుగా మారతాయి. అందువల్ల చొరవ తీసుకుని క్లీన్ చేయించాలి. అలాగే మురికిగుంటలపై కూడా దృష్టి సారించాలి. పరిసరాలలో నీరు నిలవకుండా చూసుకోవాలి. ఇంటిలోని చెత్తను, తడి చెత్త, పొడిచెత్తగా వేరు చేసి పడెయ్యడం, గాజుపెంకుల వంటి వాటిని విడిగానూ వేరు చేసి పడెయ్యాలి. ఇలాంటి వాటన్నింటినీ బాధ్యతగా చేసినప్పుడే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సూక్ష్మక్రిములు, తద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. మనం ఆరోగ్యంగా ఉండగలుగుతాము.

ఏయే పరిసరాలు?

- వంటశాలలు, భోజన శాలలు
- మరుగుదొడ్లు,
- ఇల్లు, వంటగదిలో ఉండే మురికి బట్టలు, మసిగుడ్డలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- పెంపుడు జంతువులతో ఉన్నప్పుడు
- చెత్త, వ్యర్థాలను చేత్తో తాకినప్పుడు, పారేసేటప్పుడు
- అంటువ్యాధి సోకిన వారికి సపర్యలు చేసేప్పుడు శుభ్రత పాటించడం అత్యవసరం
- మాంసం వంటి వంటకాలు చేసినప్పుడు వంటగదిలోని నేలను, దిమ్మల్ని, మాంసం కోసిన చెక్క/బోర్డుల్ని శుభ్రం చేయడం చాలా కీలకం. అలాగే, కలుషితమైన ప్రదేశాన్ని, పాత్రల్ని శుభ్రం చేశాక ఆయా గుడ్డలు, స్క్రబ్‌లను, బ్రష్‌లను కడగాలి
- ఇంట్లో నేలపైన, కుర్చీలు, బల్లల వంటి ఫర్నీచర్‌పైన చాలా దుమ్ము పట్టినట్లు ఉంటుంది. వాటిని కూడా శుభ్రం చేయాలి.



ఏ వయసులో ఏ ఆహారం?

ఆహారానికి వయసు ఉండదు కానీ, ఏ వయసుకు తగ్గ ఆహారం ఆ వయసులో తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుంటాయంటున్నారు పోషకాహార నిపుణులు. ఎదిగే వయసు పిల్లలు తీసుకోవలసిన ఆహారంలో ఉండవలసినవి వృద్ధులు తీసుకోవలసిన ఆహారం ఒకటి కాదు. అదేవిధంగా టీనేజీ అమ్మాయిలు, యాభైలలో ఉండే స్త్రీలు వేర్వేరు ఆహారాలు తీసుకోవాలి. ఇంతకీ ఏ వయసు వారు ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దామా?

ఇప్పుడు పిల్లలు తినే ఆహారంలో ప్రొటీన్లు తక్కువ; పిండి పదార్థాలు, కొవ్వులు ఎక్కువ ఉంటున్నాయి. ఇలాంటి ఆహారం తినటం వల్ల వయసుకు తగిన పెరుగుదల ఉండదు. అధిక బరువు, హార్మోన్లలో మార్పుల లాంటి సమస్యలు మొదలవుతాయి. కాబట్టి ఈ వయసు నుంచే సమతులాహారం ఇస్తూ ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండేలా చూసుకోగలిగితే భవిష్యత్తులో హైపర్ టెన్షన్, మధుమేహం, రక్తపోటు మొదలైన ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి కాబట్టి గుడ్లు, ఆకుకూరలు, తాజాపళ్లు, కూరగాయలు • బాదం, వాల్‌నట్స్, వేరుసెనగ • గోధుమలు, పెసలు, పాలు, వెన్న, పెరుగు • మాంసం, చేపలు, జున్ను • రాజ్మా, సెనగలు, బొబ్బర్లు, సాయంత్రం అల్పాహారంగా బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఉడక బెట్టిన సెనగలు, మొక్కజొన్నలాంటివి ఇవ్వాలి.

15 నుంచి 25 ఏళ్ల వయసు

- తక్కువ నూనె, తీపి, మసాలాలతో రుచికరమైన స్నాక్స్ వండే విధానాలను నేర్చుకుని పిల్లల మనసు గెలవగలిగితే బజార్లో దొరికే ఫాస్ట్ ఫుడ్స్‌కు పిల్లలు ఆకర్షితులవకుండా ఉంటారు
- అలాగే మాంసాహారం వండేటప్పుడు ఎక్కువ నూనెలో వేయించకుండా ఆవిరి మీద ఉడికించి ఇవ్వాలి. మాంసాహారంతోపాటు కూరగాయలు కూడా ఇవ్వాలి
- ఆహారంలో తగినంత పీచు పదార్థం ఉండేలా చూసుకుంటే ప్రొటీన్ ఫుడ్ వల్ల మలబద్ధకం తలెత్తకుండా ఉంటుంది
- ఉదయం అల్పాహారంలో బ్రెడ్, శాండ్‌విచ్‌లకు బదులుగా గోధుమ రవ్వతో చేసిన ఉప్మా, పెసలతో చేసిన పొంగల్, పెసరట్టు, రాగి, క్యారట్ ఇడ్లీ లాంటివి ఇవ్వాలి
- కేక్‌ల తయారీలో డ్రై ఫ్రూట్స్, పళ్ల ముక్కలు ఎక్కువగా వాడాలి. బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఉడక బెట్టిన సెనగలు, మొలకలు అందుబాటులో ఉంచాలి
- ఫ్రిజ్ ట్రేలలో చాక్లెట్లు, బిస్కెట్లకు బదులుగా పళ్లు, సలాడ్లు, పాలు, గుడ్లు ఉంచాలి. ఎక్కువగా ఆటలాడుతూ ఉంటారు కాబట్టి రోజుకి కనీసం గుప్పెడు డ్రై ఫ్రూట్స్ తినేలా చూసుకోవాలి. ఉదయం, సాయంత్రం కలిపి కనీసం అర లీటరు పాలు తాగేలా చూసుకోవాలి
- ఉడికించిన సెనగలు, బొబ్బర్లు ఎక్కువ సమయంపాటు శక్తినిస్తాయి. కాబట్టి బాస్కెట్‌బాల్, క్రికెట్‌లాంటి ఆటల్లో పాల్గొనే పిల్లలకు వీటిని శ్నాక్స్‌గా ఇస్తూ ఉండాలి.



టీనేజ్‌లో... కొంతమంది టీనేజర్లు...మరీ ముఖ్యంగా అమ్మాయిలు బరువు పెరిగిపోతామనే బెంగతో తగినంత ఆహారం తీసుకోకుండా పోషక లోపాలకు గురవుతూ ఉంటారు. ఇలాంటి టీనేజర్లను కనిపెట్టి తల్లులు పౌష్టికాహారం వల్ల భవిష్యత్తులో ఒరిగే ప్రయోజనాల గురించి వారికి అవగాహన కల్పించాలి • చిన్న వయసు నుంచే శరీరానికి పోషకాలు అందిస్తూ గర్భం దాల్చే సమయానికి శరీరాన్ని ఎలా సన్నద్ధం చేయాలో, అలా చేయకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయో వివరించాలి • ఉదయం అల్పాహారం స్కిప్ చేయకుండా చూసుకోవాలి • తగినంత క్యాల్షియం, ప్రొటీన్ తీసుకుంటూ వ్యాయామం చేస్తే ఎత్తు పెరగటంతోపాటు, చక్కటి శరీర సౌష్ఠవం కూడా సొంతమవుతుంది.

45 ఏళ్ల నుంచి వృద్ధాప్యం వరకూ...

- ఈ వయసు స్త్రీలలో హార్మోన్ల స్రావాలు తగ్గిపోతాయి కాబట్టి శరీరం కాల్షియంను శోషించుకునే శక్తి కోల్పోతుంది. ఫలితంగా ఎముకలు, కీళ్ల నొప్పులు మొదలవుతాయి. పురుషుల్లో కండరాలు పటుత్వం కోల్పోతాయి కాబట్టి క్యాల్షియంను సప్లిమెంట్ల రూపంలో తీసుకోవటం అవసరం. దీంతోపాటు మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాల సప్లిమెంట్లను వైద్యుల సూచనమేరకు వాడాలి
- ఈ వయస్కుల్లో కంటి చూపు, జ్ఞాపక శక్తి తగ్గిపోతూ ఉంటుంది. బీటా కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే కాలిఫ్లవర్, క్యారెట్, చిలకడ దుంపలు, గుమ్మడికాయ మొదలైనవి తీసుకోవాలి
- వాల్‌నట్స్, బాదం కూడా ఎక్కువగా తినాలి.

ఆకలి... నిద్ర సరిగా లేవా? మెగ్నీషియం లోపం కావచ్చు




మన శరీరం ఫిట్‌గా ఉండాలంటే మెగ్నీషియం దేహంలో అధికంగా ఉండాలి. కార్బోహైడ్రేట్స్, కొవ్వు, ప్రోటీన్స్ నుంచి మనకు శక్తి వచ్చేలా చేయడంలో మెగ్నీషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మంచి శక్తితోపాటు చక్కటి నిద్ర పట్టేలా చేస్తుంది. రక్తంలో చక్కెరలను, హార్మోన్లను క్రమబద్ధీకరిస్తుంది. మెగ్నీషియం తగినంత లేకపోతే కలిగే అనర్థాలేమిటో తెలుసుకుందాం.

అనారోగ్యాలు వేధిస్తుంటాయి!

శరీరంలో మెగ్నీషియం లోపం ఉంటే ఆకలి వేయదు. వికారంగా... వాంతులు వస్తున్నట్టుగా అనిపిస్తుంది. నీరసంగా ఉంటారు. హార్ట్ బీట్‌రేట్ లో హెచ్చుతగ్గులు వస్తాయి. కళ్ళు మసక బారుతుంటాయి. కండరాలలో నొప్పి వస్తుంది. ఒత్తిడి పెరుగుతుంది. నిద్ర సరిగ్గా పట్టదు. హై బీపీ వస్తుంది. ఆస్తమా రోగులకు మెగ్నీషియం లోపిస్తే ఈ సమస్య తీవ్రంగా మారుతుంది.

ఆకుకూరలలోనూ, అవకాడో, అరటి పండ్లు, రాస్ బెర్రీస్, ఫిగ్స్ వంటి పండ్లలోనూ మెగ్నీషియం ఉంటుంది. అలాగే బ్రకోలీ, క్యాబేజీ, పచ్చి బఠానీలు, మొలకలు వంటి వాటిలో కూడా ఇది దొరుకుతుంది. బ్రౌన్ రైస్, ఓట్స్, సీఫుడ్స్‌లో మెగ్నీషియం లభిస్తుంది. మెగ్నీషియం వెంటనే రావాలి అంటే ఒక కప్పు కాఫీ తాగాలి. చాక్లెట్ తిన్నా ఫలితం ఉంటుంది. మెగ్నీషియం లోపానికి వెంటనే జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యానికి గురవుతారు.

సబ్జా గింజలు, ప్రోటీన్, కాల్షియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో కూడిన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటే మెగ్నీషియం లోపించదు.


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 286

శనివారం 29-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



షఫాలీ విశ్వరూపం

టెస్టుల్లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ చేసిన భారత్ ఓపెనర్ - 10లో



ఎయిర్‌టెల్ చార్జీల వడ్డన

జియో బాట పట్టిన కంపెనీ టారిఫ్‌లు 10–21 శాతం పెంపు - 11లో



నీట్ నుంచి మినహాయించండి

నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని కోరుతూ సీఎం స్టాలిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది.

వివరాలు 6లో ▸



విమానాశ్రయంలో కూలిన పైకప్పు

భారీ వర్షాలకు ఢిల్లీ విమానాశ్రయంలో టెర్మినల్ 1 పై కప్పు పాక్షికంగా కుప్పకూలగా ఓ ట్యాక్సీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు.

వివరాలు 6లో ▸



హేమంత్ సోరెన్‌కు బెయిల్

మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ (48)కు జార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

వివరాలు 6లో ▸



ట్రంప్ జోరు.. బైడెన్ బేజారు

అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ డెమొక్రాట్ల అభ్యర్థి బైడెన్‌తో డిబేట్‌లో ఆధిక్యం ప్రదర్శించారు.

వివరాలు 6లో ▸

గోదాట్లో ముంచేసి 'తెల్ల'మొహం!

పోలవరంపై శ్వేతపత్రం పేరుతో చేతులెత్తేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు


తన చారిత్రక తప్పిదాలతో జరిగిన విధ్వంసాన్ని వైఎస్ జగన్‌పై నెట్టే యత్నం

- వ్యక్తిగత దూషణలతో ఉక్రోషం
- బాబు పునాది స్థాయిలో వదిలేసిన స్పిల్‌వేను 48 గేట్లతో సహా రికార్డు సమయంలో పూర్తి చేసిన వైఎస్ జగన్
- కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి
- 2021 జూన్ 11న స్పిల్‌వే మీదుగా గోదావరి ప్రవాహం 6.1 కి.మీ. పొడవున మళ్లింపు
- కుడి, ఎడమ కాలువతోపాటు కనెక్టివిటీస్, జలవిద్యుత్కేంద్రం పనులు కొలిక్కి
- బాబు చారిత్రక తప్పిదానికి పాల్పడకుంటే 2022 నాటికే ప్రాజెక్టు పూర్తి
- 1941 నుంచే జీవనాడి సాకారం కోసం ప్రతిపాదనలు
- తొమ్మిదేళ్లు సీఎంగా ఉండీ కనీసం ఆ ఆలోచన కూడా చేయని చంద్రబాబు
- 2005లో చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ పోలవరాన్ని చేపట్టిన వైఎస్సార్
- ఇప్పటికే 49.79% పూర్తి.. ఐదేళ్లలో 24.94% పనులు చేసిన జగన్ సర్కార్

2 లో



జగన్ వల్లే.. ప్రమాదంలో పోలవరం



- శ్వేతపత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- జగన్ అసమర్థత, దుస్సాహసం వల్ల పోలవరం మనుగడే ప్రమాదంలో పడింది
- 3 డ్యామేజీలకు ఆయన నిర్వాకాలే కారణం.. అందుకే ఆలస్యం.. ఏజెన్సీలను మార్చొద్దన్న పీపీఏ హెచ్చరికలను పెడచెవిన పెట్టారు
- ప్రాజెక్టు కోసం కేంద్ర నిధులను దారి మళ్లించారు

3 లో

బాబు తప్పిదాలే శాపం



- టీడీపీ హయాంలోనే వ్యూహాత్మక తప్పిదాలు
- మాజీ మంత్రి అంబటి ధ్వజం
- అన్ని అనుమతులూ తీసుకొచ్చింది డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డే
- కేంద్రం పూర్తి చేయాల్సిన ప్రాజెక్టును బాబు ఎందుకు తీసుకున్నారు?

3 లో

సారూ.. ఫీజు డబ్బులివ్వరూ..

విద్యా, వసతి దీవెనలకు మంగళం!

షెడ్యూల్ ప్రకారం జూన్‌లో ఇవ్వాల్సి ఉన్నా ఊసెత్తని ప్రభుత్వం

విద్యా దీవెన కింద సుమారు రూ.708.68 కోట్లు

ఫీజులు చెల్లించకుంటే సర్టిఫికెట్లు ఇవ్వం అంటున్న కాలేజీలు

దాదాపు 9.44 లక్షల మందికి చెల్లించాల్సిన నిధులపై స్పందన కరువు.. సుమారు 9.55 లక్షల మందికి రూ.600 కోట్ల వసతి దీవెన పైనా అదే తీరు

తీవ్ర ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐటీఐ నుంచి ఐఐటీ, వైద్య విద్య వరకు చదువుకునే విద్యార్థులకు చెల్లించాల్సిన విద్యా దీవెన, వసతి దీవెనపై సర్కారు స్పందన కరవైంది. గత ప్రభుత్వం ఏటా మూడు నెలల (త్రైమాసికం)కు ఒకసారి జగనన్న విద్యా దీవెన చెల్లించగా, ఆరు నెలలకు ఒకసారి జగనన్న వసతి దీవెన చెల్లించేది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ రెండో వారంలో దాదాపు 9.44 లక్షల మంది విద్యార్థులకు జనవరి– ఏప్రిల్ నెలలకు విద్యా దీవెన కింద రూ.708.68 కోట్లు జమ చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు

మిగతా 3వ పేజీలో ▸

న్యూస్‌రీల్

తక్షణమే తప్పుకోండి..



అధికారంలోకి వచ్చిన క్షణం నుంచే కక్ష సాధింపు చర్యలకు తెగబడుతున్న టీడీపీ ప్రభుత్వం.. చివరకు వర్సిటీలపైనా విరుచుకుపడుతోంది. తాజాగా వర్సిటీల వీసీలను వెంటనే రాజీనామా చేసి వెళ్లిపోవాలని ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పీఏల నుంచి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు.

వివరాలు 12లో ▸

పిన్నెల్లిపై మరో అక్రమ కేసు



మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిపై పోలీసులు మరో అక్రమ కేసు నమోదు చేశారు. ఆయనను బుధవారం మాచర్ల కోర్టులో హాజరుపరిచే సమయంలో టీడీపీ నేత ఆయనపై దాడికి ప్రయత్నించారు. టీడీపీ నేతపై పోలీసులు కేసు పెట్టకపోగా, పిన్నెల్లిపైనే ఎదురు కేసు నమోదు చేశారు.

వివరాలు 5లో ▸

నేటి నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం



కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య వార్షిక అమర్‌నాథ్ యాత్ర నేడు ప్రారంభం కానుంది. తొలి విడతలో 4,603 మందితో బృందం 231 వాహనాల్లో శుక్రవారం కశ్మీర్‌కు చేరుకుంది. వీరందరికీ అధికారులు, పోలీసులు, స్థానిక ముస్లింలు సాదర స్వాగతం పలికారు.

వివరాలు 6లో ▸

పార్లమెంట్‌లో 'నీట్' రగడ

పరీక్షలో అక్రమాలపై వెంటనే చర్చించాలని విపక్షాల డిమాండ్

- అంగీకరించని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్
- నిరసనలు, నినాదాలతో హోరెత్తించిన ప్రతిపక్ష సభ్యులు
- ఉభయ సభలు పలుమార్లు వాయిదా
- రాజ్యసభలో వెల్‌లోకి ఖర్గే రావడంపై ధన్‌ఖడ్ ఆగ్రహం
- పార్లమెంట్‌కు ఇదొక మచ్చ అని ఆక్షేపణ

6 లో



ఐదేళ్లు... 65 పేపర్ల లీకులు

- 2019-24 మధ్య దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాల లీకేజీ
- మొదటి 2 స్థానాల్లో యూపీ, బిహార్
- పరీక్షల నిర్వహణలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సూపర్
- పకడ్బందీగా నిర్వహణతో ఒక్కసారి కూడా ఏ పేపరూ లీక్ కాలేదు



12లో

ఊరొదలకపోతే చంపేస్తాం..

- బాపట్ల, తిరుపతి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ నేతలకు టీడీపీ నేతల హెచ్చరిక
- మంత్రి అనగాని అండతో రేపల్లెలో పేట్రేగిపోయిన దాడులు
- చంపుతామంటూ మైకుల్లో అనౌన్స్‌మెంట్లు
- ఇప్పటికే పలువురిపై దౌర్జన్యం, ఇళ్లు, ఆస్తులు ధ్వంసం
- అజ్ఞాతంలో నేతలు, కార్యకర్తలు.. గ్రామం వదలిన చెరుకుపల్లి మాజీ ఎంపీపీ అధ్యక్షుడి కుటుంబం, రాంబొట్లపాలెం నేతలు
- మరికొందరు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలదీ ఇదే దారి

5 లో

విజయవాడలో ప్రేమోన్మాది ఘాతుకం

ప్రేమించానంటూ ఓ యువతికి వేధింపులు



- మందలించిన యువతి తండ్రిపై కక్ష
- ఆమె కళ్లెదుటే ఆమె తండ్రిని కిరాతకంగా హతమార్చిన యువకుడు
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు?

12లో

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ అల్పపీడనం రానున్న 2 రోజులు వాయవ్య దిశగా పయనించనుంది. ఫలితంగా వచ్చే 3 రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలకు అవకాశమున్నట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది.




ముఖ్యమంత్రిగా చంద్రబాబు దిగిపోయే ముందు 2019 మార్చిలో పోలవరం స్పిల్‌వే పరిస్థితి ఇదీ...


2019 ఆగస్టులో వచ్చిన వరద సమయంలో స్పిల్ వే



2019లో అసంపూర్తిగా ఉన్న కాఫర్ డ్యామ్‌లు

గోదాట్లో ముంచేసి 'తెల్ల'మొహం!

పోలవరంపై శ్వేతపత్రం పేరుతో అబద్ధాలు వల్లెవేసిన సీఎం చంద్రబాబు

తన చారిత్రక తప్పిదాలను వైఎస్ జగన్‌పై నెట్టేయత్నం

సాక్షి, అమరావతి: పోలవరం పనులను ఈనెల 17న క్షేత్రస్థాయిలో పరిశీలించిన సమయంలో వ్యవహరించిన రీతిలోనే శ్వేతపత్రం పేరుతో శుక్రవారం సీఎం చంద్రబాబు మరోసారి పచ్చి అబద్ధాలను కళ్లార్పకుండా చెప్పేశారు! నిజాలను నిస్సిగ్గుగా గోదాట్లో కలిపేశారు! 2014 జూన్ 8 నుంచి 2019 మే 29 మధ్య గతంలో తాను అధికారంలో ఉన్నప్పుడు కమీషన్ల దాహంతో చేసిన చారిత్రక తప్పిదాల వల్ల ప్రాజెక్టులో జరిగిన విధ్వంసం.. ఫలితంగా పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌పై నెడుతూ నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలు వల్లించారు. వైఎస్ జగన్‌పై వ్యక్తిగత దూషణలకు దిగి తన ఉక్రోషాన్ని వెళ్లగక్కారు. ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్నది మాత్రం చెప్పలేకపోయారు. చంద్రబాబు సర్కార్ 2014–19 మధ్య చేసిన చారిత్రక తప్పిదాలను 2019 మే 30న సీఎంగా బాధ్యతలు చేపట్టగానే సరిదిద్దుతూ కరోనా లాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ రికార్డు సమయంలో స్పిల్‌వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను వైఎస్ జగన్ పూర్తి చేశారు. 2021 జూన్ 11న గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. కుడి కాలువతోపాటు ఎడమ కాలువలో అత్యంత కీలకమైన వరాహ నదిపై అక్విడెక్టు లాంటి కీలక నిర్మాణాలతోపాటు కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానం చేసే కనెక్టివిటీస్‌ను పూర్తి చేశారు. 960 మెగావాట్ల జలవిద్యుత్కేంద్రం పనులను కొలిక్కితెచ్చారు. చంద్రబాబు సర్కార్ చారిత్రక తప్పిదాలకు పాల్పడకపోయి ఉంటే 2022 జూన్ నాటికే జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉండేవారని



వైఎస్ జగన్ పాలనలో చేసిన పోలవరం ప్రాజెక్టు ముఖ్యమైన పనుల సమగ్ర స్వరూపం

సాగునీటిరంగ నిపుణులు తేల్చిచెబుతున్నారు. పోలవరం పనుల్లో జాప్యం వల్ల జరుగుతున్న నష్టానికి చంద్రబాబుదే పూర్తి బాధ్యతని స్పష్టం చేస్తున్నాయి. పోలవరాన్ని కమీషన్ల కోసం చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని 2019లో ప్రధాని మోదీ చేసిన ఆరోపణలే నాడు టీడీపీ సర్కార్ అవినీతికి నిదర్శనమని గుర్తు చేస్తున్నారు.

బాబు చేస్తే ఒప్పు.. జగన్ చేస్తే తప్పా?

పోలవరం హెడ్ వర్క్స్ పనుల నుంచి ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్‌ని 2018లో తప్పించి రూ.2,917 కోట్ల విలువైన వాటిని నామినేషన్ పద్ధతిలో నవయుగకు నాడు చంద్రబాబు అప్పగించడాన్ని పీపీఏ తప్పుబట్టింది. దేశ చరిత్రలో నామినేషన్ పద్ధతిలో ఇంత పెద్ద ఎత్తున పనులు కట్టబెట్టిన దాఖలాలు ఎక్కడా లేవు. కాంట్రాక్టర్‌ను మార్చితే పనుల్లో ఏదైనా సమస్య తలెత్తితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ అప్పటి కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి అమర్జీత్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక చంద్రబాబు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టిన పనులను 2019 ఆగస్టులో రద్దు చేసి, వాటికి జలవిద్యుత్కేంద్రం పనులను జత చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. దీని ద్వారా ఖజానాకు రూ.784 కోట్లు ఆదా అయ్యాయి. రివర్స్ టెండరింగ్‌తో తన అక్రమాలు బయటపడటాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం పనుల్లో విధ్వంసం చోటుచేసుకుందని తాజాగా సూత్రీకరించడం గమనార్హం. రివర్స్ టెండరింగ్‌లో పనులు దక్కించుకున్న మేఘా సంస్థ గోదావరి వరద తగ్గాక 2019 నవంబర్‌లో పనులు ప్రారంభించింది. 2020 మార్చి నుంచి 2021 ఆఖరు వరకూ కరోనా విజృంభించినా పనులను కొనసాగించింది. చంద్రబాబు సర్కార్ పునాది స్థాయిలోనే వదిలేసిన స్పిల్‌వేను 48 గేట్లతో సహా రికార్డు సమయంలో పూర్తి చేసింది వైఎస్ జగన్ ప్రభుత్వమే. స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. వాస్తవాలు ఇలా ఉండగా 2021 వరకూ కాంట్రాక్టర్ లేకపోవడం వల్ల పనులు ఆగిపోయినట్లు సీఎం చంద్రబాబు చెప్పడంపై అధికార వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

పోలవరం వైఎస్సార్ స్వప్నం..

పోలవరం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 194.6 టీఎంసీలు కాగా కుడి, ఎడమ కాలువల కింద 7.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కృష్ణా, గోదావరి డెల్టాల్లో 23.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా 8 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చు. విశాఖ తాగు, పారిశ్రామిక అవసరాలతోపాటు 28.5 లక్షల మంది దాహార్తిని తీర్చవచ్చు. 960 మెగావాట్ల జలవిద్యుత్ కూడా అందుబాటులోకి వస్తుంది. అందుకే పోలవరాన్ని ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా అభివర్ణిస్తారు. 1941లోనే ఈ ప్రాజెక్టును నిర్మించాలని ప్రతిపాదించినా 2005 వరకూ ఏ ఒక్క సీఎం కూడా కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేకపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ 2005లో పోలవరం పనులను ప్రారంభించారు. కుడి, ఎడమ కాలువలలో అధిక భాగం పనులు చేయించారు. జలాశయం పనులకు అవసరమైన భూమిలో అధిక భాగం సేకరించారు. జలాశయం పనులను కొలిక్కి తెచ్చే క్రమంలోనే మహానేత అమరుడయ్యారు. వైఎస్సార్‌కు ముందు 1995 నుంచి 2004 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్న చంద్రబాబు ఏ రోజూ పోలవరం పనులు చేపట్టాలని ఆలోచన చేసిన పాపాన పోలేదు. ఇప్పుడు పోలవరాన్ని తన కలగా చంద్రబాబు అభివర్ణించడం గమనార్హం.

చారిత్రక తప్పిదం వల్లే విధ్వంసం

- విభజన నేపథ్యంలో 2014లో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం వంద శాతం వ్యయాన్ని తామే భరించి పూర్తి చేస్తామని విభజన చట్టంలో హామీ ఇచ్చింది. ఆ మేరకు పనులు చేపట్టేందుకు పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ)ని ఏర్పాటు చేసింది. 2014 జూన్ 8న సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు పీపీఏతో ఒప్పందం చేసుకోకుండా పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి అప్పగించాలని కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. ఈ క్రమంలో ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు సిద్ధమవడంతో 2016 సెప్టెంబరు 7న అర్ధరాత్రి పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి కేంద్రం అప్పగించింది. నీటిపారుదల విభాగానికి అయ్యే వ్యయాన్ని మాత్రమే 2013–14 ధరల మేరకు ఇస్తామని కేంద్రం పెట్టిన మెలికకు చంద్రబాబు అంగీకరించారు. ఆ మరుసటి రోజే అంటే 2016 సెప్టెంబరు 8న హెడ్‌వర్క్స్ (జలాశయం) పనుల అంచనా వ్యయాన్ని రూ.1,481 కోట్లు పెంచేశారు.
- ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కిన చంద్రబాబు కమీషన్ల దాహంతో ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్‌ని అడ్డుపెట్టుకుని పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను పూర్తి చేయకుండానే.. 2017 నవంబర్‌లో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో 1,396 మీటర్ల పొడవున పునాది డయాఫ్రమ్ వాల్ పనులు చేపట్టి 2018 జూన్ 11 నాటికి పూర్తి చేశారు.
- స్పిల్‌వే పునాది స్థాయిలో ఉండగానే.. 2018 నవంబర్‌లో 35 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని పీపీఏ, సీడబ్ల్యూసీకి హామీ ఇచ్చి ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను చంద్రబాబు ప్రారంభించారు. వాటిని ప్రధాన ప్రాజెక్టుగా భ్రమింపజేసి 2019 ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది ఆయన ఎత్తుగడ. కానీ 2019 ఫిబ్రవరి నాటికి కూడా నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదు. నిర్వాసితులకు పునరావాసం కల్పించలేక.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి చివరకు చేతులెత్తేశారు.
- 2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 2019 జూన్ రెండో వారంలోనే గోదావరికి వరద ప్రారంభమైంది. ఆ ఏడాది వచ్చిన భారీ వరద ప్రవాహం ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడంతో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై సగటున 26 నుంచి 36.5 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ కోతకు గురై నాలుగు చోట్ల 485 మీటర్ల మేర దెబ్బతింది.
- ఎగువ కాఫర్ డ్యామ్ ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేయడం వల్లే గోదావరి వరద అధిక ఉధృతితో ప్రవహించి ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో కోతకు గురై విధ్వంసం చోటు చేసుకుందని, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని, ఇది పూర్తిగా మానవ తప్పిదం వల్లే జరిగిందని ఐఐటీ–హైదరాబాద్, ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) నిపుణులు స్పష్టంగా తేల్చిచెప్పారు. తద్వారా చంద్రబాబు నిర్వాకాలను నిర్ధారించారు. 2019 మే 30న వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించగా అదే ఏడాది జూన్ రెండో వారంలో వరద ప్రారంభమైంది. అలాంటప్పుడు 12 రోజుల్లో కాఫర్ డ్యామ్‌ల ఖాళీలను పూర్తి చేసి, నిర్వాసితులకు పునరావాసం కల్పించడం అసాధ్యం. దీన్నిబట్టి నాడు చంద్రబాబు సర్కార్ తప్పిదం వల్లే ఈ విధ్వంసం చోటుచేసుకుందని ఐఐటీ–హైదరాబాద్, ఎన్‌హెచ్‌పీసీలు తేల్చిచెప్పినట్లు స్పష్టమవుతోంది. తాను చేసిన ఈ చారిత్రక తప్పిదాన్ని వైఎస్ జగన్‌పై నెట్టేందుకు చంద్రబాబు పదేపదే యత్నిస్తుండటాన్ని నిపుణులు తప్పుబడుతున్నారు.

కొసమెరుపు

'గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను కట్టాలి. కట్టాక ఎర్త్ కమ్ ర్యాక్ ఫిల్ డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్ వేయాలి' అని అన్యాపదేశంగా తాజాగా సీఎం చంద్రబాబు అంగీకరించడం కొసమెరుపు. కాఫర్ డ్యామ్‌ల జీవితకాలం మూడు నాలుగేళ్లకు మించి ఉండదని అధికారులకు చెబుతున్న సమయంలో అన్యాపదేశంగా తాను చేసిన చారిత్రక తప్పిదాన్ని అంగీకరించారు.

14 ఏళ్లలో... 24.85% ఐదేళ్లలోనే... 24.94%

పోలవరం పనులను 2014–19 మధ్య తాను 72 శాతం చేస్తే.. 2019–24 మధ్య వైఎస్ జగన్ అరకొరగా చేశారంటూ సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. కానీ.. పోలవరం పనులు ఇప్పటికి పూర్తయింది 49.79 శాతమే. ఇందులో 2005 నుంచి 2019 మధ్య జరిగిన పనులు 24.85 శాతం కాగా మిగతా 24.94 శాతం పనులు 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పూర్తి కావడం గమనార్హం. 2005–14 మధ్య దివంగత వైఎస్సార్ హయాంలో రూ.4,730.71 కోట్ల విలువైన పనులు జరిగాయి. 2014–19 మధ్య చంద్రబాబు రూ.10,649.39 కోట్లు వ్యయం చేశారు. 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రూ.8,629 కోట్లు వ్యయం చేశారు. వాస్తవం ఇలా ఉంటే.. 2014–19 మధ్య తాను రూ.11,762.47 కోట్లు వ్యయం చేశానని.. 2019–24 మధ్య కేవలం రూ.4,167 కోట్లను మాత్రమే జగన్ సర్కార్ ఖర్చు చేశారని చంద్రబాబు చెప్పడం విస్మయం కలిగిస్తోంది. ఇక పోలవరం పనులకు రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి వెచ్చించిన రూ.3,385.58 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేసింది. అంటే.. ఆ డబ్బు రాష్ట్ర ఖజానాలోకి చేరింది. కానీ.. దాన్ని వైఎస్ జగన్ సర్కార్ దారి మళ్లించినట్లుగా చంద్రబాబు చిత్రీకరించడాన్ని ఆర్థిక నిపుణులు తప్పుబడుతున్నారు.

45.72 మీటర్లకు ఒక్క ఇంచ్ కూడా తగ్గదు

పోలవరం ఎత్తును 41.15 మీటర్లకు తగ్గిస్తున్నారంటూ 2021 నుంచి పాడుతున్న పాటనే చంద్రబాబు తాజాగా మరోసారి పాడారు. అయితే ప్రాజెక్టు స్పిల్‌వేను ఇప్పటికే నిర్మించామని.. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పూర్తయ్యాక టేపు తీసుకుని వెళ్లి కొలుచుకోవాలని.. 45.72 మీటర్ల కంటే ఒక్క ఇంచ్ కూడా తగ్గదని 2021 నుంచి 2024 దాకా వైఎస్ జగన్ చెబుతూనే ఉన్నారు. అప్పటి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కూడా ఇదే అంశాన్ని లోక్‌సభ, రాజ్యసభలో రాతపూర్వకంగా తేల్చి చెప్పారు. ఏదైనా ప్రాజెక్టు పూర్తయ్యాక డ్యామ్ భద్రత దృష్ట్యా ఒకేసారి గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయరు. సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ప్రాజెక్టు పూర్తయిన మొదటి ఏడాది నీటి నిల్వ సామర్థ్యంలో 1/3వ వంతు.. ఆ తర్వాత నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ 2/3వ వంతు.. డ్యామ్ భద్రతను పరిశీలిస్తూ, నిర్వాసితులకు పునరావాసం కల్పించి మూడో ఏడాది పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తారు. ఈ మార్గదర్శకాల మేరకే పోలవరంలో తొలి ఏడాది 41.15 మీటర్ల ఎత్తులతో నీటిని నిల్వ చేస్తారు. దాన్నే ప్రాజెక్టు ఎత్తుగా చంద్రబాబు చిత్రీకరించటాన్ని అధికారవర్గాలే తప్పుబడుతున్నాయి.




చంద్రబాబు హయాంలో నిర్మించగా 2019లో వచ్చిన వరదకు దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్

సవాళ్లను అధిగమిస్తూ వడివడిగా..

- చంద్రబాబు చారిత్రక తప్పిదాల వల్ల పోలవరంలో చోటుచేసుకున్న విధ్వంసాన్ని చక్కదిద్దుతూ పనులను వైఎస్ జగన్ ప్రణాళికాబద్ధంగా పరుగులెత్తించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను ప్రారంభించడానికి ముందు అంటే 2018 నవంబర్‌కు ముందు.. నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం గోదావరిలో ఇసుక సాంద్రతను ట్రాన్స్‌ట్రాయ్ తప్పుగా లెక్కించింది. ఆ తప్పుడు లెక్క ప్రకారమే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు పునాదిగా 20 మీటర్ల లోతు నుంచి స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ చేసింది. కానీ.. గోదావరి ఇసుక సాంద్రతను పరిగణలోకి తీసుకుంటే 30 నుంచి 35 మీటర్ల లోతు నుంచి స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ చేయాలి. కానీ 20 మీటర్ల లోతులోనే స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ వేయడం వల్ల ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీలు అధికంగా ఉన్నాయి. ఆ లీకేజీలను అధిగమిస్తూ ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన భారీ అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు.
- దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ స్థానంలో సమాంతరంగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలా? లేదంటే దెబ్బతిన్న చోట్ల 'యూ' ఆకారంలో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించి పాత దానితో అనుసంధానం చేయాలా? అనే విషయంపై తేల్చి చెబితే 18 నెలలల్లోగా ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి వైఎస్ జగన్ కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. అంతర్జాతీయ నిపుణుల సహకారం తీసుకుని వారు సూచించిన డిజైన్‌ల మేరకు పనులు చేపడదామని పీపీఏ, సీడబ్ల్యూసీ పేర్కొన్నాయి. ఆ మేరకు ఫిబ్రవరిలో అంతర్జాతీయ నిపుణులను ఖరారు చేశాయి.
- 2013–14 ధరల ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.20,396 కోట్లుగా ఉంది. అయితే 2017–18 ధరల ప్రకారం నిర్వాసితుల పునరావాసం, భూసేకరణకే రూ.33 వేల కోట్లు అవసరం. ఈ నేపథ్యంలో పాత ధరలతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని, తాజా ధరల మేరకు నిధులిచ్చి పోలవరం పూర్తి చేసేందుకు సహకరించాలని ప్రధాని మోదీని నాడు వైఎస్ జగన్ పలుదఫాలు కోరారు. దీనిపై ఎట్టకేలకు సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ ఆ మేరకు నిధులు విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖను ఆదేశించారు. ఈ నేపథ్యంలో తొలిదశ పూర్తికి రూ.12,157.53 కోట్లు విడుదల చేయాలని సూచిస్తూ మార్చి 6న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పటికే బీజేపీతో టీడీపీకి పొత్తు కుదరడంతో నిధులు ఇచ్చే ఫైలుపై ఆమోదముద్ర వేస్తే రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని భావించిన చంద్రబాబు తెరచాటున బీజేపీ పెద్దలతో మంత్రాంగం నడిపారు. దీంతో ఆ ఫైలును కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది. లేదంటే మార్చి ఆఖరులోనే రూ.12,157.53 కోట్లు పోలవరానికి విడుదలయ్యేవి.


ముఖ్యమంత్రిగా చంద్రబాబు దిగిపోయే ముందు 2019 మార్చిలో స్పిల్ వే గేట్లు ఇలా..


వైఎస్ జగన్ ప్రభుత్వం 2021 ఆగస్టు నాటికి ఏర్పాటుచేసిన స్పిల్‌వే గేట్లు

'ఎన్నికల విధులకు' గౌరవ వేతనంగా ఒక నెల జీతం

కలెక్టర్లకు సీఈవో మీనా ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా నియమితులైన సిబ్బంది, ఆఫీసర్లకు ఒక నెల స్థూల జీతాన్ని గౌరవ వేతనంగా ఇవ్వాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన వారికి ఒక నెల జీతం గౌరవ వేతనానికి తగ్గట్టుగా బిల్లులు తయారు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

సీఐడీ అదనపు డీజీగా రవిశంకర్ అయ్యన్నార్

ముగ్గురు ఐపీఎస్ అధికారుల బదిలీ



సాక్షి, అమరావతి: సీఐడీ అదనపు డీజీగా రవిశంకర్ అయ్యన్నార్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే, ప్రస్తుతం అదనపు డీజీ (శాంతి, భద్రతలు) శంఖబ్రత బాగ్చీని విశాఖ సీపీగా, అతుల్ సింగ్‌ను ఏసీబీ అదనపు డీజీగా నియమిస్తూ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.


మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర కార్మిక శాఖ పరిధిలోని విభాగాల్లో, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల పరిశీలనకు అంతర్గత కమిటీని ఏర్పాటు చేస్తూ ఆ శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీకి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీ సెక్రటరీ వి.లక్ష్మి, అధికారులు బి.రఘువీరాంజనేయులు, కె. రోహిణి, కె. శైలజ సభ్యులుగా ఉన్నారు. మహిళా ఉద్యోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కమిటీ పదవీకాలం మూడేళ్లు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జగన్ వల్లే.. ప్రమాదంలో పోలవరం

పోలవరంపై శ్వేతపత్రంలో సీఎం చంద్రబాబు

- జగన్ అసమర్థత, దుస్సాహసం వల్ల పోలవరం మనుగడే ప్రమాదంలో పడింది
- మూడు డ్యామేజీలకు ఆయన నిర్వాకాలే కారణం.. అందుకే ఆలస్యం
- ఏజెన్సీలను మార్చొద్దన్న పీపీఏ హెచ్చరికలను పెడచెవిన పెట్టారు
- ప్రాజెక్టు కోసం కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించారు
- పోలవరం ఎత్తు 41.15 మీటర్లే అంటూ కుదింపు యత్నాలు
- టీడీపీ హయాంలో 72 శాతం పనులు.. గత ప్రభుత్వం చేసింది 3.84 శాతం మాత్రమే
- ఇరిగేషన్ వెబ్‌సైట్ ప్రారంభించి అన్ని అంశాలను పొందుపరుస్తాం



సాక్షి, అమరావతి: పోలవరంలో విధ్వంసంతో మాజీ సీఎం జగన్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆరోపించారు. జగన్ మూర్ఖత్వం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని, ఆ విషయం ఆయనకు రెండేళ్ల తర్వాత తెలిసిందన్నారు. గత సర్కారు నిర్వాకంతో ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులు కూడా పూర్తిగా మారిపోయాయని చెప్పారు. పోలవరంపై శుక్రవారం సచివాలయం మొదటి బ్లాక్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 'వైఎస్సార్ సీపీ ఐదేళ్ల విధ్వంసంతో రాష్ట్రం ఎలా నష్టపోయిందో ప్రజల్లో చర్చ జరగాలి. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు మన సమస్యలు తెలియచేయాలి. 25 రోజుల్లో 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేసి తరువాత రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడతాం. ఇరిగేషన్ వెబ్‌సైట్ ప్రారంభించి అందులో అన్ని అంశాలను ఉంచుతాం. అవాస్తవాలన్నింటికీ ప్రజలే బుద్ధి చెప్పేలా వాస్తవాలను వారి ముందు ఉంచుతాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఇష్టానుసారంగా నిర్ణయాలు..

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంపైనే మొదటి శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం. పోలవరానికి టీడీపీ హయాంలో రూ.11,762.47 కోట్లు ఖర్చు చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. జగన్ అహంభావం వల్లే ప్రాజెక్టు దెబ్బతింది. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే ప్రాజెక్టు పనులు నిలిపేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే పనులు చేస్తున్న ఏజన్సీలను తొలగించారు. 2019 జూన్ నుంచి నవంబర్ వరకు ప్రాజెక్టుకు ఏజన్సీ లేదు. వరదలతో డయాఫ్రం వాల్ దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు స్పష్టం చేశారు. డయాఫ్రం వాల్ దెబ్బతిందని రెండేళ్ల తర్వాత కనుక్కున్నారు. టీడీపీ హయాంలో నియమించిన కాంట్రాక్టరు పనితీరు సంతృప్తికరంగానే ఉందని, మార్చాల్సిన పనిలేదని పీపీఏ మినిట్స్‌లో పేర్కొంది. 2009లో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్ల హెడ్ వర్క్స్ పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌ను మార్చడం, ముందు చూపు లేకపోవడం వల్ల పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని కేంద్ర ఇరిగేషన్ సెక్రటరీకి పీపీఏ లేఖ కూడా రాసింది.

మూడు డ్యామేజీలతో పనులు ఆలస్యం..

డయాఫ్రం వాల్, ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. 2018లో రూ.436 కోట్లతో డయాఫ్రం వాల్ పూర్తి చేశాం. గత ప్రభుత్వ నిర్వాకంతో డ్యామేజ్ అయిన పనులకు రూ.447 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారు. కొత్త డయాఫ్రం వాల్ కట్టాలంటే రూ.990 కోట్లు ఖర్చు అవుతుంది. అందుకు మూడు నాలుగు సీజన్లు పడుతుందంటున్నారు. జగన్ మూర్ఖత్వంతో చేసిన పనికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఎగువ కాఫర్ డ్యాం నుంచి వచ్చిన వరద ఉధృతికి గ్యాప్‌– 1 వద్ద 150 మీటర్లు గట్టు కొట్టుకుపోయింది. గైడ్ బండ్ కుంగిపోయింది. నేరుగా నీళ్లు వస్తే ప్రెజర్ తగ్గుతుందని గైడ్ బండ్‌ను రూ.80 కోట్లతో నిర్మించాం. ఈ డ్యామేజీలు జగన్ నిర్వాకం వల్లే జరిగినవే. వాటి వల్ల ప్రాజెక్టు పనులు, పవర్ హౌస్ ఆలస్యం అవుతున్నాయి.

కేంద్ర నిధులు దారి మళ్లించారు..

పోలవరంలో టీడీపీ ఐదేళ్లలో 72 శాతం పనులు పూర్తి చేస్తే వైఎస్సార్ సీపీ 3.84 శాతం మాత్రమే పూర్తి చేసింది. టీడీపీ హయాంలో రాష్ట్ర నిధులు ఖర్చు చేసి రీయింబర్స్ చేయించాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులు కూడా ప్రాజెక్టు కోసం ఖర్చు చేయకుండా రూ.3,385 కోట్లు దారి మళ్లించింది. 45.72 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడితే గత ప్రభుత్వం 41.15 మీటర్లకు కుదించింది. రూ.55,548 కోట్లకు కేంద్రం ఆమోదం తెలిపేలా మేం కృషి చేస్తే గత ప్రభుత్వం అసలు నిధులు కూడా అడగలేదు. నిర్వాసితులకు జగన్ ఎన్నో హామీలిచ్చి మోసం చేశారు. పరిహారం ఎకరాకు రూ.19 లక్షలు ఇస్తానన్నారు. పరిహారం అందిన వారికి కూడా రూ.5 లక్షలు అదనంగా ఇస్తానన్నారు. సకల వసతులతో కాలనీలు నిర్మిస్తానని చెప్పి ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. పునరావాసానికి టీడీపీ ప్రభుత్వం రూ.4,114 కోట్లు ఖర్చు చేసి మోడల్ కాలనీలను నిర్మిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1,687 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

ప్రాజెక్టుపై పూటకో మాట

పోలవరం పూర్తిపై పూటకో మాట మాట్లాడారు. మొదటిసారి 2021 ఏప్రిల్ నాటికి, రెండోసారి 2021 డిసెంబర్ నాటికి, మూడోసారి 2022 ఏప్రిల్ నాటికి, నాలుగో సారి 2022 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని చెప్పి ఇక ఐదోసారి ఎప్పటికి పూర్తి అవుతుందో చెప్పలేమని చేతులెత్తేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు ఇప్పుడు కేంద్రం అంతర్జాతీయ నిపుణులను ఆహ్వానించి ప్రాజెక్టు దుస్థితిపై అధ్యయనం చేయాల్సి వస్తోంది. హైడల్ ప్రాజెక్టు 2020 నాటికి పూర్తి కాకపోవడంతో ప్రభుత్వానికి రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. డ్యామేజ్, రిపేరు పనులకు రూ.4,900 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటికే ప్రాజెక్టు ఖర్చులు 38 శాతం మేర పెరిగాయి. టీడీపీ హయాంలో పోలవరం పనుల్లో అవినీతి జరగలేదని కేంద్ర జలశక్తి శాఖ పార్లమెంట్‌లో సమాధానం ఇచ్చింది.

జగన్ దుస్సాహసమే కారణం..

కాఫర్ డ్యాం, డయాఫ్రం వాల్, గైడ్ బండ్‌తో పాటు అన్ని చోట్లా సమస్యలు సృష్టించారు. ప్రాజెక్టు సర్వనాశనానికి జగన్ దుస్సాహసమే కారణం. కాఫర్ డ్యాం ద్వారా నీరు లీక్ అవుతోంది. దాన్ని పరిష్కరించకుండా పనులు ముందుకు సాగవు. ఇంజనీర్లు రిస్క్ తీసుకోవాలంటే భయపడే పరిస్థితికి వచ్చారు. డయాఫ్రం వాల్‌కు కనీసం రెండు సీజన్ల సమయం పడుతుందని అధికారులు చెప్పినదాన్ని బట్టి తెలుస్తోంది. 45.72 మీటర్ల ఎత్తుతోనే నిర్మాణం జరుగుతుంది. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ కూడా అదే ఎత్తులో ఉంటుంది. మనమంతా కలసి పని చేసి సంక్షోభం నుంచి ప్రజల్ని, రాష్ట్రాన్ని బయటకు తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా. కేంద్రం అనుమతితో ట్రాన్స్‌ట్రాయ్‌తో చేసుకున్న ధరల ఒప్పందం ప్రకారమే నవయుగకు పనులు అప్పగించాం. కానీ గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పిలిచింది.

సీఎం చంద్రబాబును కలిసిన తెలంగాణ గవర్నర్



సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి విజయవాడ పశ్చిమ): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చిన ఆయన ఉండవల్లిలోని సీఎం నివాసానికి వెళ్లారు. తెలంగాణ గవర్నర్ మర్యాదపూర్వకంగానే సీఎంను కలిసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

దుర్గమ్మ సన్నిధిలో: తెలంగాణ గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం తెలంగాణ గవర్నర్ గుంటూరు కృష్ణానగర్ రామాంజకూటంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్నారు.

పవన్.. కేంద్రం నుంచి నిధులు తేవాలి: సోము వీర్రాజు



రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల అభివృద్ధి కోసం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీల తీరు ఏమీ మారలేదన్నారు. కాంగ్రెస్‌లో ఎమర్జెన్సీ నాటి పోకడలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయన్నారు. ఈవీఎంలను జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ఆధారంగా అధికార, ప్రతిపక్షాలు ఏవిధంగా గెలిచాం, ఏవిధంగా ఓడిపోయామని సమీక్ష చేసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులు, వలస కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. విద్య, ఆరోగ్యం, రూరల్ హెల్త్ విషయంలో కేంద్రం ప్రకటించిన రూ.లక్ష కోట్లతో దేశంలోని వివిధ కారిడార్లను పునర్నిర్మాణం చేయాలన్నారు.

బాబు తప్పిదాలే పోలవరానికి శాపం

- 2013 –14 రేట్లతో 2016లో అంగీకరించడం ద్రోహం కాదా?
- స్పిల్ వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, నది డైవర్షన్ పూర్తి చేయకుండా కాఫర్ డ్యాములు ప్రారంభించడం తప్పు
- చారిత్రక తప్పిదాలన్నీ చంద్రబాబు చేసి అవన్నీ జగన్‌పై రుద్దేస్తారా?
- మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు గత తప్పిదాల వల్లే పోలవరం ప్రాజెక్టు సర్వనాశనం అయ్యిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ప్రాజెక్టు విషయంలో వ్యూహాత్మక తప్పిదాలన్నీ మునుపటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన ప్రాజెక్టును చంద్రబాబు తీసుకున్నారని, 2013 – 2014 రేట్లతో 2016లో ప్రాజెక్టును టేకోవర్ చేసి తప్పు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం పేరుతో పోలవరం గురించి ఒక సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చారని, అందులో వాస్తవాలు లేవన్నారు. అన్నీ తప్పులు చెబుతున్నాననే భయం చంద్రబాబులో కనిపించిందని చెప్పారు. ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారనే దానికి సమాధానం లేదన్నారు. ప్రతి సోమవారం పోలవరం అన్న చంద్రబాబు ఇకపై వెళ్లబోనని ఇవాళ చెప్పడం బాధ్యత నుంచి తప్పుకోవడమేనని మండిపడ్డారు. అదేమంటే జగన్ మోహన్‌రెడ్డి విధ్వంసం అంటున్నారని, కాంట్రాక్టర్లను మార్చేయడంతో విధ్వంసం జరిగిపోయిందని చెబుతున్నారని ధ్వజమెత్తారు. మళ్లీ జగన్ ఈ రాష్ట్రంలో ఒక బలమైన శక్తిగా ఎదుగుతారని.. ఆయనకు 40 శాతం ఓటు బ్యాంకు ఉందనే భయం మీ అందరిలో ఉందన్నారు. మీరు ముగ్గురు కలిసినా కేవలం 56 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని.. చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోలేడు కాబట్టి మళ్లీ జగన్ ఎదిగిపోవడం ఖాయం అని చెప్పారు. 2019లో చంద్రబాబు దిగిపోయేనాటికి పోలవరం ప్రాజెక్టు పరిస్థితి, 2024లో వైఎస్ జగన్ ఏ స్థాయికి నిర్మించిందీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా అంబటి ఇంకా ఏమన్నారంటే..

అన్ని అనుమతులు తెచ్చింది వైఎస్సారే

- కేంద్రంతో మాట్లాడి వైఎస్ రాజశేఖరరెడ్డి దాదాపు అన్ని అనుమతులు తెచ్చారు. 2005 సెప్టెంబర్‌లో నిర్మాణ స్థలానికి, 2005 అక్టోబర్‌లో పర్యావరణ, 2006 జూలైలో వన్యప్రాణుల రక్షణ, 2007 ఏప్రిల్‌లో పునరావాస ప్రణాళిక, 2008లో పాపికొండల వన్యప్రాణ రక్షణ కేంద్రం మళ్లింపునకు అనుమతులు తీసుకొచ్చారు. 2008 డిసెంబర్‌లో అటవీ శాఖ స్టేజ్ 1, 2009 జనవరిలో సీడబ్ల్యూసీ సాంకేతిక అనుమతి, 2009 ఫిబ్రవరిలో కేంద్ర ప్రణాళిక శాఖ అనుమతి, 2009 మార్చిలో కేంద్ర ఆర్థిక శాఖ కమిటీ అనుమతులు తీసుకొచ్చారు. 2010 జూలైలో అటవీ శాఖ స్టేజ్ 2 అనుమతి లభించింది. ఈ ఫైల్ అంతా వైఎస్సార్ హయాంలోనే నడిచింది.
- అనేక సార్లు విజిట్ చేసి, ఎంపీలతో కలిసి వెళ్లి అన్ని అనుమతులూ తీసుకొచ్చిన మహానుభావుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన కలలుగన్న ప్రాజెక్టు ఇది. ఆయన హయాంలోనే నిర్మాణం ప్రారంభమైంది. కాలువలు తవ్వారు. రాజశేఖరరెడ్డి కంటే ముందే ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. జీవనాడి అయిన పోలవరం గురించి ఎందుకు ఆలోచించలేదు?

అవినీతి డబ్బు కోసమే చంద్రబాబు తాపత్రయం

- రాష్ట్ర ప్రజల సంక్షేమం, వ్యవసాయం బాగుండాలని వైఎస్సార్ ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తే.. కరప్షన్, డబ్బుల కోసం చంద్రబాబు కక్కుర్తిపడి కేంద్రం నుంచి తీసుకున్నారు. ఈ మాట సాక్షాత్తూ మీ పార్ట్‌నర్ మోదీ చెప్పిందే. ఆ రోజు మోదీతో విడిపోయి, ప్రత్యేక హోదా, పోలవరానికి డబ్బులు ఇవ్వడం లేదని బజారుకెక్కినప్పుడు మోదీ ఈ విషయాలు చెప్పారు. పోలవరం చంద్రబాబుకు ఏటీఎం అని కూడా చెప్పారు.
- 2016లో ఒప్పందం కుదిరిన తర్వాత ట్రాన్స్‌ట్రాయ్‌ని తీసేసి నవయుగను ఎంటర్ చేశారు. నవయుగ కాంట్రాక్టర్ రామోజీరావు బంధువే. కాంట్రాక్టర్‌ను నామినేషన్ పద్ధతిలో మార్చారు. నవయుగను జేబు సంస్థగా పెట్టుకుని డబ్బులు కొట్టేసే కుట్ర చేసినందుకే.. మేము అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ ద్వారా నవయుగను మార్చి మేఘాకు ఇచ్చాం. ట్రాన్స్‌ట్రాయ్ నుంచి నవయుగకు మీరు మార్చవచ్చుగానీ, నవయుగ నుంచి మార్చడం చాలా విధ్వంసం అంటూ వ్యాఖ్యానించడం ఒక్క చంద్రబాబుకే చెల్లింది. తప్పులన్నీ మీరు చేసి జగన్‌పై రుద్దడం దుర్మార్గం.

చంద్రబాబువి పచ్చి అబద్ధాలు..

- కాఫర్ డ్యాములు పూడ్చకపోవడం వల్లనే డయాఫ్రం వాల్ దెబ్బతిందని, ఇదే జగన్ చేసిన తప్పు అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. నది డైవర్ట్ కానప్పుడు నదిలో నీళ్లు ఎగదన్నితే నది పైభాగంలో ఉన్న 54 గ్రామాలు మునిగిపోతాయి. స్పిల్ వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్ కంప్లీట్ అయిన తర్వాత, నదిని మొత్తాన్ని డైవర్ట్ చేసిన తర్వాత మాత్రమే కాఫర్ డ్యాముల డ్యామేజీలను పూడ్చాల్సి ఉంటుంది. చంద్రబాబు గేట్లు పెట్టకుండా రేకులు పెట్టి పాటలు పాడించి, భజనలు చేయించారు. నదిని డైవర్ట్ చేయడం అయిపోయిన తర్వాత మాత్రమే, అంటే స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, మరో చానల్ పూర్తి చేసి నదిని డైవర్ట్ చేసిన తర్వాతే కాఫర్ డ్యాములు నిర్మించాలి. ఆ తర్వాత డయాఫ్రం వాల్ నిర్మించాలి.
- నదిని మళ్లించడం కంప్లీట్ కాలేదు. అయినా డయాఫ్రం వాల్ కట్టేశారు. కాఫర్ డ్యాములు వేసేశారు, బొక్కలు పెట్టారు. వాటిని మేము పూడ్చాలంటారు. కాంట్రాక్టర్ లేకపోవడం వల్ల పూడ్చలేదంటారు. చంద్రబాబూ.. ఇన్ని అబద్ధాలు ఎందుకు? డయాఫ్రం వాల్ దెబ్బతిందని నేషనల్ పవర్ కార్పొరేషన్ నిపుణులు వచ్చి ఆరు నెలలు పరీక్షించి చెప్పారు. దాన్ని మరమ్మతులు చేసుకుంటారో, సమాంతరంగా మరో డయా ఫ్రం వాల్ నిర్మించుకుంటారో చూసుకోవాలని చెప్పారు.
- ఇవాళ జరిగిన సమావేశంలో 41.15 మీటర్లు ఏమిటి? 45.72 మీటర్లు ఏంటని మీడియా ప్రతినిధులు అడిగితే చంద్రబాబు చూడాలి.. అంటూ దాటవేశారు. బహుశా ఆయనకూ అర్థం కాలేదేమో. 41.15 మీటర్ల ఎత్తున ప్రాజెక్టు తొలి దశ పూర్తవుతుంది. ఆ మేరకు నీటిని నిలబెట్టాలి. గ్రావిటీ ద్వారా పంపిస్తారు. ఆ తర్వాత ప్రాజెక్టును పరిశీలించాక రెండో దశ 45.72 మీటర్లలో నీళ్లు నింపుతారు. ఎవరు అధికారంలో ఉన్నా ఈ రెండు దశల్లో మాత్రమే పూర్తి చేయాల్సి ఉంటుంది.

చంద్రబాబు ఘోర తప్పిదాలు ఇవే..

- చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదాల వల్లే పోలవరం సర్వనాశనమైంది. ఒక్క రోజులో 32,315 క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీట్ వేసి గిన్నిస్ రికార్డు అని చంద్రబాబు డబ్బా కొట్టుకున్నారు. స్పిల్ వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, నది డైవర్షన్ కంప్లీట్ కాకుండానే కాఫర్ డ్యాములు ప్రారంభించి డయాఫ్రం వాల్ పూర్తి చేయడం పెద్ద తప్పు.
- జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పునరావాసం, రిహాబిలిటేషన్, వాటర్ కాంపోనెంట్, విద్యుత్ కాంపోనెంట్.. ప్రతిదీ కూడా కేంద్రమే చేసి ఇవ్వాలని విభజన చట్టంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ ప్రాజెక్టును బాబు తీసుకోవడం చరిత్రాత్మక తప్పిదం.
- 2018కే పూర్తి చేసి నీళ్లు నిలబెట్టి అపరభగీరథుడు చంద్రబాబు అని నిరూపిస్తామని చెప్పిన ఆయన అది చేయలేకపోయారు.
- మొదటగా పనులు చేపట్టిన ట్రాన్స్ ట్రాయ్ ఏజెన్సీ వాళ్లు కోరినట్లుగా 2011 –12 రేట్ల ప్రకారం అగ్రిమెంట్ అయితే, చంద్రబాబు మాత్రం 2015 –16 రేట్ల ప్రకారం రూ.1,332 కోట్లు సమర్పించేశారు. నామినేషన్ పద్ధతిలో నవయుగకు పెంచిన 2015 –16 రేట్ల ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.3 వేల కోట్ల విలువైన పని అప్పగించారు.

సారూ.. ఫీజు డబ్బులివ్వరూ..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థుల భోజన, వసతి ఖర్చుల కోసం ప్రతి విద్యా సంవత్సరం జూన్‌లో, ఆ తర్వాత ఏప్రిల్లో రెండు వాయిదాల్లో జగనన్న వసతి దీవెన అందించేవారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర విద్యార్థులకు రూ.20 వేల చొప్పున చెల్లించేవారు. అయితే, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా, ప్రభుత్వం ఫీజులను ఇప్పటి వరకు విడుదల చేయలేదు. దీంతో కళాశాలలు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇకపై విద్యార్థులు కట్టే ఫీజులను నేరుగా కళాశాలల ఖాతాల్లోనే జమ చేస్తామని కొత్త ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ముగిసిన విద్యా సంవత్సరం ఫీజులపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం ద్వారా వాటికి మంగళం పాడినట్టేనని తెలుస్తోంది. పేద విద్యార్థుల చదువులకు బాసటగా నిలుస్తూ నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించేందుకు గత జగన్ ప్రభుత్వం విద్యా దీవెన పథకాన్ని ప్రారంభించింది. క్రమం తప్పకుండా ఏ త్రైమాసికం ఫీజు ఆ త్రైమాసికం అయిన వెంటనే చెల్లిస్తూ వచ్చింది. ఈ క్రమంలో 2023 అక్టోబర్‌–డిసెంబర్ త్రైమాసికానికి 9,44,666 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.708.68 కోట్లను మార్చి ఒకటో తేదీన విద్యార్థులు–తల్లుల ఉమ్మడి ఖాతాల్లో జమ చేశారు. ఇప్పుడు జనవరి–ఏప్రిల్ మాసాలకు చెల్లించాల్సిన నిధులపై ఎలాంటి స్పందన లేదు. అలాగే దాదాపు 9.55 లక్షల మంది విద్యార్థులకు వసతి దీవెన కింద ఇవ్వాల్సిన సుమారు రూ.600 కోట్లపై ఎలాంటి నిర్ణయం ప్రకటించ లేదు.

విద్యా దీవెనపై 93 శాతం మంది చదువులు

రాష్ట్రంలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సుల్లోని 93 శాతం మంది విద్యార్థులు 'విద్యా దీవెన' ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకుంటూ చదువుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వం కాలేజీ విద్యకు ఫీజు ఎంత ఉన్నా రూ.35 వేలు మాత్రమే చెల్లించేది. ఇక వసతి దీవెన మాటే లేదు. ఫీజుల కోసం నాడు విద్యార్థుల తల్లిదండ్రులు ఇళ్లు, పొలాలు అమ్ముకునే పరిస్థితి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అర్హత గల ప్రతి విద్యార్థికీ ఫీజు ఎంత ఉన్నా నూరు శాతం చెల్లించారు. జవాబుదారీ తనం పెంచేలా, పారదర్శకంగా తల్లి, విద్యార్థి ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో త్రైమాసికానికోసారి విద్యా దీవెనను జమ చేశారు. అనంతరం వారు ఆ ఫీజును కళాశాలకు చెల్లించే వారు. అలా ఇప్పటిదాకా 27 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద రూ.18,576 కోట్లు (గత ప్రభుత్వ బకాయిలతో కలిపి) చెల్లించారు. ఏటా సగటున విద్యా దీవెన కింద రూ.2,835 కోట్లు, వసతి దీవెన కింద అత్యధికంగా రూ.1068.94 కోట్లు చెల్లించారు.

గత టీడీపీ పాలనా పరిస్థితులే తిరిగి ఉత్పన్నం!

గత టీడీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలు కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అనేక అవస్థలు పడ్డారు. ప్రభుత్వం కాలేజీలకు సకాలంలో ఫీజులు చెల్లించక పోవడంతో యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచేవి. పరీక్షలకు హాల్‌టికెట్లు, పాసైతే సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టేవి. ఫలితంగా చాలా కుటుంబాలు అప్పులుచేసి తమ పిల్లల ఫీజులు చెల్లించారు. కళాశాలల ఫీజు కంటే తక్కువ ఫీజు రీయింబర్స్ చేయడంతో పేద విద్యార్థుల కుటుంబాలపై మోయలేని ఆర్థిక భారం పడేది. మిగిలిన డబ్బు విద్యార్థులే చెల్లించాల్సిన పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫీజు ఎంతున్నా 100 శాతం రీయింబర్స్ చేయడంతో విద్యార్థులు నిశ్చింతగా చదువుకోగలిగారు. పైగా అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం 2017–19 మధ్య 16.73 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.1,778 కోట్లు సైతం జగన్ ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వ వివరాల ప్రకారం 2014–19 మధ్య చంద్రబాబు పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సగటున ఏడాదికి రూ.2066 కోట్లు, హాస్టల్ ఖర్చుల కింద రూ.362 కోట్లు మాత్రమే చెల్లించగా, జగన్ ప్రభుత్వం ఏడాదికి రూ.4,044 కోట్లు అందించింది. కొత్త ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనపై ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడం ద్వారా ఇక ఇచ్చే ప్రసక్తి లేదన్న సంకేతాలు పంపుతున్నట్టు విద్యా రంగ నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలవ్వడం ఖాయం.

ఫీజులు కట్టమని ఇబ్బందులు పెడుతున్నారు



నేను చిత్తూరు జిల్లాలోని ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నా. మొన్నటి వరకు సకాలంలో విద్యా దీవెన పథకం వల్ల లబ్ధి కలిగింది. ఈ ఏడాది విద్యా దీవెన నగదు ఇంకా విడుదల చేయలేదు. కళాశాలలేమో ప్రారంభమయ్యాయి. ఫీజు చెల్లించాలంటూ యాజమాన్యం రోజూ అడుగుతూనే ఉంది. అప్పు చేసి డబ్బులు తెచ్చి ఇవ్వడానికి అమ్మానాన్నలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలి.

– గౌతమ్, ఇంజనీరింగ్ విద్యార్థి, వావిల్‌తోట, పూతలపట్టు, చిత్తూరు జిల్లా

వసతి డబ్బులు త్వరగా ఇవ్వాలి



నా కుమారుడు పలమనేరులోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం హాస్టల్‌లో ఉండి చదువుతున్నాడు. గత రెండేళ్లు వసతి దీవెన పథకం కింద రూ.40 వేలు ఇచ్చారు. ఆ నగదును కళాశాలకు చెల్లించేవాళ్లం. కూలీ పనులు చేస్తే గాని మా పూట గడవదు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుండడంతో ఇబ్బంది లేకుండా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఎప్పుడు నగదు ఇస్తారో తెలియడం లేదు. ప్రస్తుత పాలకులు మా బాధను అర్థం చేసుకోవాలని కోరుతున్నాం. – వరలక్ష్మి, ములతిమ్మేపల్లి, పలమనేరు, చిత్తూరు జిల్లా.


వసతి దీవెన సొమ్ము ఎప్పుడిస్తారో!



గత రెండేళ్లుగా నాకు జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఏటా రూ.20 వేలు అందింది. ఈ విద్యా సంవత్సరం అందాల్సిన సొమ్ము కోసం ఎదురు చూస్తున్నాం. ఇంతవరకు విధివిధానాలు ఏవీలేవు. గతంలో నేరుగా మా వివరాలు గ్రామ సచివాలయానికి వచ్చేవి. నేరుగా మాకు ఉపకార వేతనాలు అందేవి. ఇప్పుడు ఈ కొత్త ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో తెలియని పరిస్థితి. అకడమిక్ ఇయర్ ప్రారంభమైంది. పుస్తకాలు, యూనిఫాం కొనుగోలుకు డబ్బుల అవసరం ఉంది. ఈ ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందో చెప్పక పోవడం ఆందోళన కలిగిస్తోంది.

– తాడ్డి వెంకటేష్, డిగ్రీ తృతీయ సంవత్సరం, లక్ష్మీపురం, రాజాం మండలం, విజయనగరం జిల్లా


పిల్లల ఫీజులు కట్టేదెట్లా?



నాకు ఇద్దరు పిల్లలు. ఒకరికి అమ్మఒడి, ఒకరికి విద్యా దీవెన పథకాల కింద జగనన్న ప్రభుత్వంలో వారి చదువులకు ఎలాంటి భారం లేకుండా ఆర్థిక భరోసా కల్పించారు. ఈ సంవత్సరం ఇంకా లబ్ధి పడలేదు. దీంతో మా పిల్లల చదువులకు సంబంధించి ఫీజులు కట్టడం భారంగా మారింది. మేం రోజూ కూలి పనులు చేసుకుంటే కానీ జీవనం సాగించలేని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి పిల్లల విద్యోన్నతి పథకాలను కొనసాగించి మాకు అండగా నిలవాలి.

– స్వర్ణలత, కరకంబాడి, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా

హాస్టల్ ఫీజు అడుగుతున్నారు



నేను ఎస్వీ యూనివర్సిటీలోని హాస్టల్‌లో ఉంటూ విదేశీ భాషా శాస్త్రం (ఎంఏ లింగ్విస్టిక్స్) పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమైనప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న వసతి దీవెనతోనే ఇక్కడ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. గతంలో వసతి దీవెన సకాలంలో అందుతుండడంతో ఎటువంటి ఇబ్బందులు లేవు. ఈ ఏడాది ఇప్పటి వరకు వసతి దీవెన అందకపోవడంతో యూనివర్సిటీ వారు హాస్టల్ ఫీజు చెల్లించాలని అడుగుతున్నారు. ఇది నాలాంటి వారికి చాలా ఇబ్బంది. వెంటనే ప్రభుత్వం వసతి దీవెన చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలి.

– మన్నం ప్రేమ్‌కుమార్, పీజీ విద్యార్థి, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా బాధ్యతల స్వీకారం



పల్లా శ్రీనివాసరావును అభినందిస్తున్న లోకేశ్

సాక్షి, అమరావతి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తనపై నమ్మకంతో గురుతర బాధ్యతను అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించేలా చూస్తానని, నామినేటెడ్ పదవుల ద్వారా వారిని ప్రభుత్వంతో భాగస్వామ్యం చేసి ముందు తీసుకెళ్లడమే తన ప్రధాన బాధ్యతని చెప్పారు. రాజకీయ ప్రేరేపిత కేసులను మూడునెలల్లో తీయించేలా కృషి చేస్తానన్నారు.

నారాయణ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ దాష్టీకం

మధురవాడ (విశాఖ జిల్లా): నారాయణ విద్యాసంస్థల్లో ఆగడాలు ఆగడం లేదు. లక్షల్లో ఫీజు కట్టిన విద్యార్థులను క్రమశిక్షణ పేరుతో వేధిస్తూ తీవ్రంగా కొడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం మధురవాడ దుర్గానగర్‌లో ఉన్న నారాయణ ఐఐటీ అండ్ మెయిన్స్ అకాడమీ డే క్యాంపస్‌లో సహచర విద్యార్థినితో మాట్లాడాడని ఒక విద్యార్థిని ప్రిన్సిపాల్ చెంపమీద కొట్టడమే కాకుండా అతడిని మూడో ఫ్లోర్ నుంచి కొట్టుకుంటూ గ్రౌండ్‌ఫ్లోర్ వరకు లాక్కొచ్చారు. బాధిత విద్యార్థి, అతడి తల్లిదండ్రులు తెలిపిన మేరకు.. పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన షేక్ హిమామ్ పదిరోజుల కిందట ఇక్కడ ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం సీఈవో మెయిన్స్ బ్రాంచ్‌లో చేరాడు. హిమామ్ కళాశాలలో ఆలస్యంగా జాయిన్ కావడంతో గురువారం అదే సెక్షన్‌లో ఉన్న ఓ విద్యార్థినితో నోట్స్ విషయమై మాట్లాడాడు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ రాజేష్ కనీస విచారణ చేయకుండానే చెంపపై గట్టిగా కొట్టారు. భయం, నొప్పితో విద్యార్థి అరవడంతో బోర్డుకు తల గుద్దించి, మూడోఫ్లోర్ నుంచి కొట్టుకుంటూ కిందికి లాక్కొచ్చారు. చెంప నల్లగా మారిపోయిన హిమామ్‌ను సహచర విద్యార్థుల సమక్షంలో ఇష్టానుసారం కొట్టారు. ఈ విషయాన్ని హిమామ్ తల్లిదండ్రులకు చెప్పి బాధపడ్డాడు. దీంతో శుక్రవారం అతడి తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిని నిలదీశారు. తల్లిదండ్రుల నిరసనతో ఈ దాష్టీకం బయటకు పొక్కింది. పీఎంపాలెం పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. దీనిపై ప్రిన్సిపాల్ రాజేష్‌ను అడగగా.. విద్యార్థులు అమ్మాయిలతో మాట్లాడకూడదని ముందే చెప్పినా పట్టించుకోలేదని, హిమామ్‌ను సన్మార్గంలో పెట్టడం కోసం చెంపపై కొట్టానని, క్రమశిక్షణ చర్యలే తప్ప మరేం కాదని చెప్పారు. విద్యార్థి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

సర్వభూతాల్లోనూ అంతర్యామిగా ఉండే పరమాత్మ ఒక్కడే. ఆ పరబ్రహ్మ ప్రసాదించిన శక్తిసామర్థ్యాల వల్లే, మనస్సు, బుద్ధి, తదితర ఇంద్రియాల సహాయంతో లోకులు వివిధ కర్మలు చూస్తూ తదనుగుణమైన శుభ లేక అశుభ ఫలాలు పొందుతుంటారు.

– కఠోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 29 జూన్ 2024

తొలి రౌండ్ ట్రంప్‌దేనా!

లాంఛనంగానైనా కరచాలనాల్లేవు. మర్యాదకైనా చిరునవ్వుల్లేవు. అసలు ఒకరివైపు ఒకరు చూసుకున్న క్షణాలే లేవు. శుక్రవారం దాదాపు 90 నిమిషాలపాటు సాగిన అమెరికా అధ్యక్ష అభ్యర్థుల తొలి సంవాదం అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌లపై ఇప్పటికే ప్రజానీకంలో పాతుకుపోయిన అభిప్రాయాలను మరింత దృఢపరిచింది. బైడెన్ తన విజయాలను ఘనంగా చాటలేరు. ట్రంప్ కన్నార్పకుండా అబద్ధాలు వల్లించటం మానుకోలేరు. వృద్ధాప్య ఛాయలు తనలో మచ్చుకైనా లేవని చాటేందుకు 81 యేళ్ల బైడెన్ తాపత్రయపడితే... న్యాయస్థానం తనను అపరాధిగా నిర్ధారించినా ఆత్మవిశ్వాసం మచ్చుకైనా సడల్లేదన్న అభిప్రాయం కలిగించేందుకు 78 యేళ్ల ట్రంప్ తంటాలు పడ్డారు. చిత్రమేమంటే – ఈ అంశాల్లో ఇద్దరికిద్దరూ విఫలమయ్యారు. బైడెన్‌కి ఇప్పటికే ఉన్న పాయింట్లు ఇంకా తగ్గగా... ట్రంప్ కాస్త మెరుగుపడిన మాట నిజమే అయినా అనుకున్నంతగా లేదు. 1960లో అధ్యక్ష పదవికి పోటీపడిన జాన్ ఎఫ్ కెనెడీ, రిచర్డ్ నిక్సన్‌లతో ప్రారంభమైన ఈ సంవాదం ఇంత పేలవంగా సాగిన సందర్భాలు ఎప్పుడూ లేవన్నది విశ్లేషకుల మాట. వచ్చే సెప్టెంబర్ 10న జరగబోయే రెండో సంవాదం సమయానికైనా బైడెన్ మెరుగుపడతారో లేదోనన్న దిగులు డెమాక్రటిక్ పార్టీని నిలువెల్లా వణికిస్తుండగా, రిపబ్లికన్ పార్టీ మాత్రం కులాసాగా సేదతీరుతోంది. బైడెన్ వంటి బలహీనుడు ప్రత్యర్థిగా ఉన్నప్పుడు ఇక చింత ఎందుకన్నది దాని భావన కావొచ్చు. ట్రంప్‌ను మించిన గెలుపు గుర్రం లేదని ఆ పార్టీ ఎప్పుడో నిర్ణయానికొచ్చింది. అధ్యక్ష అభ్యర్థుల సంవాదంలో మన మాదిరిగా అరుపులూ, కేకలూ ఉండవు. ఎదురుగా జేజేలుకొట్టే అభిమానులూ ఉండరు. ఒకరి ప్రసంగాల్లోకి ఒకరు చొరబడే సంస్కృతి కూడా లేదు. ప్రత్యర్థి చెప్పింది పూర్తిగా విని దీటైన, సహేతుకమైన జవాబు చెప్పగలిగినవారికి మద్దతు పెరుగుతుంది. కానీ ఇద్దరికీ అది పట్టలేదు. అడిగిన ప్రశ్నల్ని దాటేసే ట్రంప్ తీరు బుల్‌డోజర్‌ని మరపిస్తే, బైడెన్‌కు మాట పెగలడమే కష్టమైనట్టు కనబడింది. ట్రంప్ సంధించిన ప్రశ్నలకు జవాబివ్వటంతో మొదలుపెట్టినా... హఠాత్తుగా సంబంధంలేని మరో అంశంలోకి వెళ్లి బైడెన్ అయోమయంలో పడిన సందర్భాలు అనేకం. ట్రంప్‌లో గతానికి మించిన మూర్ఖత్వం మూర్తీభవించివున్నదని, ఆయన్ను ఎన్నుకుంటే దేశం ప్రమాదంలో పడుతుందని చెప్పటం బైడెన్ ఉద్దేశం. కానీ అది సమర్థవంతంగా చెప్పలేకపోయారు. 2020 నాటి సంవాదం స్థాయిలోనైనా మాట్లాడలేకపోయారు. తన హయాంలోని వైఫల్యాలను కప్పిపుచ్చటమే కాదు... బైడెన్ విజయాలను మరుగుపరచటంలో ట్రంప్ విజయం సాధించారు.

వేరే దేశాల ఎన్నికలు ఎవరికీ పెద్దగా పట్టవు. కానీ ప్రపంచాన్నే శాసించే అమెరికాలో జరిగే ప్రతిదాన్నీ జాగ్రత్తగా గమనిస్తారు. యూరప్ ఖండం మొదలుకొని ఉత్తర కొరియా వరకూ అందరూ ఆసక్తి కనబరుస్తారు. సహజంగానే ఉక్రెయిన్‌లో రష్యా... గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాలూ, నాటోతో సంబంధాలూ, ప్రపంచంలో అమెరికా పరువు ప్రతిష్ఠలూ చర్చకొచ్చాయి. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థ, వలసలు, ద్రవ్యోల్బణం, అబార్షన్లు సైతం ప్రధాన భాగం ఆక్రమించాయి. పుతిన్‌ను ప్రోత్సహించింది నువ్వంటే నువ్వని పరస్పరం ఆరోపణలు చేసుకోవటం ఆసక్తి కలిగించే అంశం. యూరప్ దేశాలు నాటో వ్యయంలో తమ వాటా చెల్లించకపోతే సంస్థనే మూసేస్తానని ట్రంప్ బెదిరించటం పరోక్షంగా పుతిన్‌ను సమర్థించినట్టేనని బైడెన్ వాదించగా... అసలు ఉక్రెయిన్‌పై దాడికి పురిగొల్పిందే బైడెన్ అని ట్రంప్ ఎదురు దాడి చేయటం గమనించదగ్గది. అఫ్గాన్ నుంచి వైదొలగే క్రమంలో జరిగిన భంగపాటే పుతిన్‌కు ధైర్యాన్నిచ్చిందని ఆయన దబాయించారు. ఉక్రెయిన్‌కు నిధుల వరద పారిస్తూపోతే ప్రజలను మరింత కుంగదీస్తుందన్నది ట్రంప్ వాదన. అయితే ఇజ్రాయెల్ విషయంలో ఇద్దరిదీ ఒకే మాట! కాకపోతే ఆ దేశానికి అన్నివిధాలా మద్దతిస్తున్నామని బైడెన్ అంటే... అదింకా సరిపోదన్నది ట్రంప్ ప్రత్యుత్తరం. యూదు వోటర్లు గణనీయంగా ఉండటంవల్లే ఇలా ఒకరిని మించి ఒకరు ప్రేమ ఒలకబోశారు. పైగా బైడెన్ పాలస్తీనీయుడిగా మారారని ట్రంప్ ఆరోపించారు. బైడెన్ మెతకదనం ఆసరా చేసుకుని వేరే దేశాల ప్రభుత్వాలు జైళ్లు, పిచ్చాసుపత్రులు ఖాళీ చేయించి అందరినీ అమెరికా పంపుతున్నారనడంలోని అంతరార్థం శ్వేత జాతి వోటర్లను ప్రసన్నం చేసుకునేందుకే! దేశంలో ద్రవ్యోల్బణం క్రమేపీ తగ్గుతున్నా అల్పాదాయ, మధ్యాదాయ వర్గాలను ఇంకా వేధిస్తూనే వుంది. అయితే మాంద్యం బెడద తొలగింది. ఉపాధి అవకాశాలు పెరిగాయి. ధరలూ తగ్గాయి. కానీ వీటిని బైడెన్ గట్టిగా చెప్పలేకపోగా, కార్మిక వర్గం సమస్యల్లో ఉందన్న ట్రంప్ వాదనతో ఏకీభవించారు. ట్రంప్ హయాంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిన వైనాన్ని అందరికీ గుర్తు చేయటంలో బైడెన్ విజయం సాధించారు. అబార్షన్‌కు వాడే మాత్రకు తాను వ్యతిరేకం కాదని ట్రంప్ చెప్పక తప్పలేదు. ఇది మహిళల ఘనవిజయం.

ప్రత్యర్థితో గంటన్నరపాటు వాగ్యుద్ధానికి తలపడినప్పుడు ఏదో ఒక సమయంలో ఓటమి ఎదురయ్యే పరిస్థితి రావొచ్చు. కానీ తొలి పది నిమిషాలూ నిబ్బరంగా లేనివారు ఓటమి నుంచి తప్పించుకోలేరంటారు. సంవాదంలో బైడెన్‌కు అదే జరిగింది. ఆయన ప్రసంగం తడబాట్లతో మొదలైంది. చాలాసార్లు సణుగుడుగా మిగిలిపోయింది. ట్రంప్ అడుగుతున్నప్పుడు నోరు తెరుచుకుని ఉండటం కూడా వీక్షకులను నిర్ఘాంతపరిచింది. మొత్తానికి తొలి రౌండ్‌లో ట్రంప్‌దే పైచేయి.

ఎందుకీ ప్రజాస్వామ్య పతనం?

విశ్లేషణ



టంకశాల అశోక్

భారతదేశం ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని మోదీ కొద్ది సంవత్సరాల క్రితం సగర్వంగా ప్రకటించారు. ఆ మాట చారిత్రకంగా వాస్తవమని ఏ చరిత్రకారుడు కూడా అన్నట్లు లేదు. ఆధునిక సమాజాలు స్థిరపడినా కొద్దీ ఆధునిక ప్రజాస్వామ్యాల దశ మొదలైంది. అటువంటి ప్రాంతాలలో భారతదేశం కూడా ఒకటనటంలో సందేహం లేదు. ప్రపంచ ప్రజాస్వామ్యం వేల ఏళ్ళుగా రూపుదిద్దుకున్న చరిత్రలో భారత భూమి భాగస్వామ్యం ఉండటం గర్వించదగ్గ విషయం. అయితే, 'వి–డెమ్' ప్రకారం ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల ర్యాంకింగ్స్‌లో ఇండియా స్థానం 104. మొత్తం 179 దేశాలతో పోల్చినప్పటి స్థితి ఇది. భారత్ లాంటి మహత్తర దేశస్థానం ఎందువల్ల పడిపోయినట్లు? ఆ పతనానికి బాధ్యులెవరు?

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 27న పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు, నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆమె ద్వారా ఒక ముఖ్యమైన మాటను చెప్పించగలదో లేదోనని ముందుగా కొంత అనుమానం కలిగింది. చివరకు చెప్పించటం చూసి సంతోషం కలిగింది. భారతదేశం 'మదర్ ఆఫ్ డెమోక్రసీ' అని అభివర్ణించారామె. ప్రపంచ చరిత్ర పుటలలోకి వెళ్ళి చూసినట్లయితే ఆ మాటకు కొంత విలువ ఉంటే ఉండవచ్చు. కనుక అది చారిత్రక దృష్టితో సంతోషించదగిన మాటే. అయితే, రాష్ట్రపతితో ఆ మాట చెప్పించిన మోదీ పాలనలో, ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల ర్యాంకింగ్స్‌లో మన స్థానం 104కు ఎందుకు పతనమైందన్నది భారతీయుల సందేహం.

భారతదేశం ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని మోదీ కొద్ది సంవత్సరాల క్రితం సగర్వంగా ప్రకటించారు. ఆ మాట చారిత్రకంగా వాస్తవమని ప్రపంచంలో ఏ చరిత్రకారుడు కూడా అన్నట్లు లేదు. అయితే, క్రీస్తు పూర్వం అనేక శతాబ్దాల క్రితం ప్రపంచంలోని పలు సమాజాలు నాగరికమైనా కొద్దీ అక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థల లక్షణాలు కనిపించసాగాయి. నిజానికి అందుకు బీజాలు ఆదిమ తెగల సమాజాలలోనే ఉన్నట్లు మానవ వికాస శాస్త్రజ్ఞులు చెప్తారు. ఆ తర్వాత దశలో ఆధునిక సమాజాలు స్థిరపడినా కొద్దీ ఆధునిక ప్రజాస్వామ్యాల దశ మొదలైంది. అటువంటి ప్రాంతాలలో భారతదేశం కూడా ఒకటనటంలో సందేహం లేదు. అవే పరిణామాలు గ్రీసు, ఈజిప్టు, ఇతర మధ్యధరా సముద్ర తీర ప్రాంతాలు, చైనా వంటి చోట్ల కూడా చోటు చేసుకున్నాయి. ఆ విధంగా ఇవన్నీ క్రీస్తు పూర్వ కాలపు అక్క చెల్లెళ్లన్నమాట. అందుకు అనుగుణంగానే ఈ ప్రాంతాలన్నింటా ప్రజాస్వామిక తత్త్వవేత్తలు, సంఘ సంస్కర్తలు, పరిపాలనా శాస్త్రవేత్తలు అప్పటినుంచే ఆవిర్భవించటం మొదలైంది.

మొత్తానికి ఆ విధంగా ప్రపంచ ప్రజాస్వామ్యం వేల ఏళ్ళుగా రూపుదిద్దుకున్న చరిత్రలో భారత భూమి భాగస్వామ్యం ఉండటం మనమంతా గర్వించదగ్గ విషయం. అయితే, అటువంటి మహత్తర దేశస్థానం ప్రపంచ ప్రజాస్వామ్య దేశాల ర్యాంకింగ్స్‌లో ఇపుడు 104కు ఎందువల్ల పడిపోయినట్లు? ఆ పతనానికి బాధ్యులెవరు? ఆ స్థితి భారతీయులకు గర్వించదగ్గ విషయమా? ప్రజాస్వామ్య దేశాలు, వ్యవస్థలన్నింటిని ఎప్పటికప్పుడు మదింపు చేసే ప్రపంచ స్థాయి సంస్థ పేరు 'వి–డెమ్'. దాని నివేదికలు కొద్ది సంవత్సరాల క్రితమే ఇండియాను 'ఇటీవల అతి హీనంగా నియంతృత్వీకరణ చెందుతున్న దేశాలలో ఒక'టనీ, 'ప్రపంచంలోని మొదటి పది నియంతృత్వ దేశాలలో ఒక'టనీ అభివర్ణించాయి. తర్వాత 2018 వచ్చేసరికి, అనగా గత ఎన్నికల కన్నా ముందే, 'ఎన్నికైన నియంతృత్వం' స్థాయికి పడిపోయింది. 2018 నుంచి 2023 వరకు అయిదేళ్ళ పాటు కూడా అదే స్థాయిలో కొనసాగింది. ఈ 2024 ర్యాంకింగ్స్ వచ్చేసరికి పరిస్థితి



ఏమి కాగలదో చూడాలి. ఇది వి–డెమ్ పరిశీలించిన మొత్తం 179 దేశాలతో పోల్చినప్పటి స్థితి అన్నమాట. వి–డెమ్ సంస్థ స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన పొలిటికల్ సైన్స్ విభాగం నుంచి పనిచేస్తుంది. ఒక ప్రజాస్వామ్యం ఏవిధంగా పనిచేస్తున్నదో మదింపు వేసేందుకు ఆ సంస్థకు ఐదు కొలమానాలు ఉన్నాయి. అవి, ఎన్నికల తీరు, ఉదారవాదం, ప్రజల భాగస్వామ్యం, చర్చలకు గల అవకాశం, ప్రజా సంక్షేమం.

వి–డెమ్ మాత్రమే కాదు, కొన్ని తేడాలతో ఇతర ప్రముఖ సంస్థలు కూడా హీనమైన ర్యాంకులే ఇస్తూ వస్తున్నాయి. ఉదాహరణకు ప్రపంచ ప్రసిద్ధ 'ఎకానమిస్టు' మేగజైన్ 2020లో 53వ ర్యాంక్‌నిచ్చింది. ప్రజాస్వామ్య సూచీలలో పత్రికా స్వేచ్ఛ ఒకటని భావిస్తే, 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బార్డర్స్' నివేదిక ప్రకారం, ఈ 2024లో ఇండియా ర్యాంకు 180 దేశాలలో 159వది. మానవ హక్కుల విషయంలో 165 దేశాలలో 109వది. నిజానికి ప్రధానంగా ధనిక వర్గాలకు లాభం చేసే ఆర్థికాభివృద్ధి సూచీల మాట ఎట్లున్నా, సామాన్య ప్రజలకు సంబంధించిన మానవాభివృద్ధి సూచీలు కూడా ప్రజాస్వామ్యం గురించేనని భావిస్తే, ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మనది 134వ స్థానం.

గమనించదగినదేమంటే, ఈ సూచీలన్నీ నరేంద్ర మోదీ పాలనలో క్రమంగా పడిపోతున్నాయి. అయినప్పటికీ ఆయన ప్రభుత్వం ఇటువంటి నివేదికలను, వాటిలో పేర్కొన్న వాస్తవాలను, తమ తీవ్రమైన అప్రజాస్వామికతను విస్మరించి, భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అనే ప్రకటనలు నిర్భయంగా చేయటాన్ని బట్టి వారి తెగువను మెచ్చుకోవాలి. దేశంలో ప్రజలేమన్నా, ప్రపంచం ఏమన్నా, ఈ మాటను కూడా గోబెల్స్ ప్రచారం వలె సాగించినట్లయితే అదే నిజంగా స్థిరపడగలదన్నది మోదీ నమ్మకం అయి ఉండాలి. ఇందులోని గమనించదగ్గ మెలిక ఏమంటే, భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అయినా కాకున్నా ప్రజాస్వామ్యానికి బీజాలు వేసిన భూభాగాలలో ఒకటన్నది నిజమే గాని, దానిని వర్ధిల్ల చేయటంలో మోదీ పాత్ర ఏమిటన్నది ప్రశ్న. మనది మదర్ ఆఫ్ డెమోక్రసీ అనే ప్రచారం చాటున ఆయన తన అప్రజాస్వామికతను, పైన పేర్కొన్న తరహా ర్యాంకింగుల అప్రతిష్ఠను కప్పిపెట్టుకో జూస్తున్నారనిపిస్తున్నది. గోబెల్స్ తరహా ఎత్తుగడలలో ఇది ఒకటి.

ఈ సందర్భంగా, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మోదీ సాగించిన భయం గొలిపే విషప్రచారం అనివార్యంగా గుర్తుకువస్తుంది. ఆ ప్రచారాన్ని చివరకు ఆరెస్సెస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ సైతం బహిరంగంగా ఆక్షేపించవలసి వచ్చిందంటే, మోదీ తీరును ప్రజాస్వామికమని ఎవరైనా అనగలరా? భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అని సగర్వంగా చాటుకోగల నాయకుని ధోరణి అదేనా? ఈ దేశపు గత చరిత్రను, ప్రజాస్వామిక సంప్రదాయాన్ని ప్రస్తావించే నైతిక హక్కు ఆయనకు ఉంటుందా? పైన పేర్కొన్న ర్యాంకింగ్‌లన్నీ మొన్నటి ఎన్నికల విష ప్రచారం కన్నా ముందటివి. ఆ తర్వాతవి ఏ విధంగా ఉండగలవో చూడాలి.

మోదీ ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా చెప్పించిన మరొక విశేషం ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ. ఈ ప్రస్తావనలు ప్రధానితో పాటు బీజేపీకి చెందినవారు గత కొద్దిరోజులుగా చేస్తున్నారు. అది చాలదన్నట్లు సాక్షాత్తూ రాష్ట్రపతి ద్వారా మాట్లాడించారు. ఎమర్జెన్సీ విధింపు పూర్తి అప్రజాస్వామికమనటంలో ఎటువంటి సందేహం లేదు. ఆ చర్య తీసుకున్న పరిస్థితులు, అది అమలైన తీరు అన్నీ ప్రజాస్వామ్య విరుద్ధమే. దానిని అందరూ ఖండించటమే గాక, తిరిగి ఎన్నడూ ఏ రూపంలోనూ ఆ ధోరణులను ప్రదర్శించకూడదు. కానీ, దానిని ఇంతగా ఖండించే మోదీ చేస్తున్నదేమిటీ? తన నాయకత్వాన ఇండియాకు ప్రజాస్వామ్య ర్యాంకింగ్‌లు వరుసగా పడిపోతూ నియంతృత్వ ర్యాంకింగులు ఎందుకు వస్తున్నాయి? ఇందిర ఎమర్జెన్సీ తన వ్యక్తిగత అధికార పరిరక్షణకు ప్రజాస్వామ్యాన్ని, సమాజాన్ని ఒక పరిమిత కాలం పాటు భంగపరిచిన చర్య. అంతే తప్ప ఆ చర్య దీర్ఘకాలిక ప్రభావం చూపలేదు. అందుకు భిన్నంగా మోదీ చర్యల వల్ల భారత సమాజమే విషప్రాయమవుతున్నది. ఆ ప్రభావాలు దీర్ఘకాలం పాటు ఉండనున్నాయి. తన తీరు చివరకు ఆరెస్సెస్‌కు సైతం ఇబ్బందికరం, అభ్యంతరకరం అవుతున్నది. అటువంటి నాయకుడు కనీసం ఎన్నికల ఎదురుదెబ్బలతోనైనా పాఠాలు గ్రహించి తన ధోరణిని మార్చుకోవటం అవసరం. భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అనే నీతులు ఎవరికీ చెప్పనక్కరలేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దేవుడే దిక్కు



బైడెన్, ట్రంప్ మధ్య జరిగిన చర్చ చూసిన తర్వాత ఒకటి మాత్రం స్పష్టంగా అర్థమైంది. కేవలం దేవుడు మాత్రమే అమెరికాను కాపాడగలడు. దేవుడా! అమెరికాను దీవించు!

– అమ్జద్ తాహా, విశ్లేషకుడు

దారుణమైన చీడ



'అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం'తో నిర్మించిన ఒక విమానాశ్రయపు పైకప్పు, భారీ దూలాలు పడిపోవడానికి ఒక వాన కారణమవుతున్నదంటే– తెగులు చాలా లోతుగా, మూలాల్లో ఉంది. అది 2009లో నిర్మించినది అన్నది విషయం కాదు. ఒక ప్రాణం పోయింది, అది క్షమించలేనిది. ప్రతి ప్రాజెక్టునూ దాని కాలవ్యవధిని బట్టి సమీక్షించాలి. (ఢిల్లీ విమానాశ్రయపు టెర్మినల్ 1 పైకప్పు కూలిన నేపథ్యంలో.)

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

ఢిల్లీ జలమయం



ఢిల్లీలోని నా మొత్తం ఇంట్లో ప్రతీ గదిలోకి అడుగులోతు నీళ్లు వచ్చాయి. కార్పెట్లు, ఫర్నిచర్, అసలు నేల మీద ఉన్న ప్రతిదీ పాడైంది. విద్యుదాఘాతాలకు దారి తీస్తుందన్న కారణంగా పొద్దున ఆరింటి నుంచి కరెంటు నిలిపేశారు. పడవ లేకుండా నేను రాలేనేమోనని నా పార్లమెంటు సహచరులకు చెప్పాను. చివరకు రోడ్ల మీద నిలిచిన నీటిని తొలగించడంతో సమయానికి చేరుకున్నాను.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

రాత సమస్యలు



నాకు ఎవరూ స్నేహితులు లేరన్న కారణంగా నేను రాయాలనుకున్నాను. తీరా నలభై ఏళ్ల తర్వాత కూడా నేను రాస్తున్నాను. కాబట్టి నాకు ఎవరూ స్నేహితులుగా మిగల్లేదు.

– సహానా అహ్మద్, రచయిత్రి

ఇండియా కీలకం



కేవలం రష్యాతో ఇండియా స్నేహం మాత్రమే ప్రపంచాన్ని 'బహు ధ్రువం'గా ఉంచుతున్నది. అది పోయిందంటే, మనం 'ద్వి ధ్రువ' ప్రపంచంలో బతకాల్సి ఉంటుంది... చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా ఒక కూటమిగా; అమెరికా, ఇండియా, యూరప్, జపాన్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా మరో కూటమిగా!

– నోవా స్మిత్, విశ్లేషకుడు

'ఉపా'ను తలదన్నే సెక్షన్ 113

కొత్త నేర చట్టాలు జూలై 1 నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి రాబోతున్నాయి. ఈ చట్టాలపై ఒకవైపు తీవ్రమైన విమర్శలూ, మరొకవైపున పొగడ్తలూ వినబడుతున్నాయి. ఎవరి వాదం ఎలా ఉన్నా... భారతీయ న్యాయ సంహిత (భారతీయ శిక్షా స్మృతి)లోని సెక్షన్ 113 మాత్రం ఒక ప్రత్యేక విషయంగా నిలుస్తుందని చెప్పక తప్పదు. ఎందుకంటే ఇది ప్రజా వ్యతిరేకమైనది కాబట్టి. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక (ఉపా) చట్టంలోని ఉగ్రవాద చర్యలకు సంబంధించిన సెక్షన్ 115ను యథా తథంగా భారతీయ న్యాయ సంహితలో సెక్షన్ 113గా చేర్చారు. కేవలం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకే ఉపాను పరిమితం చేయకుండా, మొత్తం దేశ సమగ్రతనూ, సార్వభౌమత్వాన్నీ ఉగ్రవాద చర్యలతో భంగం కలిగించేవారి వరకూ ఉపా చట్టాన్ని విస్తృత పరిచారు. అయితే ఈ రెండు అంశాలను ఒకే చట్టంగా ఏకరూపంలోకి తీసుకురావడంలో అభ్యంతరాలు ఉన్నాయి.



ఉగ్రవాద చర్యలలో వ్యక్తులు లేదా సంస్థలకు భాగస్వామ్యం ఉందని భావిస్తే... ముందుగా ఆ యా వ్యక్తులకు లేదా సంస్థలకు ఉపా చట్టంలోని సెక్షన్లు 35, 36ల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేయడం, అభ్యంతరాలు తెలుసుకోవడం, ఆరోపణలపై విచారణ చేయడం వంటివి పూర్తి చేసిన అనంతరం... చివరికి తేలే అంశాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వం ఆ యా వ్యక్తులను లేదా సంస్థలను ఉగ్రవాద జాబితా నుండి తొలగిస్తుంది లేదా కొనసాగిస్తుంది. అలాగే ఈ ప్రక్రియ ద్వారానే ఉగ్రవాదులు లేదా ఉగ్రవాద సంస్థలపై పోలీసువారు లేదా నేర విచారణ సంస్థలు ఉపా చట్టం పరిధిలో కేసులు నమోదు చేసి తమ విచారణను కొనసాగించవచ్చు. ఇవీ అసలు ఉపా కింద సాగాల్సిన విధివిధానాలు. అయితే ఇటీవల రాజ్యాంగబద్ధంగా ఉన్నటువంటి సంస్థలపై, అలాగే మానవ హక్కుల సంస్థలపై, కార్యకర్తలపై, వ్యక్తులపై ఉపా చట్టాన్ని మోపడం కనిపిస్తోంది. కానీ ఆరోపణలకు గురైనవారు తాము ఉగ్రవాద సంస్థలకు చెందినవారం కాదని న్యాయపోరాటాలు చేస్తున్నారు. అంటే ఉపా చట్టం ఎంత లోపభూయిష్టంగా ఉందో అర్థమవుతుంది. ఈ ఇబ్బందులను, లోపాలను భారతీయ న్యాయ సంహిత ద్వారా పరిహరించడానికి భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 113ను రంగంలోకి దించారు. అంటే ఇక భారతీయ న్యాయ సంహిత ద్వారా నేరుగా ఏ వ్యక్తిపైనైనా ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నాడని నేరుగా పోలీసులు... పోలీసు సూపరింటెండెంట్ అనుమతితో కేసులు కట్టవచ్చు. అందుకే ఈ సెక్షన్ ఉపా చట్టం కన్నా ప్రమాదకరమైంది. ప్రభుత్వాలు తలచుకుంటే చాలా తేలికగా ఇక ఎవరిపైనైనా ఉగ్రవాద ముద్ర వేసి జైలుకు పంపవచ్చు. రాబోయే రోజుల్లో జరగబోయే ప్రజాస్వామ్య హననాన్ని ప్రశ్నించే ప్రతీ గొంతుకనూ అణిచివేసే పనిముట్టుగా సెక్షన్ 113 ఉపయోగంలోకి రాబోతోంది. కాబట్టి ప్రజలు ఈ నల్ల సెక్షన్‌కు వ్యతిరేకంగా పోరాడితే కానీ దాని ఉపసంహరణ జరగదు.

– అంకాళ్ళ పృథ్వీరాజ్ । ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది

ప్రతిపక్ష హోదా ఎగ్గొట్టడానికి అబద్ధాలా?

అభిప్రాయం



పూనూరు గౌతమ్‌రెడ్డి

రాజ్యాంగంలోనూ, చట్టాల్లోనూ లేని అంశాలను సాకుగా చూపిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి శాసన సభలో ప్రతిపక్ష హోదాను ఏకైక ప్రతిపక్ష పార్టీనేతకు ఇవ్వకుండా ఉండేందుకు ప్రయత్నిస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వాలో విశదీకరిస్తూ అసెంబ్లీ స్పీకర్‌కు ఒక లేఖ రాశారు. అయితే, ఈ లేఖపై స్పీకర్ స్పందించేలోపే ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించారు. నిజానికి స్పీకర్ ఈ లేఖకు సమాధానం ఇచ్చిన తర్వాత కానీ మంత్రి స్పందించకూడదు. పోనీ స్పందించారనే అనుకున్నా... మరీ ఇంత అడ్డగోలుగా మాట్లాడ్డం విడ్డూరం. ఈ స్పందనలో ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా ఉండాలని నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది.

మంత్రి స్పందనలో ఉండాల్సిన విషయ పరిజ్ఞానం కంటే వ్యంగ్యమే ఎక్కువగా ధ్వనించింది. ప్రతిపక్ష హోదా ఇచ్చే విషయంపై మాట్లాడే క్రమంలో ఇతర పుస్తకాలతో పాటు అప్పుడప్పుడు కౌల్ అండ్ శక్దర్ రాసిన 'ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ ఆఫ్ పార్లమెంట్' పుస్తకం కూడా చదవాలంటూ వ్యంగ్య బాణం వదిలారు. ఒక పార్టీకి కనీసం 10 శాతం సభ్యులు లేకపోతే ఆ పార్టీ నాయకునికి ప్రధాన ప్రతిపక్ష హోదా రాదన్నారు. ఈ వ్యాఖ్యలను అనేక మంది తప్పుపడుతున్నారు. టీవీ, పత్రికలు, సోషల్ మీడియాల్లో ఇదే ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. అనేకమంది రాజ్యాంగ నిపుణులూ, విశ్లేషకులూ ప్రభుత్వ వాదం ఎంత తప్పో వివరిస్తుండడం తెలిసిందే. ఎమ్ఎన్ కౌల్ అండ్ ఎస్ఎల్ శక్దర్ రాసిన 'ద ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ ఆఫ్ పార్లమెంట్' పుస్తకం ఆరవ ఎడిషన్‌ను ఎడిట్ చేసిన లోక్‌సభ విశ్రాంత సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి ఏకంగా ఒక ఆంగ్ల దిన పత్రికలో వ్యాసం రాయడంతో రాజకీయ వర్గాల్లో ప్రతిపక్ష హోదాపై మరింత ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్స్ అండ్ శాలరీస్ చట్టాన్ని జగన్ ప్రస్తావిస్తున్నారు. ఆ చట్టం లీడర్ ఆఫ్ అపోజిషన్‌ను నిర్ణయిస్తుందా' అని ప్రశ్నించారు. కౌల్ అండ్ శక్దర్ పుస్తకంలో 150వ పేజీలో చాలా స్పష్టంగా స్టాచ్యూటరీ (రికగ్నిషన్) పొజిషన్ ఆఫ్ ద లీడర్ ఆఫ్ అపోజిషన్ అనేది 'పేమెంట్ ఆఫ్ శాలరీస్ ఆక్ట్ –1977' ఆధారంగానే నిర్ణయించబడిందని పేర్కొనడం గమనార్హం. ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి పేమెంట్ ఆఫ్ శాలరీస్ ఆక్టే ప్రాతిపదిక అని స్పష్టంగా ఉంది. ఆంగ్ల దిన పత్రికలో పీడీటీ ఆచారి రాసింది కూడా ఇదే. ఇక పుస్తకం 150వ పేజీలో కింద ఫుట్‌నోట్స్‌లో 'ఎ పార్టీ ఇన్ అపోజిషన్ టు ద గవర్నమెంట్ విత్ గ్రేటెస్ట్ నెంబర్' అని ఉంది. అంటే ప్రతిపక్షం స్థానంలో అధిక సంఖ్యాబలం ఉన్న పార్టీ అనే కదా దీనర్థం. 1977 పార్లమెంట్ చట్టంలోనూ ఇదే ఉంది. 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్స్ ఆఫ్ శాలరీస్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ డిస్ క్వాలిఫికేషన్' చట్టం సెక్షన్ 12 (బీ) లోనూ ఇదే ఉంది. అంతే కాని 1/10 సభ్యులు ఉండాలని ఎక్కడా లేదు. ఇక రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో కూడా ఒక్క సభ్యుడున్నా కూడా దాన్ని రాజకీయ పార్టీగానే గుర్తించాలని ఉంది. ఇక 10 శాతం ఉండాలన్న నిబంధన ఎక్కడిది? దీనిపై చర్చ ఎక్కడిది? అంటే జగన్ ప్రస్తావించిన అంశాలు వాస్తవమైనవేనని స్పష్టం అవుతోంది.



కేవలం జగన్ మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా రాకుండా అడ్డుకోవాలన్న దురుద్దేశంతోనే అధికార పక్షం కుట్రలకు తెరలేపినట్లు ఈ వ్యవహారం అంతా చూస్తే అర్థమవుతుంది.

వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు

ఖాళీ మనసుతో ఆరాధిస్తే!

రుక్మిణీ దేవి కృష్ణుని పత్ని. పరమ భక్తురాలు. నిరంతరం కృష్ణుణ్ణే మనసులో నిలుపుకుని సేవించే సాధ్వి. ఆమె ఒకసారి కృష్ణుని చూస్తూ 'ఈ హరి తన మురళిని వాయిస్తూ శ్రోతలను ఆహ్లాదపరుస్తాడు. తన మురళీ గానంతో లోకాలను సమ్మోహన పరుస్తాడు. ఒక్క క్షణం కూడా మురళిని వదలకుండా తన దగ్గరే ఉంచుకుంటాడు. ఈ మురళి ధన్యత ఎంత గొప్పది! ఎల్లప్పుడూ కృష్ణ సాన్నిధ్యం అనుభవించే అదృష్టం ఈ మురళికి కలగటానికి ఏ పుణ్యం చేసుకుందో! నేను కూడా కృష్ణునికి కొంత దూరంగానే ఉంటాను గాని ఈ మురళి అంత నిరంతర సన్నిహితత్వంలో లేను. దీనిని కృష్ణుడెపుడైనా దూరంగా ఉంచితే ఈ విషయం గురించి మాట్లాడాలి' అనుకుంది.



జ్యోతిర్మయం

అందరి మనసులను పసిగట్టగల హరి రుక్మిణి మనసు గుర్తించి, ఒకసారి మురళిని దూరంగా పెట్టి నిద్ర పోతున్నట్లు నటించాడు. రుక్మిణి గబ గబ మురళిని తీసుకుని ఏకాంత ప్రదేశానికి వెళ్లి, దానికి ఏకాగ్రతతో ప్రాణ ప్రతిష్ఠ చేసి అడిగింది.

'నువ్వు శ్రీకృష్ణుని నిరంతర సామీప్యాన్ని పొందటానికి పూర్వ జన్మలో ఏ పూజలు, వ్రతాలు చేశావు? ఏ దేవతలనారాధించావు? ఆ పుణ్య కార్యాలు నాకూ చెపితే నేనూ అదే విధంగా చేసి కృష్ణుని సామీప్యాన్ని పొందుతాను' అని ప్రార్థించింది.

మురళి, తనకే పాప పుణ్యాల గురించి తెలియదని చెప్పింది. తన ఆకారాన్ని పరిశీలించి, తన లోపల ఏమున్నదో చూసి చెప్పమంది. రుక్మిణి మురళిని పైకెత్తి లోపలికి చూసింది. 'ఏమీ లేదు. లోపల ఖాళీగా ఉంది' అని చెప్పింది. అప్పుడు మురళి, 'అదే విశేషం. నా లోపల ఏమీ లేదు. ఎవరైనా తమ మనస్సుల్లో ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి వదిలి, మనసుని నిర్మలంగా ఉంచుకుంటే వారు నిరంతరం భగవంతుని సమీపంలో ఉండగలుగుతారు' అంది.

ఇది మురళి ద్వారా భగవానుడు జనులకిచ్చిన సందేశం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం; **తిథి:** బ.అష్టమి ప.3.41 వరకు; తదుపరి నవమి; **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.10.48 వరకు, తదుపరి రేవతి; **వర్జ్యం:** రా.10.00 నుండి 11.29 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.5.31 నుండి 7.15 వరకు; **అమృత ఘడియలు:** ఉ.6.22 నుండి 7.56 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు; **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు; **సూర్యోదయం:** 5.32; **సూర్యాస్తమయం:** 6.34

న్యాయవాదిపై బీజేపీ నేత దాడి దారుణం

- చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కదిరి బార్ అసోసియేషన్ హెచ్చరిక

సాక్షి, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో న్యాయవాదిపై దాడి చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తలుపుల గంగాధర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కదిరి బార్ అసోసియేషన్ శుక్రవారం బీజేపీ రాష్ట్ర పార్టీని డిమాండ్ చేసింది. ఈ మేరకు కదిరి బార్ అసోసియేషన్ సభ్యులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు రాష్ట్ర పార్టీ సంఘటనా కార్యదర్శి మధుకర్‌కు లేఖ రాశారు. తలుపుల గంగాధర్ పార్టీని అడ్డు పెట్టుకుని పలు దౌర్జన్యాలకు, కబ్జాలకు పాల్పడుతూ.. శుక్రవారం ఉదయం న్యాయవాద సంఘం సభ్యుడు అయిన అడ్వకేట్ రామస్వామి నాయుడి ఇంటిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి దాడికి దిగాడని తెలిపారు. ఈ దాడి జరుగుతున్నంత సేపు తన అనుచరులతో వీడియో రికార్డింగ్ చేయించాడని వివరించారు. దాడిలో తమ న్యాయవాద సంఘం సభ్యుడైన రామస్వామికి ఎడమ కన్ను పూర్తిగా వాచిపోయి ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దాడిని ఖండిస్తూ న్యాయవాదులు మూడు రోజుల పాటు విధులను బహిష్కరిస్తున్నామని, మరోవైపు పార్టీ పరంగా అతనిపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

మహిళా ఎంపీడీవోకి టీడీపీ నేతల బెదిరింపులు

- బట్టలు ఊడదీసి తంతానన్న నేత
- కన్నీటిపర్యంతమైన ఎంపీడీవో

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎంపీడీవో రమాదేవిని టీడీపీ నాయకులు బెదిరించిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ బెదిరింపుల్ని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిల్లారి నారాయణరావు తీవ్రంగా ఖండించారు. ఎచ్చెర్లలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ బెదిరింపులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో ఎచ్చెర్ల మండల టీడీపీ నాయకులు పలువురు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. ముందుగా ఎమ్మెల్యే మండల పరిషత్ సిబ్బందితో సమీక్షించారు. మినిట్స్ బుక్ అడిగారు. మినిట్స్ బుక్ ఇవ్వడం కుదరదన్న ఎంపీడీవో జిరాక్స్ ఇస్తామని చెప్పారు. అలా బుక్ ఇవ్వనని రాసి సంతకం చేసి ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా ఆమె నిరాకరించారు. దీంతో పరిపాలన అధికారి కలుగజేసుకుని ధ్రువీకరణ పత్రం రాసిచ్చారు. అక్కడ సమీక్ష అనంతరం ఎమ్మెల్యే వెళ్లిపోతుండగా కొందరు నాయకులు వెళ్లి ఎంపీడీవోని బెదిరించారు. ఓ గ్రామస్థాయి నాయకుడు 'బట్టలు ఊడదీసి తంతాను..' అంటూ అనరాని మాటలు అనడంతో.. ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వైఖరిని తోటి ఉద్యోగులు ఖండించారు. ఈ విషయాన్ని ఆమె ఉద్యోగసంఘాలు, ఎంపీడీవో యూనియన్ దృష్టికి తీసుకెళ్లారు. విశాఖ జిల్లాకు చెందిన ఆమె రెండేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. టీడీపీ నాయకులు అన్న మాటలను ఉద్యోగ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

సాక్షి చానల్ విలేకరి ఇంటికెళ్లి దుర్భాషలు

బల్లికురవ: ప్రకాశం జిల్లా అద్దంకి సాక్షి చానల్ విలేకరి ధూళిపాళ్ల శివకృష్ణ ఇంటికి శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి వచ్చి దుర్భాషలాడాడు. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెంలోని తమ ఇంటికి హెల్మెట్ ధరించి బైకుపై వచ్చిన వ్యక్తి సాక్షి విలేకరి ఇంట్లో ఉన్నాడా, బయటకు రారా అంటూ దుర్భాషలాడారని శివకృష్ణ తండ్రి శ్రీనివాసరావు వాపోయారు. దీనిపై డీజీపీకి, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు శివకృష్ణ, శ్రీనివాసరావు చెప్పారు.

ఊరొదలకపోతే చంపేస్తాం

బాపట్ల, తిరుపతి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ నేతలకు టీడీపీ నేతల హెచ్చరిక

- గ్రామం వదలిన చెరుకుపల్లి మాజీ ఎంపీపీ కుటుంబం, రాంబొట్లపాలెం నేతలు
- మరికొందరు మండల స్థాయి నేతలు, కార్యకర్తలదీ ఇదే దారి
- శ్రీకాళహస్తిలో షికారీ, దళితులపై టీడీపీ శ్రేణుల దౌర్జన్యం
- ఊరు వదిలిన 70 కుటుంబాలు
- వెళ్లని వారి నివాసాల్లోకి దూరి తరిమి కొట్టిన వైనం
- రొంపిచర్ల, చంద్రగిరిలోనూ రెచ్చిపోయిన టీడీపీ గూండాలు
- రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు


తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఊరొదిలి వెళ్తున్న ఈశ్వరయ్యకాలనీ శికారీలు


టీడీపీ శ్రేణులు దాడిచేయడంతో స్పృహతప్పి పడిపోయిన గర్భిణి


టీడీపీ శ్రేణుల దాడిలో గాయాలతో బాలింత


బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం కస్తూరివారి పేటలో ధ్వంసం చేస్తున్న ఆంధ్రప్రభ విలేకరి ఇల్లు


టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడ్డ మహిళ


గాయపడ్డ ఎంజీఆర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల/సాక్షి, టాస్క్‌ఫోర్స్ : బాపట్ల, తిరుపతి జిల్లాల్లో అధికార టీడీపీ నేతల అరాచక పర్వానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు దౌర్జన్యాలకు దిగారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, సానుభూతి పరులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై దాడులకు తెగబడుతున్నారు. దొరికిన వారిని దొరికినట్లు చితకబాదుతున్నారు. ఇళ్లు, ఇతర ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. బలహీన వర్గాలపై, ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయి. ఊరు విడిచి వెళ్లాలని, లేకపోతే చంపేస్తామని నేతలు, కార్యకర్తలను మైకు అనౌన్స్‌మెంట్ల ద్వారా హెచ్చరిస్తుండటం విస్తుగొలుపుతోంది. దీంతో పలువురు నేతలు, కార్యకర్తలు ఊర్లు వదిలి అజ్ఞాతంలోకి వెళ్లారు. మరి కొందరు గ్రామాల్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గుళ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల స్థాయి నాయకుడు చెన్ను కోటేశ్వరరావు కుటుంబం 20 రోజులుగా అజ్ఞాతంలో గడుపుతోంది. కోటేశ్వరరావు 1995 నుంచి వరుసగా మూడు దఫాలుగా గుళ్లపల్లి సర్పంచ్‌గా, మండల పరిషత్ అధ్యక్షుడిగా పని చేశారు. 2021 నుంచి ఆయన సతీమణి సర్పంచ్‌గా ఉన్నారు. గ్రామ పంచాయతీలోనే కాక మండల స్థాయిలో పేరున్న నేత. కూటమి అధికారంలోకి రాగానే టీడీపీ కార్యకర్తలు చెన్ను కోటేశ్వరరావు కుటుంబాన్ని టార్గెట్ చేశారు. వీరి హయాంలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలా ఫలకాలన్నింటినీ ధ్వంసం చేశారు. కోటేశ్వరరావును గ్రామస్తుల సమక్షంలో దుర్భాషలాడారు. చంపేస్తామంటూ ఏకంగా మైకులో గ్రామం మొత్తం తిరిగి అనౌన్స్‌మెంట్ చేయడం గమనార్హం. అంతటితో ఆగకుండా మారణాయుధాలతో ఇంటి వద్దకు వెళ్లి గ్రామం వదలి వెళ్లకపోతే చంపేస్తామని నేరుగా హెచ్చరించారు. దీంతో కోటేశ్వరరావు కుటుంబంతో కలిసి సొంత గ్రామం గుళ్లపల్లి వదిలి వెళ్లిపోయారు. తర్వాత ఆయన వాటర్ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయన అనుచరుడి ఇంటిపై దాడి చేసి, విధ్వంసం సృష్టించారు. ఈ నేపథ్యంలో కోటేశ్వరరావు నాలుగు రోజుల క్రితం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి గ్రామానికి చెందిన 8 మంది టీడీపీ కార్యకర్తలతో తనకు, కుటుంబానికి ప్రాణహాని ఉందని.. వారి నుంచి రక్షణ కల్పించాలని వేడుకున్నారు. అయినా పోలీసుల నుంచి స్పందన లేదు.

ఊరొదిలిన గిరిజన, దళిత కుటుంబాలు

శ్రీకాళహస్తి రూరల్ మండల పరిధిలో టీడీపీ శ్రేణుల దాడులతో ఈశ్వరయ్య కాలనీకి చెందిన 55 కుటుంబాలు, వాగివేడులో 17 కుటుంబాలు, నారాయణపురంలో 3 కుటుంబాలు.. మొత్తం 75 కుటుంబాలు ఊరొదిలి వెళ్లిపోయాయి. ఇందులో ఎంపేడు సర్పంచ్ కొండయ్య కుటుంబం కూడా ఉంది. సర్పంచ్ కుటుంబం ఎక్కడకు వెళ్లిందో తెలియట్లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊరొదిలి వెళ్లిన వారిలో స్కూళ్లకు వెళ్లే పిల్లలు కూడా ఉన్నారని చెబుతున్నారు. వారి కోసం స్కూల్ టీచర్లు తోటి విద్యార్థులను నివాసాలకు పంపించారని స్థానికులు తెలిపారు.

ఆస్తులు ధ్వంసం చేస్తున్న కూటమి

పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల మండలం పెద్దగొట్టిగల్లుకు చెందిన మాధవరెడ్డి, జనార్దన్‌రెడ్డి ఆస్తులను కూటమి నేతలు ధ్వంసం చేశారు. పీలేరు–తిరుపతి జాతీయ రహదారిలోని రొంపిచర్ల క్రాస్ వద్ద ఉన్న వీఎంఆర్ కన్వెన్షన్ హాలు ముఖ ద్వారం ఆర్చిని గురువారం అర్ధరాత్రి కూలదోశారు. జనార్దన్‌రెడ్డికి చెందిన సెరికల్చర్ షెడ్డును పడగొట్టారు. కొంత కాలంగా చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో పోలీసుల సమక్షంలోనే దాడులు చేస్తున్నా.. పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈశ్వరయ్య కాలనీలో జరిగిన ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో షికారీలపై మరోసారి దాడులు చేశారని స్థానికులు చెబుతున్నారు. 'వాళ్లు అధికారంలో ఉన్నారు.. వారితో జాగ్రత్తగా ఉండాలి' అని పోలీసులు సలహా ఇచ్చినట్లు సమాచారం. చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండల యూత్ అధ్యక్షుడు చంటిపై గురువారం రాత్రి దాడి జరిగినా, పోలీసులు పట్టించుకోలేదు.

దాడులను ప్రోత్సహిస్తున్న మంత్రి అనగాని

చెరుకుపల్లి మండలం కస్తూరివారిపేటకు చెందిన ఆంధ్రప్రభ విలేకరి ఎనుముల వెంకటేశ్వరరావు ఇంటిని బుధవారం టీడీపీ నేతలు జేసీబీతో ధ్వంసం చేశారు. కొత్త ఇల్లు నిర్మించుకొని మూడు నెలల క్రితమే ఆయన గృహ ప్రవేశం చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడన్న కక్షతో ఈ దురాగతానికి పాల్పడ్డారు. పోలీసులు కనీసం ఫిర్యాదు పత్రం కూడా తీసుకోలేదు. ఇదే మండలం రాంబొట్లవారి పాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజేష్ కుమార్ ఇంటిపై 30 మంది టీడీపీ కార్యకర్తలు దాడికి తెగబడి దారుణంగా కొట్టారు. ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్ ప్రసాద రెడ్డిని చంపేస్తామని బెదిరించారు. గ్రామం వదిలి వెళ్లిపోవాలని హెచ్చరించడంతో ఆయన ఊరు వదిలి వెళ్లారు. ఇలా పలువురు నేతలు అజ్ఞాత జీవితం గడుపుతున్నారు. నగరం, నిజాంపట్నం తదితర మండలాల్లో సైతం ఈ తరహా దాడులు పెరిగాయి. రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్క రేపల్లె నియోజకవర్గంలోనే వందల మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గ్రామాలు వదలిపెట్టి వెళ్లారు. మంత్రి కనుసైగ మేరకే దాడులు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇంత పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నా, మంత్రి స్పందించక పోవడమే ఇందుకు నిదర్శనం. కాగా, జిల్లాలో బాధితుల నుంచి పోలీసు అధికారులు ఫిర్యాదులు కూడా స్వీకరించక పోవడం గమనార్హం.


పీలేరు- తిరుపతి రహదారిలో వీఎంఆర్ కన్వెన్షన్ హాలు ముఖద్వారంలోని ఆర్చి కూలదోస్తున్న దృశ్యం


పెద్దగొట్టిగల్లులో కూల్చేసిన సెరికల్చర్ షెడ్డు

ఫ్యాన్‌కు ఓటేసినందుకు ఊళ్లో ఉండొద్దు

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో ఫ్యాను గుర్తుకు ఓటేసిన షికారీలు, దళితులను ఊర్ల నుంచి వెళ్లగొడుతున్నారు. ఊరు విడిచి వెళ్లని వారి నివాసాల్లోకి దూరి తరిమి తరిమి కొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మరి కొన్ని చోట్ల వైఎస్సార్‌సీపీకి ఓటేసిన, పార్టీ శ్రేణుల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఇంకొందరికి ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నారు. అప్పులిచ్చిన వాళ్లను నివాసాలకు పంపి ఒత్తిళ్లు చేయిస్తూ రాక్షసానందం పొందుతున్నారు. శ్రీకాళహస్తి పరిధిలో ఇప్పటికే రూ.12 కోట్లు విలువ చేసే నివాసాలను కూల్చి వేశారు. శ్రీకాళహస్తి రూరల్ మండల పరిధిలోని ఈశ్వరయ్యకాలనీలో టీడీపీ శ్రేణులు శుక్రవారం షికారీల (గిరిజనులు) ఇళ్లలోకి చొరబడి కర్రలు, రాళ్లతో తరిమి కొట్టారు. ఊరు వదలి వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. దీంతో పలువురు కాలనీ విడిచి వెళ్లిపోయారు. ఈ నెల 12న ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్యకాలనీ, వాగివేడు, నారాయణపురంలో జరిగిన దాడులకు సంబంధించిన వీడియోలు శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. నివాసాల్లోకి చొరబడి చిన్నా, పెద్దా తేడా చూడకుండా విచక్షణా రహితంగా దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడ్డ వారిలో చిన్న పిల్లలు, మహేశ్వరి (బాలింత), రవీన (గర్భిణి), ఎంజీఆర్ (వృద్ధుడు)తో పాటు మరి కొందరు ఉన్నారు.

పిన్నెల్లిపై మరో అక్రమ కేసు

- కోర్టు వద్దే దాడికి యత్నించిన టీడీపీ నాయకుడ్ని వదిలేసిన పోలీసులు
- పక్కకు తోసి కోర్టు లోపలికి వెళ్లిన పిన్నెల్లిపైనే ఎదురు కేసు
- అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్న పోలీసులు


పిన్నెల్లిపైకి దూసుకొచ్చిన శివ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పోలీసులు మరో అక్రమ కేసు నమోదు చేశారు. పిన్నెల్లిని బుధవారం రాత్రి మాచర్ల కోర్టులో హాజరు పరిచే సమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి ఆయన్ని అడ్డగించి, దాడికి ప్రయత్నించారు. దాడికి యత్నించిన టీడీపీ నాయకుడిపై పోలీసులు కేసు పెట్టకపోగా, పిన్నెల్లిపైనే ఎదురు కేసు నమోదు చేశారు. ఎన్నికల సమయంలో జరిగిన వివిధ ఘటనలకు సంబంధించి పిన్నెల్లిపై ఇప్పటికే నాలుగు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుల్లో ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను బుధవారం సాయంత్రం హైకోర్టు రద్దు చేయడంతో నరసరావుపేట పోలీసులు పిన్నెల్లిని అరెస్టు చేసి మాచర్ల కోర్టులో హాజరు పరిచారు. పాల్వాయి గేటు ఈవీఎం ధ్వంసం, అదే గ్రామంలో మహిళపై దాడి కేసులో బెయిల్ మంజూరు చేసిన కోర్టు, కారంపూడి సీఐ నారాయణస్వామి దాడి, పాలవాయిగేటులో శేషగిరిరావుపై దాడి కేసుల్లో 14 రోజులు రిమాండ్ విధించింది. పిన్నెల్లిని మాచర్ల కోర్టు వద్దకు తీసుకువచ్చిన సమీపంలో న్యాయస్థానం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుమిగూడి పిన్నెల్లికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు పిన్నెల్లిపై దాడి చేస్తారని తెలిసి కూడా పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించలేదు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వాహనం దిగి కోర్టు లోపలికి వెళ్లే సమయంలో మీడియాతో పాటు మాచర్లకు చెందిన టీడీపీ నాయకులు కొమ్మెర శివ, మరికొందరు ఆయన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పిన్నెల్లిని దుర్భాషలాడారు. శివ రెండు చేతులు వెనక్కి పెట్టుకుని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నాడు. పక్కకు జరగాలని చెప్పి పిన్నెల్లి ముందుకు వెళ్తుంటే అడ్డుకుని దూషణలకు దిగి, దాడికి యత్నించారు. పిన్నెల్లి అతన్ని పక్కకు తోసి, కోర్టు లోపలికి వెళ్లారు. అంతమంది పోలీసుల మధ్యలో తెలుగుదేశం పార్టీ నాయకుడు మాజీ ఎమ్మెల్యేపై దౌర్జన్యానికి వస్తే చూస్తూ ఊరుకున్న పోలీసులు.. టీడీపీ నేతల ఒత్తిడితో కొమ్మెర శివపై పిన్నెల్లి దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ ఐపీసీ సెక్షన్ 303 కింద కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది.

గన్‌తో టీడీపీ నేత వీరంగం

చిన్నమండెం: అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకుల దాడులు రోజురోజుకు అధికమవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడ్డ టీడీపీ నేతలు నేడు ఏకంగా తుపాకులు, పిస్టోళ్లతో వైఎస్సార్‌సీపీ నేతలను కాల్చి చంపేస్తామంటూ దాడులకు దిగుతున్నారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దిగువగొట్టివీడులో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పుల్లగూర వెంకటరమణ, అతడి సోదరుడు శ్రీరాములుపైన అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గురజాల పాపారావు పిస్టోలుతో బెదిరిస్తూ దాడిచేశారు. శుక్రవారం పొలంలో పనులు చేసుకుంటున్న సర్పంచ్ సోదరులపై పాపారావు తమ పూర్వీకులకు సంబంధించిన శోత్రియం భూముల్లో సేద్యం చేసుకుంటున్నారంటూ దాడికి దిగారు. శోత్రియం భూములకు సంబంధించి తమకిచ్చిన రికార్డుల ఆధారంగా వ్యవసాయం చేసుకుంటున్నామని సర్పంచ్ సోదరులు చెప్పారు. వారి మాటలను వినిపించుకోకుండా పాపారావు పత్రికల్లో రాయలేని పదజాలంతో దూషించారు. భూములకు సంబంధించిన రికార్డులు ఉంటే తీసుకురావాలని సర్పంచ్ సోదరులు ఎదురుతిరిగారు. దీంతో పాపారావు ఇంటికెళ్లి పిస్తోలు (గన్) తీసుకొచ్చారు. గొట్టివీడుకస్వాలోని జెండామాను వీధిలో కాల్చి చంపేస్తానంటూ వీరంగం చేశారు. అధికారం మాది.. ఎవరు అడ్డుకుంటారో చూస్తానంటూ దాడిచేసి సర్పంచ్ వెంకటరమణను, అతడి సోదరుడు శ్రీరాములును గాయపరిచారు. స్థానికులు అడ్డుకుని పాపారావు వద్దనున్న పిస్తోల్‌ను, అతడి బైకును స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన సర్పంచ్ వెంకటరమణ, అతడి సోదరుడు, మరికొందరు కలిసి చిన్నమండెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆ పిస్తోల్‌ను సీఐ, ఎస్‌ఐలకు అప్పగించారు. పాపారావుపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులతో రైతు ఆత్మహత్య

అనంతపురం జిల్లా నార్పల చైతన్యకాలనీలో విషాదం


ఆస్పత్రిలో రైతు నాగప్ప(ఫైల్)

నార్పల: ప్రైవేట్ ఫైనాన్స్ నిర్వాహకుల వేధింపులతో అనంతపురం జిల్లా నార్పల చైతన్యకాలనీలో శుక్రవారం రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు నాగప్ప(46) తన ఒకటిన్నర ఎకరాల్లో పలురకాల పంటలు సాగుచేస్తూ జీవనం సాగించేవాడు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు తీవ్రంగా నష్టపోయిన నాగప్ప ఫైవ్ స్టార్ ఫైనాన్స్‌లో రూ.తొమ్మిది లక్షల అప్పు చేశాడు. ఫైనాన్స్ వారు వడ్డీకివడ్డీ వేస్తూ నోటీసులు ఇచ్చి డబ్బు కట్టమని వేధించారు. భూమి స్వాధీనం చేసుకుంటామని బెదిరించారు. దీంతో పరువు పోతుందని భావించిన నాగప్ప.. అప్పుతీర్చే మార్గం కనిపించక ఆత్మహత్య చేసుకున్నాడు. వారం రోజులుగా తీవ్రంగా ఆవేదన చెందిన అతడు శుక్రవరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబసభ్యులు 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగప్పకు భార్య చంద్రకళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చంద్రకళ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న టీడీపీ విధ్వంసం

సాక్షి నెట్‌వర్క్: అధికారంలోకి వచ్చిన అనంతరం టీడీపీ మూకలు చేస్తున్న అరాచకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇష్టారీతిన రెచ్చిపోయి విధ్వంసాలకు పాల్పడుతున్నారు. శిలాఫలకాలను, స్తూపాలను, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలను ధ్వంసం చేస్తున్నారు. వీరి అరాచకాలు గురువారం రాత్రి, శుక్రవారం కూడా కొనసాగాయి. కొన్నిచోట్ల జనసేన నేతలు, కార్యకర్తలు కూడా ఈ విధ్వంసాలకు పాల్పడ్డారు.

- రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు సొంతిల్లు లేకుండా ఉండకూడదనే ఉద్దేశంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. అందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గం కృష్ణాయపాలెం సీఆర్‌డీఏ భూముల్లో పేదలకు వైఎస్సార్ జగనన్న కాలనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పేదలకు సెంటు భూమి కేటాయించి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా స్తూపం నిర్మించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వైఎస్సార్ జగనన్న కాలనీలో స్తూపాన్ని చూసి ఓర్చుకోలేని టీడీపీ మూకలు గురువారం రాత్రి దాన్ని కూల్చివేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని మూడోవార్డులో చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానానికి ఎదురుగా ఉన్న సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని గురువారం రాత్రి ధ్వంసం చేసి అక్కడ నుంచి మాయం చేశారు. రెండేళ్ల కిందట రూ.3.40 లక్షలతో ఆ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఈ రోడ్డును అప్పటి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్వకొలను బాబి ఆధ్వర్యంలో అప్పటి రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. దీనికి సంబంధించి దేవస్థానం గోడకు ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ శిలాఫలకాన్ని ఇప్పుడు ధ్వంసం చేసి మాయం చేశారు. ఆ ప్రదేశాన్ని శుక్రవారం ఆలయ మాజీ చైర్మన్ కల్వకొలను బాబి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసి మాయం చేయడాన్ని బాబి ఖండించారు. గతంలో ఇదే శిలాఫలకంపై కొందరు పేడ పూసి రాక్షసానందం పొందారని విమర్శించారు. అప్పట్లో గొడవలకు ఆస్కారం ఇవ్వకుండా తామే దాన్ని శుభ్రం చేశామని గుర్తు చేశారు. ఈ ఘటనపై పార్టీ పెద్దలకు సమాచారం ఇచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.
- పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలంలో ఉణుదుర్రులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటాన్ని టీడీపీ, జనసేన నాయకులు ధ్వంసం చేయించారు. సచివాలయ నిర్మాణంలో భాగంగా నవరత్నాలను ప్రతిబింబించేలా సచివాలయ పైభాగంలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటంతో ఉన్న శిలాఫలకాన్ని ఏర్పాటుచేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన సమయంలో సచివాలయ సిబ్బంది లేని సమయం చూసి టీడీపీ, జనసేన వర్గీయులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. పక్క గ్రామమైన యండగండి నుంచి ఒక వ్యక్తిని రప్పించి అతడితో జగన్ చిత్రపటం ఉన్న శిలాఫలకాన్ని సుత్తితో పగలగొట్టించారు. భవనంపై ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయమై గ్రామ కార్యదర్శి, వీఆర్వోలను ప్రశ్నించగా.. తమకేమీ తెలియదని, తమ మాట ఎవరూ లెక్కచేయడం లేదని చెప్పారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి జి.సుందర్‌కుమార్ స్థానిక ఎస్‌ఐ దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. టీడీపీ, జనసేన నేతల కవ్వింపు, కక్షసాధింపులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. కొద్దిరోజుల కిందట వైఎస్సార్‌సీపీ జెండా విషయంలో టీడీపీ, జనసేన నాయకులు హడావుడి చేస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్న విషయం తెలిసిందే.


కృష్ణాయపాలెం వైఎస్సార్ జగనన్న కాలనీలో ధ్వంసం చేసిన స్తూపం

మేం కడితే ప్యాలెస్‌లు.. మీరు కడితే పూరి గుడిసెలా!

- చంద్రబాబు ఇచ్చిన జీవో ప్రకారమే పార్టీకి స్థలాల కేటాయింపు
- మాకు నోటీసు ఇచ్చే అధికారం నగరపాలక సంస్థకు లేదు
- మా ఆఫీసుల్లోకి టీడీపీ వారు రావడం దారుణం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ సురేష్ బాబు



కడప కార్పొరేషన్/కోటిరెడ్డి సర్కిల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలను ప్యాలెస్‌లు అంటున్న టీడీపీ నేతలు అన్ని జిల్లాల్లో వారి పార్టీకి కార్యాలయాల బదులు పూరి గుడిసెలు నిర్మించారా అని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె. సురేష్‌బాబు ప్రశ్నించారు. ఆయన శుక్రవారం ఇక్కడి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 2016లో చంద్రబాబు సీఎంగా ఉండగా ఇచ్చిన జీవో ప్రకారమే తాము కూడా పార్టీ కార్యాలయాలకు భూమి తీసుకున్నామన్నారు. ఇదే జీవో ప్రకారం టీడీపీ కూడా అన్ని జిల్లాల్లో భూములు తీసుకొని కళ్లు చెదిరేలా ప్యాలెస్‌లు కట్టిందని చెప్పారు. అమరావతిలో జాతీయ రహదారి పక్కనే 3 ఎకరాల్లో రూ.400 కోట్లతో టీడీపీ కార్యాలయం నిర్మించారన్నారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు ఇచ్చిన స్థలంలో నిర్మించిన పార్టీ కార్యాలయం ఇప్పుడు రూ.1000 కోట్ల విలువ చేస్తుందన్నారు. గతంలో కడప నడిబొడ్డున కోట్లు విలువైన పాత మున్సిపల్ కార్యాలయం స్థలంలో ఎకరా భూమిని టీడీపీకి కేటాయించారని, దీన్ని తాము వ్యతిరేకించడంతో అక్కాయపల్లెలో నేషనల్ హైవే పక్కన పౌర సరఫరాల శాఖ స్థలాన్ని ఇచ్చారని తెలిపారు. అక్కడ సకాలంలో పార్టీ ఆఫీసు కట్టకపోవడంతో దానిని తాము స్వాధీనం చేసుకున్నామన్నారు. 800 చదరపు అడుగులు దాటితే ప్లాన్ ఇచ్చే అధికారం కార్పొరేషన్‌కు లేదని తెలిపారు. అందువల్ల తమ కార్యాలయానికి నోటీసు ఇచ్చే అధికారం కార్పొరేషన్‌కు లేదన్నారు. కడప రామాంజనేయపురంలోని తమ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే, ఇతర నాయకులు పరిశీలించడం దారుణమన్నారు. దీన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రుషికొండపై టూరిజం కింద అభివృద్ధి చేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్యాలెస్ కట్టుకున్నారని దుష్ప్రచారం చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో చేస్తున్నది దాడులు, దమనకాండ, హత్యలేనని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసిందని, అర్హతే ప్రామాణికంగా కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలిపారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం కూడా వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పింఛన్లలో ఒక్కటి కూడా తొలగించకూడదని, కొత్తవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్.యానాదయ్య కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఎట్టకేలకు చిక్కిన చిరుత



శిరివెళ్ల: వారం రోజుల కిందట ఓ మహిళను చంపిన చిరుత పులి ఎట్టకేలకు శుక్రవారం బోనులో చిక్కింది. వివరాల్లోకి వెళితే... ఈ నెల 25న నల్లమల అటవీ ప్రాంతంలో కట్టెల కోసం వెళ్లిన ఓ మహిళను చిరుత పులి చంపింది. ఈ నేపథ్యంలో పులి నుంచి తమకు రక్షణ కల్పించాలని అడవి బిడ్డలు రోడ్డెక్కి ధర్నా చేశారు. దీంతో అధికారులు చిరుత కోసం ఐదు చోట్ల బోన్లు ఏర్పాటు చేశారు. పచ్చర్ల- సర్వనరసింహస్వామి ఆలయం మధ్య నంద్యాల- ఒంగోలు రహదారిపై ఉన్న చెక్ పోస్టుకు సమీపంలోని బోనులో శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో మేక పిల్ల కోసం వచ్చి చిరుత బోనులో చిక్కింది. నంద్యాల జిల్లా ఫారెస్టు డిప్యూటీ డైరెక్టర్ అనురాధ మీనా అధికారులతో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఫారెస్ట్ డాక్టర్లతో మత్తు మందు ఇచ్చి రెస్క్యూ వాహనంలో తిరుపతి వెంకటేశ్వర జూకు చిరుతను తరలించారు. అనంతరం డీడీ మాట్లాడుతూ మహిళను చంపిన చిరుత, బోనులో చిక్కిన చిరుత ఒకటేనన్నారు. చిరుత వయస్సు ఐదు నుంచి ఆరేళ్ల మధ్య ఉంటుందని తెలిపారు.

పార్లమెంట్‌లో నీట్ రగడ

పరీక్షలో అక్రమాలపై వెంటనే చర్చించాలని విపక్షాల డిమాండ్

అంగీకరించని స్పీకర్, చైర్మన్ • ఉభయ సభలు పలుమార్లు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష–అండర్ గ్రాడ్యుయేట్(నీట్–యూజీ) వ్యవహారం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేసింది. నీట్ పరీక్షలో అవినీతి అక్రమాలపై, పేపర్ లీకేజీపై వెంటనే చర్చ చేపట్టాలని శుక్రవారం ప్రతిపక్షాలు గట్టిగా పట్టుబట్టాయి. నినాదాలతో హోరెత్తించాయి. ఇతర వ్యవహారాలు పక్కనపెట్టి నీట్ అభ్యర్థుల భవితవ్యాన్ని కాపాడడంపై చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేశాయి. తర్వాత చర్చిద్దామని సభాపతులు కోరినప్పటికీ ప్రతిపక్ష నేతలు శాంతించలేదు. దీంతో సభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది.

దిగువ సభలో విపక్షాల ఆందోళన

లోక్‌సభ శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే సుశీల్‌కుమార్ మోదీ సహా పలువురు మాజీ సభ్యుల మృతి పట్ల స్పీకర్ ఓం బిర్లా సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం విపక్ష సభ్యులు నీట్ అంశాన్ని లేవనెత్తారు. తక్షణమే చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్పీకర్ స్పందిస్తూ... రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తెలిపే తీర్మానంపై చర్చ వాయిదా వేయడం కుదరని, ఈ నేపథ్యంలో జీరో అవర్ చేపట్టలేమని అన్నారు. కాంగ్రెస్ పక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ... అభ్యర్థుల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని నీట్–యూజీపై చర్చించాలని అన్నారు. డీఎంకే, టీఎంసీ, కాంగ్రెస్ ఎంపీలు వారి సీట్ల వద్దే నిల్చొని నినాదాలు ప్రారంభించారు. రాహుల్ గాంధీ విజ్ఞప్తిని స్పీకర్ తిరస్కరించారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న స్పీకర్ బిర్లా


ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ప్రారంభించారు. కేంద్ర న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ మాట్లాడుతుండగా విపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. సభాపతి ఎంతగా వారించినా వినకుండా నినాదాలు కొనసాగించారు. తొలుత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చిద్దామని, ఆ తర్వాత నీట్‌పై చర్చకు సమయం కేటాయిస్తానని సభాపతి పేర్కొన్నప్పటికీ విపక్షాలు పట్టువీడలేదు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ఓం బిర్లా ప్రకటించారు. సభ పునఃప్రారంభమైన తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన నురుల్ హసన్‌తో ఎంపీగా స్పీకర్ ప్రమాణం స్వీకారం చేయించారు. అనంతరం లోక్‌సభలో కమిటీల ఏర్పాటుకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. మరోవైపు నీట్–యూజీపై విపక్షాలు తమ ఆందోళన కొనసాగించాయి. అభ్యర్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్ డిమాండ్ చేశారు. సభ సజావుగా సాగేందుకు విపక్ష సభ్యులు సహకరించాలని స్పీకర్ కోరారు. అయినప్పటికీ విపక్ష సభ్యులు శాంతించకపోవడంతో లోక్‌సభను స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు.


లోక్‌సభలో నీట్‌పై చర్చకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తదితరులు

రాజ్యసభలో వెల్‌లోకి దూసుకొచ్చిన ఖర్గే

నీట్ అంశంపై చర్చ చేపట్టకుండా ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తోందని రాజ్యసభలో ప్రతిపక్షాలు నిలదీశాయి. విపక్షాల నిరసనలు, నినాదాల వల్ల శుక్రవారం ఎగువ సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మూడుసార్లు వాయిదా వేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టగా విపక్షాలు అడ్డుకున్నాయి. నీట్‌పై చర్చించాలని పట్టుబట్టాయి. నీట్‌లో అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని జేడీ(ఎస్) సభ్యుడు హెచ్.డి.దేవెగౌడ గుర్తుచేశారు. సభ సక్రమంగా జరిగేలా విపక్ష సభ్యులంతా సహకరించాలని కోరారు. నీట్‌పై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని, అప్పటిదాకా అందరూ ఓపిక పట్టాలని చెప్పారు. నీట్‌పై చర్చించాలని కోరుతూ ప్రతిపక్షాల నుంచి 22 నోటీసులు వచ్చాయని, వాటిని తిరస్కరిస్తున్నానని ధన్‌ఖడ్ చెప్పారు. దీనిపై విపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకొచ్చి బిగ్గరగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష నేత





మల్లికార్జున ఖర్గే సైతం వెల్‌లోకి దూసుకురావడంపై రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నాయకుడు వెల్‌లోకి రావడం రాజ్యసభ చరిత్రలో ఇదే మొదటిసారి అని, పార్లమెంట్‌కు ఇదొక మచ్చ అని ఆక్షేపించారు. పార్లమెంటరీ సంప్రదాయం ఈ స్థాయికి దిగజారిపోవడం తనను ఆవేదనకు గురిచేస్తోందన్నారు. ఈ ఘటన దేశంలో ప్రతి ఒక్కరినీ మానసికంగా గాయపర్చిందని చెప్పారు. నీట్‌పై చర్చకు సభాపతి అనుమతి ఇవ్వకపోవడంతో ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఇదిలా ఉండగా, సభలో మాట్లాడేందుకు చైర్మన్ ధనఖడ్ అవకాశం ఇవ్వకపోవడం వల్లే తాను వెల్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే వివరణ ఇచ్చారు. అయితే, ధన్‌ఖడ్ చెబుతున్నట్లుగా రాజ్యసభలో ప్రతిపక్ష నేత వెల్‌లోకి వెళ్లడం ఇదే మొదటిసారి కాదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వెల్లడించారు. 2019 ఆగస్టు 5న రాజ్యసభలో అప్పటి విపక్ష నేత గులాం నబీ ఆజాద్ వెల్‌లోకి వెళ్లారని గుర్తుచేశారు.

స్పృహతప్పి పడిపోయిన కాంగ్రెస్ ఎంపీ

రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ఫూలోదేవి నేతమ్ శుక్రవారం స్పృహ తప్పి పడిపోయారు. అధిక రక్తపోటు కారణంగా ఆమె అనారోగ్యానికి గురయ్యారు. పార్లమెంట్ సిబ్బంది ఆమెను ఆసుపత్రిలో చేర్చారు. నేతమ్ ఆరోగ్య పరిస్థితి మెరుగైందని, కోలుకుంటున్నారని, ఈ మేరకు ఆసుపత్రి నుంచి తనకు సమాచారం అందిందని చైర్మన్ ధన్‌ఖడ్ సభలో ప్రకటించారు.

ఆగస్టు 21 నుంచి యూజీసీ-నెట్

న్యూఢిల్లీ: పీహెచ్‌డీల్లో ప్రవేశాల కొరకు నిర్వహించే యూజీసీ- నెట్‌కు కొత్త తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 4 దాకా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని శుక్రవారం రాత్రి ప్రకటించింది. తొలుత జూన్ 18న యూజీసీ- నెట్‌ను నిర్వహించారు. అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో మరుసటి రోజు ఈ పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే వాయిదా పడ్డ సీఎస్ఐఆర్- యూజీసీ-నెట్‌ను జూలై 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. వాయిదా పడ్డ నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఎన్‌సీఈటీ)ని జూలై 10న నిర్వహిస్తామని ఎన్‌టీఏ వెల్లడించింది.

నీట్ అభ్యర్థుల భవితవ్యాన్ని కాపాడాలి

కేంద్రానికి రాహుల్ గాంధీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: నీట్–యూజీ పరీక్షలో అక్రమాలకు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని, లక్షలాది మంది యువత భవిష్యత్తుకు సంబంధించిన ఈ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఉభయ సభల్లో గౌరవప్రదమైన, ఫలవంతమైన చర్చ జరగాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం, ప్రతిపక్షం కట్టుబడి ఉన్నట్లు ఒక స్పష్టమైన సందేశాన్ని, హామీని పార్లమెంట్ నుంచి ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. రాహుల్ శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. చట్టసభల్లో చర్చించడానికి నీట్–యూజీ కంటే పెద్ద అంశం ఇంకేం ఉంటుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈరోజు ఇదే అత్యంత ముఖ్యమైన అంశమని స్పష్టం చేశారు. చర్చకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని నిలదీశారు.

నీట్ నుంచి మినహాయించండి

కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ మళ్లీ తీర్మానం

చెన్నై: నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి కోరింది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు బదులుగా ప్లస్ టూలో పొందిన మార్కుల ప్రాతిపదికన రాష్ట్ర విద్యార్థులను వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం సీఎం ఎంకే స్టాలిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. నీట్ విధానం వివక్షాపూరితమని, పేద, గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్య అందకుండా చేస్తోందని సీఎం స్టాలిన్ ఈ సందర్భంగా ఆరోపించారు. దీనివల్ల, వైద్య విద్య ప్రవేశాలకు ప్లస్ టూ మార్కుల ఆధారంగా విద్యార్థులను చేర్చుకునే హక్కు రాష్ట్రాలకు దూరమైందన్నారు.

హేమంత్ సోరెన్‌కు బెయిల్

- భూకుంభకోణం కేసులో జార్ఖండ్ హైకోర్టు ఉత్తర్వులు
- జైలు నుంచి విడుదలైన హేమంత్ సోరెన్

రాంచీ: భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జార్ఖండ్ ముక్తిమోర్చా(జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్(48)కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో జార్ఖండ్ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హేమంత్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ రంగోన్ ముఖోపాధ్యాయ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. హేమంత్ సోరెన్‌కు బెయిల్ ఇస్తే మళ్లీ ఇదే తరహా అవినీతికి పాల్పడే అవకాశం ఉందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తరఫు న్యాయవాది ఎస్.వి.రాజు పేర్కొన్నారు. ఆయనకు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. ఈడీ వాదనను ధర్మాసనం తిరస్కరించింది. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే హేమంత్ ఏ నేరమూ చేయలేదని, బెయిల్‌పై బయట ఉన్నప్పుడు ఆయన నేరం చేసే అవకాశం లేదని, అందుకే బెయిల్ ఇస్తున్నామని స్పష్టంచేసింది. హేమంత్ రూ.50 వేల పూచీకత్తు సమర్పించాలని, ఆయనకు ష్యూరిటీ ఇస్తూ మరో ఇద్దరు రూ.50 వేల చొప్పున పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తాము సుప్రీంకోర్టుకు వెళ్తామని, ఈ బెయిల్ తీర్పుపై 48 గంటలపాటు స్టే విధించాలని ఈడీ తరఫున మరో న్యాయవాది జోహెబ్ హుస్సేన్ విజ్ఞప్తి చేయగా ధర్మాసనం తిరస్కరించింది. జార్ఖండ్ రాజధాని రాంచీలో 8.86 ఎకరాల భూకుంభకోణం కేసులో హేమంత్ సోరెన్‌ను ఈ ఏడాది జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.


జైలు నుంచి విడుదలై వచ్చిన సోరెన్‌కు ఇంటి వద్ద హారతిస్తున్న భార్య కల్పనా సోరెన్

తప్పుడు కేసులో ఇరికించారు: హేమంత్

తనను తప్పుడు కేసులో ఇరికించి, ఐదు నెలలపాటు జైల్లో పెట్టారని హేమంత్ సోరెన్ ఆరోపించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని అధికార బీజేపీపై నిప్పులు చెరిగారు. ప్రతిపక్ష నేతలు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టుల గొంతులను ప్రభుత్వం అణచివేస్తోందని మండిపడ్డారు.

విదేశాంగ కార్యదర్శిగా విక్రం మిశ్రీ నియామకం

న్యూఢిల్లీ: జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారు విక్రమ్ మిశ్రి (59) విదేశాంగ శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. వినయ్ క్వాత్రా స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. క్వాత్రాను అమెరికాలో భారత రాయబారిగా నియమించొచ్చని సమాచారం. 1989 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కు చెందిన మిశ్రి నియామకం జులై 15 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం పేర్కొంది. ఐకే గుజ్రాల్, మన్మోహన్ సింగ్, నరేంద్ర మోదీ రూపంలో ఏకంగా ముగ్గురు ప్రధానులకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన అరుదైన రికార్డు మిశ్రి సొంతం. చైనాతో సంబంధాలు దిగజారిన వేళ ఆ దేశ వ్యవహారాల నిపుణుడిగా పేరున్న మిశ్రి నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. 2019–21 మధ్య ఆయన చైనాలో భారత రాయబారిగా పని చేశారు.

నేటి నుంచి అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్/జమ్మూ: అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య వార్షిక అమర్‌నాథ్ యాత్ర నేడు ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా మొదటి విడతలో 4,603 మంది యాత్రికుల బృందం శుక్రవారం కశ్మీర్‌కు చేరుకుంది. జమ్మూలోని భగవతి నగర్ బేస్ క్యాంపు నుంచి శుక్రవారం ఉదయం బయలుదేరిన యాత్రికులకు అధికారులు, పోలీసులు, స్థానిక ముస్లింలు దారి పొడవునా సాదర స్వాగతం పలికారు. జూన్ 29 నుంచి ఆగస్టు 19వ తేదీ వరకు 52 రోజుల పాటు ఈ యాత్ర రెండు మార్గాల్లో సాగుతుంది.

నోరు మూయించేందుకు డబ్బులిచ్చారు!

యడియూరప్పపై కోర్టులో సీఐడీ చార్జిషీటు

బెంగళూరు: కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప(81)పై లైంగిక వేధింపుల కేసులో బెంగళూరు సీఐడీ పోలీసులు ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన చార్జిషీటులో కీలక విషయాలు వెల్లడించారు. బాధితురాలి(17)తోపాటు ఆమె తల్లి నోరు మూయించేందుకు యడియూరప్ప, మరో ముగ్గురు వారికి డబ్బులిచ్చారని పేర్కొన్నారు. ఇందుకు గాను అరుణ్ వైఎం, రుద్రేశ్ ఎం, మరిస్వామి ఎం అనే యడియూరప్ప అనుచరులపై ఐపీసీలోని 204, 214 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

'నీట్-యూజీ' కేసులో ప్రిన్సిపాల్ అరెస్ట్

న్యూఢిల్లీ: నీట్–యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ అధికారులు శుక్రవారం జార్ఖండ్‌కు చెందిన ఓ స్కూలు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లను అదుపులోకి తీసుకున్నారు. మే 5న జరిగిన నీట్ పరీక్షకు హజారీబాగ్‌లో స్థానిక ఒయాసిస్ స్కూలు ప్రిన్సిపాల్ ఎహ్సానుల్ హక్‌ను కోఆర్డినేటర్‌గాను, వైస్ ప్రిన్సిపాల్ ఇంతియాజ్ ఆలంను అబ్జర్వర్‌గాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నియమించింది. వీరిద్దరూ కలిసి నీట్ పేపర్‌ను లీక్ చేసినట్లు సీబీఐ ఆరోపించింది. ప్రశ్నాపత్రాలున్న బాక్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా వీరు తెరిచినట్లు తెలిపింది. వీరి నుంచి పట్నాలో సంజీవ్ కుమార్ అలియాస్ లుటాన్ ముఖియా గ్యాంగ్‌కు పేపర్ చేరినట్లు సీబీఐ అనుమానిస్తోంది.

లారీ, టెంపో ఢీ: 13 మంది మృతి

సాక్షి, బళ్లారి: కర్ణాటకలోని హావేరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీని టెంపో ట్రావెలర్ ఢీకొన్న ఘటనలో ఏడుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా 13 మంది చనిపోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. బ్యాడగి తాలూకా గుండెనహళ్లి వద్ద శుక్రవారం 3.45 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. శివమొగ్గ జిల్లా ఎమ్మెహట్టి గ్రామానికి చెందిన ఆదర్శ్ కొత్తగా కొనుగోలు చేసిన టెంపో ట్రావెలర్ వాహనంలో కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి మహారాష్ట్రలోని తుల్జా భవాని, సొదత్తిలోని ఎల్లమ్మ, చించోళిలోని మాయమ్మ ఆలయాల్లో మొక్కులు చెల్లించుకుని వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో వీరి వాహనం పుణె- బెంగళూరు 48వ జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొంది. 11 మంది అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రగాయాలపాలైన ఇద్దరు ఆస్పత్రికి వెళ్లేసరికే కన్నుమూశారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.


శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయం టెర్మినల్ 1లో కూలిన పై కప్పు


కుప్పకూలిన సపోర్ట్ బీమ్‌ల కింద నలిగిపోయిన కార్లు

ఢిల్లీ విమానాశ్రయంలో కూలిన పైకప్పు

- ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు
- విమాన సర్వీసులకు అంతరాయం

న్యూఢిల్లీ: భారీ వర్షాలకు దేశ రాజధానిలోని ఇందిరాగాంధీ జాతీయ విమానాశ్రయంలో టెర్మినల్ 1 (పాతది) పై కప్పు పాక్షికంగా కుప్పకూలింది. కొంత భాగం కూలి నేరుగా కింద ఉన్న కార్లపై పడింది. దాంతో రమేశ్ కుమార్ (43) అనే ట్యాక్సీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఆరుగురు గాయపడ్డారు. శుక్రవారం ఉదయం 5:30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. అగ్నిమాపక యంత్రాలు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాయి. కూలిన బీమ్‌ల కింద ఉన్న కారులోంచి ఒకరిని కాపాడారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ''శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షంతో రూఫ్ షీట్, సపోర్ట్ బీమ్‌లు కూలాయి. పార్క్ చేసిన 4 కార్లు దెబ్బతిన్నాయి'' అని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో టెర్మినల్ 1 నుంచి అన్ని విమాన సేవలనూ నిలిపివేశారు. చెకిన్ కౌంటర్లను కూడా మూసేశారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ విమానాల్లో వసతి కల్పించారు. కొందరికి టికెట్ డబ్బులు తిరిగిచ్చారు. ఈ టెర్మినల్‌లో ఇండిగో, స్పైస్‌జెట్ దేశీయ విమాన కార్యకలాపాలు సాగిస్తాయి. అవి కార్యకలాపాలను తాత్కాలికంగా టెర్మినల్ 2, 3కి మార్చాయి. విస్తరించిన టెర్మినల్ 1ను ప్రధాని మోదీ మార్చిలో ప్రారంభించారు.

పూర్తిస్థాయి విచారణ: కింజరాపు

పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు టెర్మినల్ 1ను సందర్శించారు. అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించినట్టు చెప్పారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు, క్షతగాత్రులకు రూ.3 లక్షల పరిహారం ప్రకటించారు.

ప్రచార యావ వల్లే: ప్రతిపక్షాలు

మోదీ సర్కారు ప్రచార యావ వల్లే టెర్మినల్ పై కప్పు కూలిందని విపక్షాలు ఆరోపించాయి. నిర్మాణం పూర్తవకుండానే లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మోదీ దాన్ని హడావుడిగా ప్రారంభించారంటూ ఆప్ దుయ్యబట్టింది. ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే దీనికి కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు.

నీట మునిగిన ఢిల్లీ

- భారీ వానలతో అతలాకుతలం
- 88 ఏళ్ల తర్వాత రికార్డు వర్షం
- ఎంపీల నివాసాల్లోకీ వరద నీరు
- నరకం చూపిన ట్రాఫిక్ జామ్‌లు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నీట మునిగింది. రికార్డు స్థాయి భారీ వర్షాలకు అతలాకుతలమైంది. ఢిల్లీతో పాటు జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో వరుసగా శుక్రవారం రెండో రోజూ భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో ఎడతెగని వర్షం పడింది. దాంతో భరించలేని ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఢిల్లీ వాసులకు ఉపశమనం కలిగినా నగరంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఢిల్లీలోని పలు ప్రాంతాలతో పాటు ఎన్సీఆర్ రోడ్లను వరదలు ముంచెత్తాయి. వరద నీటి ధాటికి చాలాచోట్ల డ్రైనేజీ వ్యవస్థ స్తంభించిపోవడంతో సమస్య మరింత విషమించింది. సమీప ప్రాంతాలన్నింటినీ వరద ముంచెత్తింది. ఢిల్లీ జల మంత్రి ఆతిశితో పాటు శశి థరూర్ తదితర ఎంపీల నివాసాలు కూడా నీట మునిగాయి. వారి ఇళ్లలోని ఫర్నిచర్ తదితరాలు వరద నీటిలో తేలియాడుతూ కన్పించాయి. వర్షాలు, సంబంధిత ఉదంతాల్లో ఐదుగురు మరణించారు. నీటితో నిండిపోయిన అండర్‌పాస్‌ల్లో వాహనాలు తేలియాడాయి. పలుచోట్ల వాటిలో ప్రయాణికులు గంటలపాటు చిక్కుకున్నారు. గుర్గావ్‌లోని పలు నివాస ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో ట్రాఫిక్ గందరగోళం ఏర్పడింది. తూర్పు ఢిల్లీలోని అక్షరధామ్ నుంచి గాజీపూర్ దాకా, అక్షరధామ్–సరాయ్ కాలే ఖాన్ రహదారిపైనా... ఇలా ఎక్కడ చూసినా ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయి జనాలకు చుక్కలు చూపింది. ఎక్కడ చూసినా మోకాలి లోతు, అంతకు మించి వరద కన్పించింది. పలు చోట్ల మెట్రో స్టేషన్లు కూడా నీట మునిగాయి. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ వాతావరణ కేంద్రంలో ఏకంగా 153.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి.

జూలై 3 దాకా వానలే

ఢిల్లీ–ఎన్సీఆర్‌లో గురువారం నుంచి శుక్రవారం ఉదయం దాకా 24 గంటల్లో 228 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అక్కడ గత 88 ఏళ్లలో అత్యధిక వర్షపాతంగా రికార్డుకెక్కింది. జూన్‌లో ఢిల్లీలో సగటున 80.6 మి.మీ వర్షం కురుస్తుంది. ఢిల్లీలో ఏడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కొనసాగవచ్చని భారత వాతావరణ శాఖ పేర్కొంది. జూలై 3 దాకా ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ''ఈదురుగాలులతో భారీ వర్షాలు పడొచ్చు. జూలై 1, 2 తేదీల్లో ఉరుములతో కూడిన వర్షం పడుతుంది'' అని పేర్కొంది.

ఓటు బ్యాంకు రాజకీయాలు

అమెరికా నివేదికపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ ధ్వజం

న్యూఢిల్లీ: భారత్‌లో మత స్వేచ్ఛకు భంగం కలుగుతోందని, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ 'అంతర్జాతీయ మత స్వేచ్ఛ'పై అమెరికా తాజాగా విడుదల చేసిన నివేదికను కేంద్రం శుక్రవారం తీవ్రంగా ఖండించింది. నివేదిక పూర్తిగా పక్షపాతపూరితమని, ఓటు బ్యాంకు అంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించినట్లు కనిపిస్తోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆక్షేపించారు. భారత్‌లో సామాజిక పరిస్థితులపై అమెరికా అధికారులకు అవగాహన లేదని స్పష్టమవుతోందన్నారు. భారత్ వ్యతిరేక కథనాన్ని సృష్టించడమే లక్ష్యంగా కేవలం కొన్ని ఘటనలను పరిగణనలోకి తీసుకున్నారని చెప్పారు. భారత కోర్టుల తీర్పుల విశ్వసనీయతను సవాలు చేసేలా అసత్యాలు అచ్చువేశారని మండిపడ్డారు.

ట్రంప్ జోరు బైడెన్ బేజారు

తొలి డిబేట్‌లో ట్రంప్ దూకుడు • తడబడ్డ బైడెన్

పదాల కోసం పదేపదే తడుముకున్న అధ్యక్షుడు

గొంతులో వణుకు, మాటల్లో అయోమయం

బైడెన్ తీరుపై డెమొక్రాట్లలో తీవ్ర ఆందోళన

అట్లాంటా: అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసులో రిపబ్లికన్ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (78) దూకుడు పెంచారు. దేశాధ్యక్షుడు, డెమొక్రాట్ల అభ్యర్థి జో బైడెన్‌తో తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. శుక్రవారం (భారత కాలమానం ప్రకారం) సీఎన్ఎన్ చానల్లో దాదాపు 90 నిమిషాల పాటు జరిగిన వాదనలో బైడెన్ సర్వశక్తులూ ఒడ్డారు. తన వయసుపై విమర్శలు, అధ్యక్ష బాధ్యతలను సజావుగా నిర్వర్తించడంపై అమెరికన్లలో నానాటికీ పెరుగుతున్న అనుమానాలను కొట్టిపారేసేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. ట్రంప్ తనకంటే కేవలం మూడేళ్లే చిన్నవాడని పదేపదే చెప్పుకున్నారు. కానీ డిబేట్ పొడవునా బైడెన్ పదేపదే తడబడ్డారు. ప్రసంగం మధ్యలో ఉన్నట్టుండి మౌనాన్ని ఆశ్రయించారు. మాటల కోసం తడుముకున్నారు. తనలో తానే గొణుక్కుంటూ కన్పించారు. మాట్లాడుతున్న అంశాన్ని అర్ధంతరంగా వదిలేసి మరో విషయం ఎత్తుకుని ఆశ్చర్యపరిచారు. కొన్నిసార్లు బైడెన్ ఏం చెప్తున్నదీ ఎవరికీ అర్థం కూడా కాలేదు. పలు అంశాలపై ట్రంప్ పచ్చి అబద్ధాలు చెప్పినా వాటిని ఎత్తిచూపడంలో, సొమ్ము చేసుకోవడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారు. తనకు అనుకూలమైన గణాంకాలను సమయానుకూలంగా ప్రస్తావించడంలో కూడా చతికిలపడ్డారు. డిబేట్‌లో ట్రంపే నెగ్గారని సీఎన్ఎన్ పోలింగ్‌లో ఏకంగా 67 శాతం మంది ఓటర్లు పేర్కొన్నారు. బైడెన్‌కు 33 శాతం ఓట్లే లభించాయి. న్యూయార్క్ టైమ్స్ వంటి ప్రఖ్యాత వార్తా పత్రికలు కూడా తొలి డిబేట్ ట్రంప్‌దేనని పేర్కొన్నాయి. ''బైడెన్‌పై వయోభారం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. ఆయన మాటతీరులోనూ అది స్పష్టంగా ప్రతిఫలించింది. ఆయన చెబుతున్న విషయాల్లో పొందికే లేకుండా పోయింది'' అంటూ విమర్శలు గుప్పించాయి. దూకుడుకు మారుపేరైన ట్రంప్‌కు 81 ఏళ్ల బైడెన్ ఏ మేరకు పోటీ ఇవ్వగలరోనంటూ డెమొక్రాట్లలో ఇప్పటికే గట్టిగా ఉన్న అనుమానాలు కాస్తా తాజా డిబేట్ నేపథ్యంలో ఆందోళనగా మారాయి. వాదనలో బైడెన్ తొలుత కాస్త వెనకబడ్డారని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా అంగీకరించారు. అయితే క్రమంగా పుంజుకుని సమర్థంగా ముగించారని చెప్పుకొచ్చారు. బైడెన్ భార్య జిల్ మాత్రం తన భర్త భలే బాగా మాట్లాడారంటూ ప్రశంసించారు! ''ప్రతి ప్రశ్నకూ చక్కగా బదులిచ్చావు. అన్ని సమాధానాలూ తెలుసు నీకు!'' అంటూ ఆయన్ను మెచ్చుకున్నారు. కానీ ఈ డిబేట్ నేపథ్యంలో బైడెన్ అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలంటున్న వారి సంఖ్య డెమొక్రాట్లలో క్రమంగా పెరుగుతోంది. ట్రంప్, బైడెన్‌లను అధ్యక్ష అభ్యర్థులుగా ఇంకా లాంఛనంగా ప్రకటించాల్సి ఉంది. జూలై 15–18 మధ్య జరిగే సదస్సులో రిపబ్లికన్లు, ఆగస్టు 19న సదస్సులో డెమొక్రాట్లు తమ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరగనున్నాయి.


తొలి అధ్యక్ష డిబేట్‌లో తలపడ్డ ట్రంప్, బైడెన్

పరస్పర విమర్శల వర్షం...

అమెరికా ఆర్థిక వ్యవస్థ, అబార్షన్ చట్టం, విదేశీ వ్యవహారాలు, వలసల వంటి పలు అంశాలపై ట్రంప్, బైడెన్ మధ్య వాడివేడి వాదనలు సాగాయి. ఆ క్రమంలో నేతలిద్దరూ తిట్ల పర్వానికి దిగారు. ''నువ్వే అబద్ధాలకోరు. అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త ప్రెసిడెంట్ కూడా నువ్వే'' అంటూ పరస్పరం దుయ్యబట్టుకున్నారు. పలు రకాల విమర్శలు చేసుకున్నారు. హష్ మనీ కేసు దోషి అంటూ ట్రంప్‌కు బైడెన్ చురకలు వేశారు. ''జరిమానాలుగా నువ్వు ఎన్ని బిలియన్ డాలర్లు కట్టాలో గుర్తుందా? భార్య గర్భవతిగా ఉండగా నీలి చిత్రాల తారతో గడిపావు. నైతికత విషయంలో వీధుల్లో విచ్చలవిడిగా తిరిగే పిల్లి కంటే కూడా హీనం'' అంటూ విమర్శల వర్షం కురిపించారు. బైడెన్‌తో పాటు ఆయన కుమారుడు హంటర్ కూడా క్రిమినలేనంటూ మాజీ అధ్యక్షుడు ట్రంప్ కూడా విరుచుకుపడ్డారు. అస్తవ్యస్తమైన వలసల విధానంతో దేశ భవితవ్యాన్నే బైడెన్ ప్రమాదంలోకి నెట్టారంటూ దుయ్యబట్టారు. డిబేట్ ఆరంభం నుంచే ట్రంప్ పై చేయి కనబరిచారు. ఆయనను ఇరుకున పెట్టేందుకు బైడెన్ చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు.

నెహ్రూ కన్నా మోదీ మిన్న

రాజ్యసభలో సుధాన్ష్ త్రివేది వ్యాఖ్యల దుమారం

న్యూఢిల్లీ: ''ప్రధాని నరేంద్ర మోదీ సాటిలేని నేత. తొలి ప్రధాని నెహ్రూతో ఆయనకు పోలికే లేదు. నెహ్రూ కంటే మోదీ అన్ని విషయాల్లోనూ ఎంతో మిన్న'' అని బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం రాజ్యసభలో చర్చను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెహ్రూ ఘనతను మోదీ ఏనాటికీ అందుకోలేరన్న విపక్షాల వ్యాఖ్యలను ఎద్దేవా చేశారు. ''నెహ్రూతో మోదీకి పోలిక లేదని విపక్షాలంటున్నాయి. నిజమే. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడితే మహాత్మా గాంధీ మద్దతిచ్చినా ఒక్క ఓటూ సాధించుకోలేని చరిత్ర నెహ్రూది. మోదీ మాత్రం బీజేపీకి సారథ్యం వహించేందుకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిద్దరికీ పోలికే లేదు'' అని అన్నారు. ''నెహ్రూతో పోలిస్తే మోదీ అత్యంత సమర్థుడైన ప్రధాని. దేశం ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యల పరిష్కారంలో నెహ్రూ కన్నా మోదీదే అత్యంత సమర్థమైన వ్యవహార శైలి'' అని అభిప్రాయపడ్డారు. ''నెహ్రూది అతి సంపన్న కుటుంబ నేపథ్యం. మోదీ ఏమో పేద కుటుంబం నుంచి వచ్చారు. చిరిగిన బట్టలతో బాల్యం గడిపారు. నెహ్రూ తన విమర్శకులను జైల్లో తోయిస్తే మోదీ ఎప్పుడూ అలాంటి చర్యలకు పాల్పడలేదు. నెహ్రూ తనకు తానే భారత రత్న ఇచ్చుకున్నారు. మోదీ మాత్రం పార్టీలకు అతీతంగా భరతమాత ముద్దుబిడ్డలను ఆ పురస్కారంతో సమున్నతంగా గౌరవించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 29 : జూన్ : 2024




బెంగళూరులో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. చామరాజపేటలో వర్షంలో తడుస్తూ వెళ్తున్న మహిళ, గొడుగు సహాయంతో వెళ్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

తుపాకీ తూటాకు బాలుడి బలి

హుబ్లీ: వన్య ప్రాణుల వేటకు వెళ్లిన బాలుడు తుపాకీ గుండు తగిలి మృత్యువాత పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. వివరాలు.. చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు తాలూకా సుంకిమలె గుట్ట వద్ద గత మార్చి 3న ఈ ఘటన జరిగింది. మొళకాల్మూరు కొనే లేఅవుట్‌కు చెందిన మహేష్(14) ఆరోజున సదరు బెట్టపైకి తుపాకీతో జంతువుల వేటకు వెళ్లాడు. తుపాకీ నుంచి బుల్లెట్ పొరపాటున ముఖంలోకి దూసుకెళ్లి మహేష్ మృతి చెందాడు. ఈ ఘటన వివరాలు తెలుసుకున్న బంధువులు హొన్నూరు స్వామి, నాగరాజ్ గుట్టుచప్పుడు కాకుండా మహేష్ మృతదేహాన్ని కాల్చి వేశారు. మూడు నెలల తర్వాత ఘటన విషయం బయట పడడంతో మొళకాల్మూరు పోలీసులు హొన్నూరు స్వామి, నాగరాజ్‌లను అరెస్ట్ చేశారు.

పెన్‌డ్రైవ్ కేసులో మాజీ ఎమ్మెల్యేకు ఊరట

బనశంకరి: ప్రజ్వల్‌రేవణ్ణ పెన్‌డ్రైవ్ కేసులో హాసన్ మాజీ బీజేపీ ఎమ్మెల్యే ప్రీతంగౌడకు ఊరట లభించింది. ఈ కేసులో ప్రీతంగౌడను అరెస్ట్‌చేయవద్దని హైకోర్టు ఆదేశిస్తూ సిట్ విచారణకు హాజరుకావాలని సూచించింది. ఈ కేసులో బాధితురాలి వీడియో పంచారని ఆరోపణలతో ప్రీతంగౌడతో పాటు ముగ్గురిపై కేసు నమోదైంది. ఈ కేసులో ఇద్దరిని సిట్ అరెస్ట్ చేసింది. సిట్ అరెస్ట్ చేయకుండా ప్రీతం గౌడ హైకోర్టును ఆశ్రయించారు.

నగ్నంగా ఉండాలని బెదిరించేవాడు

బనశంకరి: అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ వద్ద 15 సిమ్‌కార్డులు ఉండగా ఒక నెంబర్ బ్లాక్‌చేస్తే మరో నెంబరు నుంచి కాల్ చేసేవాడు. కొందరు పరిచయస్తుల భార్యలే ప్రజ్వల్ టార్గెట్. వీడియో కాల్‌చేసి నగ్నంగా ఉండాలని బెదిరించేవాడు. సహకరించకపోతే ఫొటో వైరల్ చేస్తానని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడేవాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

అయ్యోపాపం దేవతా విగ్రహాలు



స్వాధీనం చేసుకున్న దేవతా విగ్రహాలు

కృష్ణరాజపురం: కృష్ణరాజపురలో ఆక్రమణల తొలగించేందుకు బీబీఎంపీ అధికారులు చర్యలు చేపట్టారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న చిరు దుకాణాలను శుక్రవారం తొలగింపజేశారు. కొందరు చిరు వ్యాపారులు దేవతా విగ్రహాలను ఫుట్‌పాత్‌పై ఉంచి విక్రయిస్తుండగా అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.

రేపు హోంగార్డ్స్ డీజీపీ కమల్‌పంత్ పదవీ విరమణ



డీజీపీ కమల్‌పంత్

బనశంకరి: హోంగార్డ్స్, అగ్నిమాపక దళం డీజీపీ కమల్‌పంత్ 30న పదవి విరమణ చేయనున్నారు. 1992 కర్ణాటక కేడర్ ఐపీఎస్ అధికారిగా ఉత్తరాఖండ్‌కు చెందిన కమల్ పంత్ రాష్ట్ర పోలీస్‌శాఖలో 34 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించారు. అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా శివమొగ్గలో సేవలు ప్రారంభించిన ఆయన, పలు జిల్లాల్లో ఎస్పీగా, ఐజీపీగా సేవలు అందించి ఏడీజీపీగా పదోన్నతి పొందారు. పాలన, శాంతిభద్రతలు, ఇంటలిజెన్స్ అదనపు డీజీపీగా ఉన్న సమయంలో డీజే.హళ్లి, కేజీ.హళ్లి పోలీస్‌స్టేషన్లపై దాడి ప్రభుత్వ ప్రైవేటు ఆస్తుల ధ్వంసం, ఎమ్మెల్యే ఇంటికి నిప్పుపెట్టిన ఘటనలకు సంబంధించి సమర్థవంతంగా విచారణ చేశారు.

అత్యుత్తమ అధికారి :

శాండిల్‌వుడ్‌లో నటీనటులు డ్రగ్స్, బిట్‌కాయిన్ కుంభకోణంతో పాటు అనేక సవాళ్లు కలిగిన కేసులను వివాదాలకు తావివ్వకుండా విచారణ చేశారు. తన అధికార అవధిలో అనేక సమస్యాత్మక ఘటనలపై కొన్ని కఠిన నిర్ణయాలను తీసుకుని అత్యుత్తమ కమిషనర్‌గా కమల్‌పంత్ పేరుపొందారు. 2015లో జైళ్లశాఖ ఏడీజీపీగా లోకాయుక్త కార్యాలయంలో చోటుచేసుకున్న కోట్లాది రూపాయల కుంభకోణం దర్యాప్తునకు ప్రత్యేక విచారణ బృందానికి చీఫ్‌గా పనిచేశారు. కమల్‌పంత్ పదవీ విరమణతో పోలీస్ కంప్యూటర్ వింగ్ అదనపు పోలీస్ డైరెక్టర్ ఏడీజీపీ ప్రవీణ్ మొహంతి డీజీపీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

కబినికి భారీగా వరద నీరు

మైసూరు: కేరళలోని వైనాడుతో పాటు మైసూరు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు హెచ్‌డీకోటె తాలూకాలోని బీచనహళ్లిలో ఉన్న కబిని జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం డ్యాంలోకి 16,977 క్యూసెక్కుల వరద నీరు రాగా శుక్రవారం 20,113 క్యూసెక్కుల నీరు వచ్చింది. జలాశయం పూర్తిగా నిండటానికి మరో 12 అడుగులు మాత్రమే మిగిలి ఉందని అధికారులు తెలిపారు.

కష్టాల కడలిలో బాల్యం

- బడులకు, ఆట పాటలకు దూరం
- కర్మాగారాలు, హోటళ్లలో మగ్గుతున్న బాల్యం
- ఐటీ రాజధానిలో పెరిగిపోతున్న బాల కార్మికులు
- మూడేళ్లలో 238 మందికి విముక్తి



మాకు విముక్తి లేదా: ఓ కర్మాగారంలో పైప్ కటింగ్ చేస్తున్న బాలుడు



కందిపోయిన వీరి చేతుల్లోకి పలకా బలపం ఎప్పుడొస్తుందో?

సాక్షి బెంగళూరు: పలకా బలపం పట్టుకుని బడిబాట పట్టాల్సిన బాల్యం గ్యారేజీల్లో, కర్మాగారాల్లో, హోటళ్లలో మగ్గిపోతోంది. సాటి చిన్నారులతో కలిసి ఆడుకుంటూ ఆనందంగా గడపాల్సిన బాలలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేసి కందిన చేతులతో ఇంటికొస్తున్నారు. మంచి చదువులు చదివి ఉన్నత స్థితికి చేరుకొని దేశానికి మూల స్తంభాలు కావాల్సిన పిల్లలు బాల్యంలోనే చితికి పోతున్నారు. బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు చట్టాలు అమలు చేస్తున్నా ఆ వ్యవస్థ ఇంకా మనుగడ సాగిస్తోంది. సిలికాన్‌సిటీ బెంగళూరులో బాలకార్మిక విధానం ఇంకా సజీవంగా ఊపిరి తీసుకుంటోంది. గడిచిన మూడేళ్లలో సుమారు 238 మంది బాల కార్మికులను ఆ వెట్టి చాకిరి నుంచి అధికారులు రక్షించారు. కాగా, లెక్కల్లోకి రాకుండా, అనధికారికంగా మరింత మంది బాల కార్మికులు స్కూళ్లకు దూరంగా పనులకు దగ్గరగా బతుకీడుస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. బాలలను పనుల్లో పెట్టుకుని పనులు చేయించుకుంటున్న ఆయా యజమానులపై కేసులు కూడా నమోదు చేశారు. రక్షించిన పిల్లలను పరిహారాన్ని పనుల్లో పెట్టుకున్న సంబంధిత యజమానే చెల్లించాల్సి వస్తుంది. శిశు సంక్షేమ సమితి ఆదేశాల మేరకు రక్షించిన పిల్లల ఖాతాకు పరిహారం బదిలీ చేసి వారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు.

నగరంలో గడిచిన నాలుగేళ్లలో 2021–22 నుంచి 2024 ఏప్రిల్ వరకు మొత్తం 238 మంది బాల కార్మికులను రక్షించారు. ఇందులో 47 మంది బాలికలు కూడా ఉండడం గమనార్హం. 2021–22లో 43 మంది, 2022–23లో 139 మంది, 2024 ఏప్రిల్ వరకు ఒకరిని అధికారులు ఆ వెట్టి చాకిరీ నుంచి కాపాడారు. 2023–24 ఆర్థిక ఏడాదిలో అత్యధికంగా బాల కార్మికులను గుర్తించారు. చిల్లర దుకాణాలు, బేకరీలు, హోటళ్లు, పిండి మెషీన్లు, మిల్లులు, డాబాలు, గ్యారేజీలు, వివిధ మార్కెట్లు, ఏపీఎంసీ దుకాణాలు, కొందరు ఇళ్లలో పిల్లలను పనులకు పెట్టుకుని వారితో చాకిరీ చేయించుకుంటున్నారు. ఇలా వివిధ చోట్ల అధికారులు తనిఖీలు చేయగా ఈ బాల కార్మికులుగా పని చేస్తున్న పిల్లలు పట్టుబడుతున్నారు. దొరికిన ఈ పిల్లలంతా వేరే వేరే జిల్లాలకు చెందిన వారు కావడం గమనార్హం. బాలల పునారావాసం, నిర్బంధ విద్య, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు అధికారులను ప్రభుత్వం నియమించి ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపు కూడా చేస్తోంది. ప్రభుత్వానికి పలు స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా బాల కార్మిక వ్యవస్థ రూపుమాపడం సాధ్యమవడం లేదు. ఎక్కడోచోట పిల్లలు పనుల్లో మగ్గిపోతున్నారు. ఇలా పనులు చేసి డబ్బులు సంపాదించే పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. ఈ పిల్లల్లో శారీరక శ్రమ పెరిగి పౌష్టికాహార కొరత కూడా ఏర్పడుతోంది. ఈ పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం, భద్రత కూడా కరువవుతోందని కర్ణాటక బాల కార్మిక నిర్మూలన సొసైటీ అధికారి ఒకరు తెలిపారు. పేదరికం, నిరక్షరాస్యత కారణంగా పిల్లలు పనులకు వెళ్లాల్సి వస్తోంది.

బెంగళూరులో బాలకార్మికుల సంఖ్య..

ఏడాది	2021-22	2022-23	2023-24	2024, ఏప్రిల్ వరకు
బాలురు	33	33	124	01
బాలికలు	10	22	15	00

రోడ్ల అభివృద్ధికి సహకరించండి

శివాజీనగర: ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం సిద్దరామయ్య శుక్రవారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని భేటీ చేశారు. రాష్ట్రంలో జాతీయ రహదారి అభివృద్ధి పనులపై చర్చించారు. బెళగావి–హునగుంద–రాయచురు (ఎన్‌హెచ్ 74,8ఎ), బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ రహదారి, సూరత్–చెన్నై ఎక్స్‌ప్రెస్ రహదారి, బెంగళూరు నగరంలోని ఉపనగర రింగ్ రోడ్డు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ అభివృద్ధికి అనుమతి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 5,225 కి.మీ మేర 39 రహదారులకు జాతీయ రహదారులుగా ప్రకటించే ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్, మంత్రులు కే.జే.జార్జ్, డాక్టర్ జీ.పరమేశ్వర్, సతీశ్‌జార్కిహొళి, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి టీ.బీ.జయచంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయల్, అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్.కే.అతీక్, శాలిని రజనీశ్, ప్రభుత్వ కార్యదర్శి కే.వీ.త్రిలోకచంద్ర పాల్గొన్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవి

- శిరాడి ఘాట్‌లో మారనహళ్లి–అడ్డహొళె మధ్య టన్నెల్ నిర్మాణం ద్వారా మంగళూరు బందరు రోడ్డు అనుసంధానం
- మైసూరులోని మణిపాల్ ఆసుపత్రి జంక్షన్ వద్ద పై వంతెన నిర్మాణం చేపట్టాలి
- మైసూరు రింగ్ రోడ్డులో ఎన్‌హెచ్ 275కేలో 9 గ్రేడ్ సెపరేటర్‌ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి
- బెళగావి నగరంలో పాత ఎన్‌హెచ్4లో పై వంతెన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి
- గోకాక్ జలాశయంలో కేబుల్ కార్ సదుపాయం
- కల్బుర్గి, రాయచురులో బైపాస్ నిర్మాణం
- ఎన్‌హెచ్–373 బేలూరు చిక్కమగళూరు విభాగంలో చతుష్పథ నిర్మాణం చేపట్టాలి
- చెళ్లకెరెలో ఎన్‌హెచ్–150ఏకు మరమ్మత్తులు
- జాతీయ రహదారి ఎన్‌హెచ్–766లో 106 కి.మీ. రోడ్డును ఆరు లేన్లుగా విస్తరణ

ఉద్యమించిన బీజేపీ శ్రేణులు




చిత్రదుర్గలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను బస్సులో తరలిస్తున్న పోలీసులు, తుమకూరులో కాంగ్రెస్ సర్కార్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కార్యకర్తలు

- వాల్మీకి మండలి కుంభకోణంలో కింగ్‌పిన్ ఎవరో తేల్చాలి
- రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు

బనశంకరి/తుమకూరు: వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల కుంభకోణంపై బీజేపీ కదం తొక్కింది. నగదు అక్రమ బదిలీల వ్యవహారంలో కింగ్‌పిన్ ఎవరనేది గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ శ్రేణులు ఉద్యమించాయి. శుక్రవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆందోళనలు కొనసాగాయి.

సీఎంకు తెలియకుండా అవినీతి జరుగుతుందా?

సాక్షి, బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతి సీఎం సిద్దరామయ్యకు తెలియకుండా జరిగే అవకాశం లేదని, సీఎం తన పదవికి రాజీనామా చేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర డిమాండ్ చేశారు. వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతిపై చిత్రదుర్గలో జిల్లా బీజేపీ శుక్రవారం చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంబంధిత మంత్రి మాత్రమే రాజీనామా చేస్తే సమస్య పరిష్కారం కాదన్నారు. ఇందులో పెద్దల హస్తం ఉందని, మొత్తం బండారం బట్టబయలు కావాలన్నారు. వేలాది మందితో చిత్రదుర్గ కాషాయమయమైంది. ఎటు చూసినా ప్లకార్డులు పట్టుకుని కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టడంతో పోలీసు బలగాలు పెద్ద ఎత్తున మోహరించాయి. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. బళ్లారిలో మాజీ మంత్రి శ్రీరాములు,మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సిట్ దర్యాప్తుతో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేవని, కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. తుమకూరులో అక్రమార్కులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ తుమకూరులో బీజేపీ, జేడీఎస్ నాయకులు శుక్రవారం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కాగా పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేశారు.

ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయింది

బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలిలో చోటుచేసుకున్న కుంభకోణంపై రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై.విజయేంద్ర తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో మునిగిపోయిందని, వాల్మీకి కుంభకోణంపై ఆరోపణలున్న మాజీమంత్రి నాగేంద్రను సిట్ విచారణ చేసే ధైర్యం ఎందుకు చేయలేదని కోర్టు కూడా చీవాట్లుపెట్టిందని మండిపడ్డారు. తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. పాలధర పెంపుపై శనివారం రైతుమోర్చా పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఏడాదిలోనే ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. డీకే.శివకుమార్‌కు సీఎం పదవి ఇవ్వాలని స్వామీజీలు డిమాండ్ పెట్టారన్నారు. చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎవరనేది తమకు ముఖ్యం కాదని ఎవరూ పోటీచేసినా జేడీఎస్‌తో కలిసి ఎన్నికను ఎదుర్కొంటామన్నారు. త్వరలో కోర్ కమిటీ సమావేశం నిర్వహించి అభ్యర్థిని ఎంపిక చేస్తామన్నారు.



మండ్యలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నిధులు పెంచేలా ఒత్తిడి చేయండి

- ఎంపీలకు సూచించిన సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: రాష్ట్రానికి నిధుల కేటాయింపు సమయంలో 1971 నాటి జనాభాలెక్కలను పరిగణలోకి తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎంపీలకు సీఎం సిద్దరామయ్య సూచించారు. ఢిల్లీలో గురువారం జరిగిన ఎంపీల సమావేశం తరువాత శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 15వ ఆర్థిక కమిషన్ నిధుల పంపిణీకి 2011 జనాభా లెక్కలను కేంద్రం పరిగణలోకి తీసుకుందన్నారు. రాష్ట్రంలో జనాభా సమస్యను సమర్థవంతంగా నియంత్రించినందున 1971 జనాభా గణాంకాలను లెక్కలోకి తీసుకురావాలని కేంద్రానికి సూచించాలని ఎంపీలకు తెలియజేసినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి ఇస్తున్న పన్నుల వాటాలో తిరిగి వస్తున్నది 12 శాతం మాత్రమేనన్నారు. దీనిని సరిచేసేలా 16వ ఆర్థిక కమిషన్ ముందు వాదించాలని కేంద్ర మంత్రి హెచ్.డీ.కుమారస్వామికి సూచించినట్లు ఎంపీ తెలిపారు. 14వ ఆర్థిక కమిషన్ 4.7 శాతం నిధులు కేటాయించగా 15వ కమిషన్ 3.6 శాతానికి కుదించిందన్నారు. నిధుల పంపిణీలో అమలు చేస్తున్న విధానం సరిగాలేదని, దీనిని సరిదిద్దేలా ఎంపీలు కేంద్ర ఆర్థిక శాఖపై ఒత్తిడి తేవాలన్నారు. పెరిఫెరల్ రింగ్ రోడ్డు, బెంగళూరు అంతర్జలవృద్ధికి, చెరువుల అభివృద్ధికి రూ.3వేల కోట్లు చొప్పున మొత్తం రూ.6వేల కోట్లు ఇస్తామని చెప్పిన కేంద్రం ఆ తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. ఇప్పటివరకు మొత్తం రూ.11,495 కోట్లు రాష్ట్రానికి రావాల్సి ఉందని, ఈ నిధులు విడుదల చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సీఎం తెలిపారు. మెట్రో మూడో దశకు రూ. 15,600 కోట్లు మంజూరుకు యత్నించాలని ఎంపీలకు సూచించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి వ్యవసాయ సించాయి పథకం కింద రాష్ట్రానికి రూ.700 కోట్లు రావాల్సి ఉందన్నారు. రాయచురులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలని కోరాలని సూచించినట్లు తెలిపారు. కరువు నివారణకు అధిక పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రమాణం పెంచాలని విన్నవించినట్లు వివరించారు.

మేకెదాటు ప్రాజెక్ట్‌కు అనుమతి ఇవ్వాలని ప్రధానికి మళ్లీ విన్నవిస్తాం

ప్రధాని నరేంద్ర మోదీని శనివారం భేటీ చేసి మేకెదాటు ప్రాజెక్ట్‌కు అనుమతి ఇవ్వాలని విన్నవిస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 19న ప్రధానిని కలిసినప్పుడు మేకెదాటు ప్రాజెక్ట్ విషయాన్ని ప్రస్తావించామని, శనివారం భేటీలో కూడా మళ్లీ ఆయన దృష్టికి తీసుకెళ్తామన్నారు.కేంద్ర ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వానికి నచ్చజెప్పాలి లేదా అనుమతి ఇచ్చే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రామనగరలో లోకాయుక్త దాడులు

- ఆర్టీఓ అధికారి, సిబ్బంది, బ్రోకర్ అరెస్టు

దొడ్డబళ్లాపురం: తాము పనిచేస్తున్న శాఖలో అవినీతికి పాల్పడి ప్రభుత్వ ఖజానాకు కోట్లలో నష్టం కలుగజేసిన ఆర్టీఓ అధికారి, సిబ్బంది, బ్రోకర్‌ను లోకాయుక్త పోలీసులు అరెస్ట్ చేశారు. అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో శుక్రవారం ఉదయం లోకాయుక్త పోలీసులు రామనగర ఆర్టీఓ కార్యాలయం, బ్రోకర్ ఇంటిపై దాడులు చేశారు. ఈ సందర్భంగా పలు కీలక డ్యాకుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. రామనగర ఆర్టీఓ అధికారి శివకుమార్, సిబ్బంది రచిత్ రామ్, బ్రోకర్ సతీష్ పాత ట్రాక్టర్లకు కొత్త డాక్యుమెంట్లు తయారు చేయడం, సీజ్ చేయబడిన వాహనాల డాక్యుమెంట్లను ఇచ్చి విక్రయించేవారని, ఇలా సుమారు 2వేల ట్రాక్టర్లను బోగస్ డాక్యుమెంట్లతో విక్రయించినట్టు ఆరోపణలపై ముగ్గురినీ అరెస్టు చేశారు.



ప్రమాద తీవ్రతకు లారీలోకి దూసుకెళ్లిన టెంపో ట్రావెలర్



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

విహారయాత్రలో పెను విషాదం

సాక్షి, బెంగళూరు: విహారయాత్ర13 కుటుంబాల్లో పెను విషాదాన్ని మిగిల్చింది. స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని సంతోషంగా ఇంటికి తిరుగుముఖమైన వారిపై పొగమంచు రూపంలో మృత్యువు పంజా విసిరింది. హావేరి జిల్లా బ్యాడిగి తాలూకా గుండేనహళ్లి క్రాస్ వద్ద బెంగళూరు–పుణే జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా ఎమ్మెహట్టి గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలతో కలిసి మొత్తం 13 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఏడుగురు గాయపడ్డారు. సెకండ్ హ్యాండ్ టెంపో ట్రావెలర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతి కష్టమ్మీద క్షతగాత్రులను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటన స్థలంలో ఎటు చూసిన మృతదేహాలు, క్షతగాత్రులతో భీతావహంగా మారింది. ఎన్నో ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు పూజలు చేసి ఆనందంగా ఇంటికి వెళ్తున్న వీరిని ఏ దేవుడూ ఆదుకోలేకపోయారా? అంటూ స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. హావేరి జిల్లా ఎస్పీ అంశికుమార్ మాట్లాడుతూ... టీటీ వాహనంలో కుటుంబం మొత్తం సవదత్తి రేణుకా యల్లమ్మ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు.



మృతదేహాన్ని అప్పగిస్తున్న దృశ్యం



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

క్లుప్తంగా

సామూహిక వివాహాలతో పేదలకు మేలు



వధూవరులకు తాళిబొట్లు అందిస్తున్న మునిస్వామి, సుశీల దంపతులు

బళ్లారిఅర్బన్: సామూహిక వివాహాలతో పేదలకు ఎంతో మేలని కర్ణాటక రక్షణ యువ వేదిక జిల్లా అధ్యక్షుడు మునిస్వామి తెలిపారు. సమీపంలోని సిరివార అమరేశ్వర దేవస్థానంలో ప్రతి ఏడాదిలా ఈసారి కూడా వేదిక నేతృత్వంలో 21 జంటలకు ఉచిత సామూహిక వివాహాలను ఘనంగా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ వేదిక ఆధ్వర్యంలో గత 18 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు 921 జంటలకు వివాహాలు జరిపించామన్నారు. తన తండ్రి దివంగత రామచంద్రరావు ఆశయం మేరకు ఈ సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నానన్నారు. తన ఊపిరి ఉన్నంత వరకు తన భార్య సుశీలతో కలిసి ఈ సంకల్పం నిరంతరం కొనసాగిస్తానన్నారు.

కార్యవర్గం ఎంపిక



ఎంపికైన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

గంగావతి రూరల్: భత్తదనాడు గంగావతి లయన్స్ క్లబ్‌కు నూతన అధ్యక్షుడుగా శ్రీరామనగర్ కె.సుబ్రహ్మణ్యేశ్వరరావుతోపాటు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్ర సిరిగేరి, ట్రెజరర్‌గా ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ మల్లనగౌడ హెచ్, శ్రీకాంత్ ఎం, సతీష్ వి.బోజశెట్టర్‌తోపాటు లయన్స్ సభ్యులను ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మానవతా, సేవా దృక్పథంతో క్లబ్ సభ్యులందరూ పని చేయాలని కోరారు. లయన్స్ క్లబ్ అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు చంద్రప్ప, సోమరాజ్, మాధవ్ శెట్టి, లయన్స్ సీనియర్ సభ్యులు రామారావు, ఎం.వెంటకరత్నం, 5 గ్యారెంటీల జిల్లా అమలు సమితి అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, హులిహైదర్ జెడీఎస్ నాయకుడు రమేశ్ నాయక్, ఆర్.వి.సత్యనారాయణ, కల్గుడి ప్రసాద్ వట్టికూటి, ముస్టూరు చిన్నా, సాంబమూర్తి, శ్రీరామనగర్ సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ ఫెస్ట్ విజయవంతం

హుబ్లీ: కేఎల్ఈ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అండ్ రీసర్చ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్- 2024 శుక్రవారం విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హెస్కాం జనరల్ మేనేజర్ డాక్టర్ సిద్దు ఉల్లోలి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. లక్ష్యం లేని శ్రమ కాలహరణం, లక్ష్యంతో కూడిన శ్రమ విజయానికి సోపానం అని ఆయన విద్యార్థులకు హితవు చెప్పారు. సంస్థ డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఓటమి గెలుపునకు మెట్టు అని, అందువల్ల గెలుపు ఓటమిపై చింతించకుండా పాల్గొనాలని విద్యార్థులు సలహా ఇచ్చారు. కుమార్ మోటర్స్ సేల్స్ విభాగం హుబ్లీ ముఖ్యస్తులు యశ్వంత్ షాన్‌బాగ్, డాక్టర్ అమిత్ అంగడి, ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ శెట్టి, విద్యార్థి శాంభవి తదితరులు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తూ ప్రైవేట్ క్లినిక్‌ల మూత



మూతపడిన దుకాణాలు, క్లినిక్‌లు

రాయచూరు రూరల్: వారం రోజుల క్రితం నగరంలోని ఆజాద్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రోగి మరణించడంతో ఆయన తరపున బంధువులు ఆస్పత్రి వైద్యుడిపై దాడి చేసిన సంగతి విదితమే. దాడిని నిరసిస్తూ నగర వ్యాప్తంగా సుమారు వంద ప్రైవేట్ ఆస్పత్రులు, 250 మందుల దుకాణాలు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడింది. రోజు 500 మంది రోగులు వస్తుండగా నేడు 1000 మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందారు.

అధిక లాభాలు ఇస్తామని వంచన

మైసూరు : రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.4వేలు వడ్డీ ఇస్తామని చెప్పి వంచించిన ఘటన బృందావన లేఔట్‌లో చోటుచేసుకుంది. చెసకుంది. ఇక్కడ నివాసం ఉంటున్న మంజునాథ్‌కు ప్రైవేటు ఫైనాన్స్‌కు చెందిన డైరెక్టర్ సునిల్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే నెలకు రూ.4వేలు చొప్పున 24 నెలలపాటు ఇస్తామని నమ్మించాడు. దీంతో మంజునాథ్ రూ.3లక్షలు ఇచ్చాడు. అనంతరం సునీల్ కనిపించకుండా పోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అవినీతిపై కదం తొక్కిన బీజేపీ

- కీలక సూత్రధారి ఎవరో తేల్చాలని ఒత్తిడి
- కాంగ్రెస్ సర్కార్‌పై కమలనాథులు నిప్పులు
- సీబీఐ దర్యాప్తుకు అప్పగించాలని డిమాండ్
- శ్రీరాములు ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ



బళ్లారిలో చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న నాయకులు



బళ్లారిలో అండర్‌బ్రిడ్జి గుండా సాగిన కార్యకర్తల ర్యాలీ

సాక్షి,బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో చోటు చేసుకున్న రూ.187 కోట్ల అవినీతిలో కింగ్‌పిన్ ఎవరో తేల్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ కేసులో నిజాలు పూర్తిగా బయటకు రావడం లేదని, సిట్ అధికారుల దర్యాప్తుతో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేవన్నారు. నగరంలోని కనక దుర్గమ్మ ఆలయం నుంచి బీజేపీ కార్యకర్తలు, నేతలు ప్లకార్డులు పట్టుకుని జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీజేపీ కార్యకర్తలతో నగరం కాషాయమయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రాన్ని లూటీ చేస్తోందని ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున జనం చేరడంతో పోలీసు బలగాలను మోహరించి జిల్లాధికారి కార్యాలయం వద్ద బ్యారికేడ్లను ఏర్పాటు చేసి నేతలను, కార్యకర్తలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

సీఎం రాజీనామా చేయాలి–శ్రీరాములు

అనంతరం మాజీ మంత్రి శ్రీరాములు మాట్లాడుతూ వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతికి నైతిక బాధ్యత వహించి సీఎం సిద్దరామయ్య తన పదవికి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి నాగేంద్ర రాజీనామాతోనే సరిపోదని పెద్ద చేపలు అందరూ కూడా బయట పడాలన్నారు. పేదల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను అప్పనంగా కాజేయడం కంచే చేను మేసిన చందంగా ఉందని మండిపడ్డారు. సిట్ ద్వారా ఈ కేసులో పురోగతి లేదని, సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలన్నారు. సీఎం రాజీనామా చేయకపోతే దశల వారీగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్పొరేటర్లు గోవిందరాజులు, శ్రీనివాస్ మోత్కూరు, హనుమంతు, సురేఖ, బీజేపీ నాయకులు హెచ్.హనుమంతప్ప, గురులింగనగౌడ, మహిపాల్, మాజీ బుడా అధ్యక్షుడు పాలన్న తదితరులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం రాత్రి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అక్కడే కలెక్టరేట్ ఆవరణలోనే అహోరాత్రి ధర్నా కొనసాగించారు.

రాయచూరులో..

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అధికారులు ఆత్మహత్యలు చేసుకోవడానికి ప్రజాప్రతినిధులే కారణమని, మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అవినీతికి బాధ్యత వహించి గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ రాజీనామా చేయాలని బీజేపీ జిల్లాధ్యక్షుడు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం టిప్పు సుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనలో మాట్లాడారు. అవినీతిపై సీబీఐతో సమగ్ర విచారణ జరపాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.



రాయచూరులో ఆందోళన చేస్తున్న నేతలు

చిక్కలో బీజేపీ ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

చిక్కబళ్లాపురం: రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ. 187 కోట్ల నగదు దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట బీజేపీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం సిద్దరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడీసీ తిప్పేస్వామికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో బీజేపీ నాయకులు మురళీధర్, మధుసూదన్, ఆనంద్‌గౌడ, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు స్నాచర్ల అరెస్ట్





కృష్ణరాజపురం : చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని తలగట్టపుర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఆయూబ్ పాష, మోహిబ్ ఖాన్‌లుగా గుర్తించారు. వీరిద్దరు గత శనివారం అంజనాపుర లాల్ బహదూర్‌శాస్త్రి నగరంలో బైక్‌పై తిరుగుతు స్నాచింగ్‌లు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 80 వేల విలువైన బంగారు చైన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

దొంగ అరెస్ట్



కృష్ణరాజపురం: వాహనాలను అపహరిస్తున్న దొంగను వీవీ పురం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు అభిషేక్ చోరీలకు అలవాటు పడ్డాడు. పలు కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. జైలు నుంచి వచ్చి మళ్లీ చోరీలకు పాల్పడ్డాడు. పోలీసులు ఇతని వద్ద నుంచి రూ. 18 లక్షల విలువైన టెంపో, మూడు ఆటోలు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

అభిమానులూ జైలు వద్దకు రావొద్దు

- దర్శన్ విజ్ఞప్తి

దొడ్డబళ్లాపురం: తనను కలవడానికి పరప్పన అగ్రహార జైలు వద్దకు ఎవరూ రావద్దని దర్శన్ అభిమానుల వద్ద మనవి చేసుకున్నారు. జైలు అధికారుల ద్వారా దర్శన్ ఇలాంటి సందేశం అందించారు. నిబంధనల ప్రకారం తనను కలవడం అంత ఈజీ కాదని, దయచేసి దూర ప్రాంతాల నుండి వచ్చే అభిమానులు జైలు వద్దకు రావద్దని వేడుకున్నారు. గురువారం దివ్యాంగురాలు సౌమ్య పరప్పన అగ్రహార ముందు దర్శన్‌ను కలవాలని హైడ్రామా చేసిన సంగతి తెలుసుకున్న దర్శన్ బాధపడ్డారు. ఈ నేపథ్యంలో అభిమానులకు విజ్ఞప్తి చేశారు. రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్ వారం రోజులుగా జైలులో ఉన్నారు.

దర్శన్ సహృదయుడు : నటుడు నాగశౌర్య ఎమోషనల్ పోస్ట్

రేణుకాస్వామి హత్య కేసులో జైలుపాలైన దర్శన్‌కు సంబంధించి పలువురు సెలబ్రిటీలు పలు రకాలుగా అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. కొందరు దర్శన్ చేసిన పనిని ఖండిస్తుంటే మరి కొందరు సమర్థిస్తున్నారు. దర్శన్ మంచివాడని, ఆయన ఈ హత్య చేసి ఉండడని వెనకేసుకొస్తున్నారు. ఇలా ఉండగా తెలుగు నటుడు నాగశౌర్య దర్శన్‌ను సమర్థిస్తూ పోస్టు చేసారు. దర్శన్ ఇలాంటి హత్య చేసి ఉండరని, ఆయన సహృదయుడని కొనియాడారు. అదేవిధంగా రేణుకాస్వామి హత్య జరగకుండా ఉండాల్సిందని, ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కోర్టులో తీర్పు వచ్చే వరకూ దర్శన్‌పై నిందలు వేయడం మానుకోవాలని సూచించారు. దర్శన్‌ను ఈ కేసులో ఇరికించారనిపిస్తోందన్నారు.

నిర్మాతకు వడ్డీ వ్యాపారుల వేధింపులు

బనశంకరి: తనను వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ నిర్మాత పుష్కర్ మల్లికార్జునయ్య సీసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీసీబీ పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. కొన్ని సినిమాలు ఆశించిన మేర విజయం సాధించకపోవడం, కోవిడ్ సమయంలో నష్టాలు అనుభవించిన పుష్కర్ మల్లికార్జునయ్య 2019 నుంచి 2023 వరకు బంధువు ఆదర్శ్ డీ.బీ. అనే వ్యక్తి నుంచి దశలవారీగా రూ.5 కోట్ల రుణం తీసుకున్నాడు. ప్రతినెల 5 శాతం వడ్డీ డబ్బు నగదు రూపంలో ఇచ్చాడు. రూ.5 కోట్లు అసలు, వడ్డీ సమేతంగా ఇప్పటి వరకు మొత్తం రూ.11.50 కోట్లు చెల్లించాడు. అయితే చెల్లించిన డబ్బు కేవలం వడ్డీ, చక్రవడ్డీకి సరిపోతుంది, ఇంకా రూ.13 కోట్లు ఇవ్వాలని ఆదర్శ్ డిమాండ్ చేశాడు. అంతేగాక ఆదర్శ్, హర్ష, శివు, హర్ష మరికొంత మంది అనుచరులతో కలిసి తన ఇళ్లు, కార్యాలయానికి వచ్చి అసభ్య పదజాలంతో దూషించి బెదిరింపులకు పాల్పడ్డారని పుష్కర్ ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం సీసీబీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కిశోర్‌కుమార్‌కు నిర్మాత పుష్కర్ ఫిర్యాదు చేశారు.

మండ్యలో ఉద్యమించిన బీజేపీ

మండ్య : వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల నిధులు స్వాహా చేసిన ఘటనలో అక్రమార్కులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మండ్యలో శుక్రవారం ఉద్యమించారు. ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని ధర్నా నిర్వహించారు. సీఎం సిద్దరామయ్య, మంత్రి శరణప్రకాశ్ పాటిల్, కార్పొరేషన్ అధ్యక్షుడు బసవనగౌడ దద్దల్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

మైసూరు : వాల్మీకి మండలి కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ సీఎం సిద్దరామయ్యతో పాటు మంత్రి, కార్పొరేషన్ అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మైసూరులోని కలెక్టరేట్ వద్ద బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంకు వ్యతిరేకగా ధర్నా నిర్వహించారు. కాగా పోలీసులు ఆందోళనకారును అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు.

నీట్ అక్రమాలపై సీబీఐతో దర్యాప్తు సరైన నిర్ణయం

- మాజీ ప్రధాని దేవెగౌడ

శివాజీనగర: నీట్ ప్రశ్న పత్రం లీకేజ్ కేసును కేంద్రప్రభుత్వం సీబీఐకి అప్పగించడం సరైన చర్య అని మాజీ ప్రధాని హెచ్.డీ.దేవెగౌడ అన్నారు. రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ వైద్యవిద్య ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందికి గురయ్యారన్నారు. తాను ఏ పార్టీ పేరును ప్రస్తావించనని, ఈ కేసు తనిఖీని సీబీఐ తనిఖీకి అప్పగించడంలో కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుందన్నారు. కాగా నీట్ అక్రమాలపై చర్చ సందర్భంగా రాజ్యసభలో గందరగోళం నెలకొనగా సభ సక్రమంగా జరిగేందుకు అవకాశం కల్పించాలని ప్రతిపక్ష పార్టీలకు విన్నవించారు.

ఉప విభాగాధికారిణికి స్వాగతం



నూతన ఉప విభాగాధికారిణిని స్వాగతిస్తున్న అధికారులు

కోలారు: జిల్లా నూతన ఉప విభాగాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ హెచ్‌పీఎస్ మైత్రిని శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారులు ఆమె కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపి స్వాగతించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జి.సురేష్‌బాబు, సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, రాష్ట్ర పరిషత్ సభ్యుడు గౌతం, కార్యాధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడు రవిచంద్ర, వివిధ తాలూకాలకు చెందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉన్నారు.

డెంగీని నియంత్రించండి



నీటి సంప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

బనశంకరి: బెంగళూరు నగరంలో సమగ్ర మైక్రో ప్లాన్ ప్రకారం డెంగీ కేసులు నియంత్రించాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ అధికారులకు సూచించారు. బీబీఎంపీ పరిధిలో డెంగీ నియంత్రించే దృష్టితో వలయాల వారీగా డ్రైడే కార్యక్రమంలో శుక్రవారం తూర్పు వలయం సీవీ.రామన్‌నగరలోని జీఎం.పాళ్య, న్యూ తిప్పసంద్ర పరిధిలో ఇంటింటిని సందర్శించి ప్రజలను జాగృతం చేసే కార్యక్రమంలో బీబీఎంపీ కమిషనర్ పాల్గొని మాట్లాడారు. ఇంటింటిని సందర్శించి ఈడీస్ అనే దోమ నుంచి డెంగీ ప్రబలుతుందని, దీంతో నీటి సంపులు, డ్రమ్ములు, కొళాయిలు, పూలకుండీలు ఇతర చోట్ల పరిశీలించి వారానికి ఒకసారి నీటిని బయట పారబోయాలని తెలిపారు. వారం కంటే ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచితే లార్వా ఉత్పత్తి అయి దోమలుగా వృద్ధి చెందుతాయన్నారు. బీబీఎంపీ ప్రధాన ఆరోగ్యాధికారి డాక్టర్ సైయద్‌సిరాజుద్దీన్‌మదని, వలయ ఆరోగ్యాధికారిణి డాక్టర్ భాగ్యలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



బొమ్మనహళ్లి: విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతి కార్యక్రమాల్లో కూడా రాణించాలని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని హెచ్ఎస్ఆర్ లేఔట్ 2వ సెక్టారులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలను ప్రారంభించి మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. అంతకు ముందు స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడుతూ...విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ఆర్ లేఔట్ మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, సమాజ సేవకుడు ఎ.ఎం. నరసింహమూర్తి, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

బొమ్మనహళ్లి : రోజుకొక మొక్క నాటాలి అనే కార్యక్రమంలో భాగంగా ఆనేకల్ పట్టణంలో కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం బెస్కాం కారాయలయం ఆవరణలో మొక్కలు నాటారు. కన్నడ సాహిత్య పరిషత్ ఆనేకల్ అధ్యక్షుడు అదూరు ప్రకాశ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్క నాటాలన్నారు. జయదేవ్, మధు, ఎస్.మూర్తి సుధా నిరంజన్ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

వైభవంగా ఆలయాల ప్రారంభోత్సవం



ప్రత్యేక అలంకరణలో నూతన విగ్రహాలు

మాలూరు : తాలూకాలోని మాస్తి ఫిర్కా రాజేనహళ్లి గ్రామంలో భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన యోగినారాయణస్వామి, అమరనారేయణస్వామి, నవగ్రహ సమేత నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠాపనను శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలను నెరవేర్చారు. నూతన విగ్రహాలకు విశేష పూలతో అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ జరిగింది.

కట్టడ కార్మికుల ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు : రాష్ట్ర వ్యాప్తంగా తమ సమస్యలను పరిష్కరించాలని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కట్టడ కార్మికుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కట్టడ కార్మికులు ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ కట్టడ కార్మికులకు న్యాయసమ్మతంగా లభించాల్సిన సౌకర్యాలు లభించడం లేదన్నారు. కట్టడ కార్మికులకు విద్యా, వివాహ, వైద్య సహాయ ధనం అందడం లేదని ఆరోపించారు. వైద్య పరీక్షల పౌష్టికాంశ కిట్ల కొనుగోలులో భారీ అక్రమాలపై దర్యాప్తు జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో వివిధ సంఘాల ప్రముఖులు భీమరాజ్, విజయకృష్ణ, ప్రభాకర్, ఆశ, శివణ్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

9, 10వ తరగతుల ప్రారంభానికి వినతి



వినతిపత్రం సమర్పించిన రైతు సంఘం పదాధికారులు

కోలారు: నంగలి ప్రాథమికోన్నత పాఠశాలలో 9, 10వ తరగతులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు శుక్రవారం అంబేడ్కర్ ఫోటో సమేతంగా ముళబాగిలు బీఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి బీఈఓ ద్వారా విద్యాశాఖా మంత్రికి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సరిహద్దు ప్రాంతానికి దగ్గరలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఉత్తమ కట్టడాలు, నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నా పాఠశాలలో 8వ తరగతి వరకు మాత్రమే ఉండడం వల్ల ఉన్నత పాఠశాల విద్య కోసం విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఇదే పాఠశాలలో 9, 10 తరగతులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు, గ్రామానికి చెందిన నాగేష్, ఈకంబల్లి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు యలువళ్లి ప్రభాకర్, ఆనందరెడ్డి, రామకృష్ణప్ప, గోవిందప్ప, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు సహకరించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: జిల్లాలో డెంగీ వ్యాధిని నియంత్రణకు ప్రజలు సహకరించాలని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. శుక్రవారం తన కార్యాలయ సభాంగణంలో నిర్వహించిన డెంగీ జ్వరం నియంత్రణపై సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి శుక్రవారం ఈడిస్ దోమల నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభం అయినందున అన్ని చోట్ల నీరు నిల్వ ఉంటుందన్నారు. దీని వల్ల డెంగీతో పాటు చికెన్ గున్యా, మలేరియా, మెదడు వాపు వ్యాధి వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మనం నిత్యం ఉపయోగించే నీటి తొట్టెలను దోమలు వ్యాప్తి చెందకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. వారానికోసారి డ్రమ్ములను శుభ్రం చేసి డ్రైడేగా ఆచరించాలన్నారు. ఆరోగ్య శాఖ డెంగీ జ్వరం నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అంటువ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ రవి కుమార్, డీహెచ్ఓ డాక్టర్ జగదీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అవినీతిపై విపక్షాల ధర్నా



కలెక్టరేట్ ముందు పశువులతో సహా ధర్నా చేస్తున్న దృశ్యం



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు

కోలారు: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ఖండిస్తూ బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు శుక్రవారం నగరంలోని జిల్లాధికారి కార్యాలయం ముందు పశువులతో సహా భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. శాసనసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్. అశోక్ నేతృత్వంలో బీజేపీ, జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు ఉదయం నగరంలోని ప్రభుత్వ అతిథిగృహం నుంచి బృహత్ ర్యాలీగా బయలుదేరి వెళ్లి కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ కేసును సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యేలు వర్తూరు ప్రకాష్, వై సంపంగి, మాజీ ఎంపీ ఎస్.మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల్ని పరిష్కరిస్తాం



ఎమ్మెల్సీ డీటీ శ్రీనివాస్‌ను సత్కరించిన దృశ్యం

కోలారు: ఉపాధ్యాయ సమస్యలన్నింటిని దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ డీటీ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి నూతనంగా ఎన్నికైన ఆయనను శ్రీనివాసపురం ఉపాధ్యాయ బృందం సభ్యులు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ 7వ వేతన సంఘం కమిషన్ నివేదిక అమలులోకి తెస్తామన్నారు. ఎన్‌పీఎస్ రద్దు గురించి ఎన్నికల ప్రణాళికలోనే చెప్పామన్నారు. దీనిని అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జేటీసీ సమస్యలు, ఉపాధ్యాయుల వేతన తారతమ్యం, పదోన్నతి, అన్ ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల సేవా భద్రత తదితర అనేక సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శ్రీకారం



సహకార భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పీ రవికుమార్

మండ్య: మండ్య తాలూకా హోడాఘట్ట గ్రామంలో పలు అభివృద్ధి పనులతోపాటు గ్రామీణ కృషి సహకార సంఘం భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పీ. రవికుమార్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులనుంచి రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘం అభివృద్ధి చెంది రైతులకు ఉపయోగ పడాలన్నది తన అభిమతమన్నారు.

హావేరి ప్రమాదంపై రాష్ట్రపతి సంతాపం

దొడ్డబళ్లాపురం: కర్ణాటకలోని హావేరి వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో 13 మంది మృతి చెందడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేసిన వారు ప్రమాదంలో మహిళలు, చిన్నారులతో పాటు 13 మంది మృతి చెందడం కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

గౌరిబిదనూరు: మూడు రోజుల క్రితం అదృశ్యమైన మహిళ శవంగా కనిపించిన ఘటన మంచేనహళ్లి పరిధిలోని చోటుచేసుకుంది. బీరమంగలకు చెందిన నరసమ్మ (57) కనిపించలేదని ఆమె మేనల్లుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం బీరమంగల సమీపంలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మూర్తి ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి



కెంపేగౌడ చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న తహసీల్దారు మహేశ్ పత్రి తదితరులు

గౌరిబిదనూరు: తాలూకా కార్యాలయంలో గురువారం బెంగళూరు నగర నిర్మాత నాడ ప్రభు కెంపేగౌడ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహసీల్దార్ మహేశ్ పత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. కెంపేగౌడ చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కెంపేగౌడ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు జనార్ధన మూర్తి మాట్లాడుతూ త్వరలో కెంపేగౌడ జయంతిని సముదాయానికి చెందిన పెద్దలతో వైభవంగా జరపడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాలూకా విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ట్రెండ్ సెట్ చేస్తున్న దర్శన్ ఖైదీ నంబర్



వాహనాలపై అభిమానులు వేయించుకున్న స్టిక్కర్‌లు

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో పరప్పన అగ్రహార జైలుపాలైన దర్శన్‌కు జైలు అధికారులు ఇచ్చిన ఖైదీ నంబర్ ప్రస్తుతం ట్రెండ్ సెట్ చేస్తోంది. అభిమానులు ఖైదీ నంబర్‌ను వాహనాలపై స్టిక్కర్‌గా వేయించుకుని అభిమానాన్ని చాటుకుంటున్నారు. దర్శన్‌కు ఇచ్చిన 6106 నంబర్ స్టిక్కర్ కోసం స్టిక్కర్ దుకాణాల ముందు అభిమానులు క్యూ కడుతున్నారు. ఆటోలు, బైక్‌లు, కార్లపై స్టిక్కర్‌లు వేయించుకుని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖైదీ నంబర్ స్టిక్కర్ వేయించుకున్న అభిమానులు తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

డ్రైడే పాటిస్తే వ్యాధులు దూరం




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం : దోమకాటును నివారించడంలో భాగంగా డ్రైడే పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మహదేవపుర ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వరయ్య అన్నారు. శుక్రవారం మహదేవపుర విభాగం, నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యాధికారులు, బీబీఎంపీ ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగీ జ్వరాలకు కారణమయ్యే ఈడిస్ దోమల ఉత్పత్తిని నాశనం చేసేందుకు వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. టైర్లు, పూలకుండీలు, డ్రమ్ముల్లో నీరు ఎక్కువ కాలం ఉండకుండా చూసుకోవాలన్నారు.

సాంస్కృతిక నగరి ధార్వాడ



చంద్రమౌళేశ్వర ఆలయం



కవులు, వంటకాలకు ధార్వాడ ప్రసిద్ధి



భవానీశంకర ఆలయం

- చారిత్రక ఆలయాలు, స్మారక చిహ్నాలకు ప్రసిద్ధి

బనశంకరి: కర్ణాటక రాష్ట్రంలో ధార్వాడ జిల్లా కర్ణాటక రాష్ట్ర సాంస్కృతిక కేంద్రంగా ఉంది. ధార్వాడ జిల్లా ధార్వాడ పేడాకు (పాలతో చేసే స్వీటు) ప్రసిద్ధి. ధార్వాడకు బెంగళూరుకు వాయువ్యంగా 425 కిలోమీటర్లు దూరంలో పూణేకు దక్షిణంగా 421 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది బెంగళూరు-పూణే మార్గంలో రహదారికి దగ్గరగా ఉంది. జిల్లాలో నార్త్ యూనిట్ ఆఫ్ నేషనల్ ప్రాజెక్ట్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం కూడా ఉంది. ధార్వాడ అంటే విడిది స్వల్పకాల విశ్రాంత ప్రదేశం అని అర్థం. కొన్ని శతాబ్దాల పాటు ధార్వాడ మలెనాడు భూభాగం, మైదాన భూభాగాల మధ్య ప్రయాణించే యాత్రికులు ఇక్కడ కొంతకాలం విశ్రమించేవారు. సంస్కృత పదం ద్వారావత పదం నుండి ధార్వాడ అనే పదం వచ్చింది. ద్వారా అంటే తలుపు వాడ అంటే పట్టణం. ధార్వాడ జిల్లాలో పలు పర్యాటక ఆకర్షణలు ఉన్నాయి. చారిత్రక ఆలయాలు స్మారక చిహ్నాలు ఉన్నాయి.

ధార్వాడ

అమ్మింభవి ధార్వాడ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ 24 తీర్థంకరబసది. హిరెమాతా గుహాలయం కలదు. ఆలయంలో కిత్తూరు నుంచి వచ్చిన కొయ్య పలకం మీద చిత్రించిన చిత్రం కూడా ఉంది.

హుబ్లీ

ఉంకల్ వద్ద ప్రముఖ చంద్రమౌళేశ్వరాలయం ఉంది. ఇది పశ్చిమ చాళుక్యుల కాలం నాటిదని భావిస్తారు. ఆలయ సమీపంలో ఉంకల్ సరస్సు కలదు. ధార్వాడ జిల్లాలో అందమైన సరస్సుల్లో చంద్రమౌళీశ్వరాలయం ఒకటి.

ఉంకల్ సరస్సు

ఉంకల్ సరస్సు హుబ్లీ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అందమైన పూదోటలు, పిల్లల వినోద సౌకర్యాలు, బోటింగ్ సౌకర్యం తదితర ఆకర్షణలతో కూడిన విహార కేంద్రం.

భవానీ శంకర ఆలయం

చాళుక్యులు నిర్మించిన భవానీశంకర ఆలయంలో ప్రధాన దైవం నారాయణుడు.

అసర్

1616లో దీనిని మహమ్మద్ అలీషాహ్. దీనిని కోర్టు హాలుగా ఉపయోగించడానికి నిర్మించాడు. ఈ హాలుకు ప్రవక్త అనుయాయులు బసచేయడానికి ఉపయోగిస్తారు. ఇందులో స్త్రీలకు అనుమతి లేదు.

నృపతుంగ హాల్

ఇది చిన్న కొండమీద ఉంది. కొండమీద నుంచి హుబ్లీ నగరం సుందరంగా కనిపిస్తుంది. ఇక్కడి నుంచి హుబ్లీ నగరంలోని అమరగోలి, విమానాశ్రయం వరకు కనిపిస్తుంది. వాకింగ్ చేసేవారికి అనువైన ప్రదేశం.

సిద్ధారూఢమఠం

ఇది ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఇది స్వామి సిద్ధారూఢ అద్వైతసిద్ధాంత ప్రవచన కేంద్రం. ఇది హుబ్లీ శివారులో ఉంది.

గ్లాస్‌హౌస్

అద్దాల మండపాన్ని ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రారంభించారు.

అన్నిగెరి


అన్నిగెరి వద్ద కళ్యాణి చాళుక్యుల కాలంనాటి అమరేశ్వర ఆలయం ఉంది. చారిత్రక ఆలయాలు ఉన్నాయి. హుబ్లీ నుంచి కిలోమీటరు దూరంలో కలదు. ఇది హుబ్లీకి 30 కిలోమీటర్లు దూరంలో హుబ్లీ-గదగ్ మార్గంలో ఉంది.

కుందోగి

హుబ్లీ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో హుబ్లీ-ధార్వాడ మార్గంలో కలదు. ఇక్కడ శంభులింగ ఆలయం ఉంది. ఇది కర్ణాటక రాష్ట్రంలో హిందూస్తానీ సంగీతానికి కేంద్రం కాగా హిందూస్తానీ సంగీతానికి విశ్వవిద్యాలయం లాంటిది. సవాయి గంధర్వ జన్మస్థలం. సవాయి గంధర్వ పండిట్ భీమ్ సేన్‌జోషి, గంగూబాయ్‌హంగల్ హిందూస్తానీ సంగీతం అధ్యయనం చేశారు.

కల్ఘతగి

తంబూర్-కల్ఘతగి నుంచి 8 కిలోమీటర్లు దూరంలో ఉంది. ఇక్కడ ప్రసిద్ధ బసవణ్ణ ఆలయం ఉంది. ఇక్కడ దేవకొప్ప అరణ్యం, కల్ఘతగికి 14 కిలోమీటర్లు దూరం ఉంది. మహాలక్ష్మి ఆలయం, శాంతినాథ ఆలయం, శాతినాథ బసదిజైన ఆలయం చూడదగ్గవి.



నృపతుంగా హాల్



సిద్ధరూఢ మఠం



ఉంకల్ చెరువులో బోటులో పర్యాటకుల సందడి

దర్శన్ విడుదల కావాలని పూజలు



పూజల అనంతరం మాట్లాడుతున్న అభిమానులు

మండ్య: హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నటుడు దర్శన్ జైలు నుంచి విడుదల కావాలని కోరుతూ అభిమానులు పూజలు చేశారు. దర్శన్ అభిమానుల సంఘం, అఖిల కర్ణాటక అంబరీష్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో మండ్యలోని కాళికాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంబరీష్ అభిమానుల సంఘం అధ్యక్షుడు బేలూరు సామశేఖర్ మాట్లాడుతూ దర్శన్‌పై కుట్ర జరిగిందని, ఎలాంటి మచ్చ లేకుండా బయటకు రావాలని పూజలు చేసినట్లు తెలిపారు. మంజునాథ్, నాగణ్ణ, దర్శన్, కిషన్, నితిన్, అభి, వివేక పాల్గొన్నారు.


ఇద్దరు వేటగాళ్లు అరెస్ట్

మైసూరు: వన్యజీవులను వేటడానికి వచ్చిన ఇద్దరిని అటవీ సిబ్బంది పట్టుకుని అరెస్ట్ చేసిన ఘటన చామరాజనగర జిల్లా హనూరులో చోటుచేసుకుంది. నిందితులను మరియమంగళ గ్రామానికి చెందిన మరియ లూయిస్ (40), విన్సెంట్ (54)గా గుర్తించారు. వీరిద్దరు నాటు తుపాకులు తీసుకుని అడవిలో వేటకు వచ్చారు. వేటాడుతున్న సమయంలో అటవీ సిబ్బంది పట్టుకున్నారు. ఈ క్రమంలో ఒక వేటగానికి పాము కాటు వేసింది. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు.

లింగాయత్‌లకు సీఎం పదవి ఇవ్వాలి

యశవంతపుర: రాష్ట్రంలో ముఖ్యమంత్రి మారితే లింగాయత్‌లను ముఖ్యమంత్రిని చేయాలని శ్రీశైల జగద్గురువులు చన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య స్వామీజీ కోరారు. గురువారం కెంపేగౌడ జయంతిలో డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఒక్కలిగ మహా సంస్థాన మఠం చంద్రశేఖర స్వామి సీఎం సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేసిన విషయం తెల్సిందే. శుక్రవారం ఆయన చిక్కోడి తాలూకా యడూరు గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ... సీఎం పదవితో పాటు డీసీఎం పదవులను పెంచి లింగాయత్‌లకు ప్రాధాన్యం కలిగించాలని డిమాండ్ చేశారు. ఎంబీ పాటీల్, ఈశ్వరఖండ్రె, ఎస్ఎస్ మల్లికార్జున, శామనూరు శివశంకరప్పలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణాలపై అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న ఎరువుల మూటలు

తుమకూరు: అక్రమంగా నిల్వ చేసి ఎరువుల విక్రయాలు సాగిస్తున్న దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు దాడులు చేశారు. నగరంలోని మధుగిరి రోడ్డులో ఉన్న ఓ దుకాణంపై దాడులు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మిక్స్‌డ్ ఎరువుల బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు ఉప విభాగం వ్యవసాయ డైరెక్టర్ డాక్టర్ అనిస్సెల్మా ఆధ్వర్యంలో దాడులు చేసి ఎరువుల మూటలను స్వాధీనం చేసుకున్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

మైసూరు: డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన చామరాజనగర జిల్లా కొళ్ళెగాలలో చోటు చేసుకుంది. తాలూకాలోని హొగ్గం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ (24) పట్టణంలోని మహదేశ్వర కళాశాల హాస్టల్లో ఉంటూ బీఏ చదువుతున్నాడు. ఈ క్రమంలో అతను విషం తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎలక్ట్రిక్ బైక్ ఇప్పిస్తామని వంచన

మైసూరు : ఆన్‌లైన్‌లో ఎలక్ట్రిక్ బైక్ తక్కువ ధరకే ఇప్పిస్తామని వంచనకు పాల్పడిన ఘటన మైసూరులో జరిగింది. కువెంపు నగర్‌కు చెందిన రాఘవేంద్ర అనే యువకుడు ఆన్‌లైన్‌లో బైక్‌ల సమాచారం కోసం గాలిస్తుండగా వంచకులు ఫోన్ చేశారు. లక్షా 20వేల విలువైన బైక్ రూ.50 వేలకే ఇప్పిస్తామని నమ్మించారు. ప్రీ బుకింగ్ కోసం రూ.1947 తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. బైక్ కోసం మరో రూ. 58,053 బదిలీ చేయించారు. అనంతరం మళ్లీ రూ.30 వేలు చెల్లించాలని చెప్పడంతో మోసం జరిగిందని గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి

దొడ్డబళ్లాపురం: కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి భోజనం చేస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన రామనగర కలెక్టర్ కార్యాలయంలో చోటుచేసుకుంది. చెన్నపట్టణకు చెందిన యోగేశ్ రామనగర కలెక్టరేట్‌లో డీ గ్రూప్ నౌకరుగా విధులు నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం విరామం సమయంలో కార్యాలయంలో భోజనం చేస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు.

ఆకట్టుకున్న గ్రీన్ వెహికల్స్ ఎక్స్‌పో



ఎలక్ట్రిక్ వాహనాలపై యువతులు

బనశంకరి: తుమకూరు రోడ్డు అంతర్జాతీయ వస్తు ప్రదర్శన కేంద్రంలో మూడురోజుల పాటు నిర్వహించే హసిరు వాహనాల ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. నరుకు రవాణా ఆటో, ద్విచక్రవాహనాలు, వైవిధ్య భరితమైనకార్లు, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వందకుపైగా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అంతకుముందు ప్రదర్శనను బెస్కాం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే.సాక్రటీస్, హైదరాబాద్ మీడియా మార్కెటింగ్ సంస్థ డైరెక్టర్ మహమ్మద్‌ముదస్సర్ ప్రారంభించారు. ఇంధన ధరలు పెరుగుతుండటంతో ప్రజలు ప్రత్యామ్నాయం వైపు మొగ్గ చూపుతున్నారని తెలిపారు.

కుటుంబ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న డాక్టర్ గీత

గౌరిబిదనూరు: మహిళలు కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని సాయిరాం ఆస్పత్రి వైద్యురాలు డాక్టర గీత తెలిపారు.శుక్రవారం నగరంలోని మరిగమ్మ, సోల్లాపురమ్మ దేవాలయం ఆవరణంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ, సాయిరాం ఆస్పత్రి సహకారంతో జరిగిన ఆరోగ్య పరీక్షా శిబిరంలో మాట్లాడారు. పలువురికి థైరాయిడ్, మధుమేహం, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. జ్ఞానవికాస కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జనజాగృతి వేదిక సభ్యురాలు లక్ష్మీ, తాలూకా ప్రాజెక్ట్ అధికారి నాగరాజ నాయక్, సమీర్, జ్ఞానవికాస సమన్వయాధికారి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

తుమకూరులో బీజేపీ, జేడీఎస్ ధర్నా



తుమకూరు: వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు చెందిన సుమారు రూ. 187 కోట్లు గోల్‌మాల్ జరగడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం తుమకూరు నగరంలో ఎస్టీ మోర్చ ఆధ్వర్యంలో బీజేపీ, జేడీఎస్ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని జిల్లా అధికారి ద్వారా గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే జ్యోతి గణేశ్ మాట్లాడుతూ...వాల్మీకి కార్పొరేషన్‌కు చెందిన నిధులు గ్యారెంటీ పథకాలకు వినియోగించి దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వెంటనే సీఎం సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని కార్యకర్తలు, నాయ

బస్సు నడుపుతుండగా ఫిట్స్..



డ్రైనేజీలోకి దిగిన బస్సు

యశవంతపుర: బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు మూర్ఛ వచ్చింది. దీంతో ఆ సమయంలోనూ అతను ప్రయాణికులు భద్రతను మరిచిపోలేదు. అంత బాధలోను బస్సును చాకచక్యంగా నిలిపాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం ఉడుపి సమీపంలో జరిగింది. వివరాలు... ఓ ప్రైవేట్ బస్సు ఉడుపి నుంచి బైరంజెకు వెళ్తుండగా డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చాయి. వాహనం వేగాన్ని తగ్గించి అక్కడి సమీపంలోని డ్రైనేజీలోకి దించాడు. ఆందోళనకు గురైన ప్రయాణికులు బస్సు నుంచి బయటకు దూకేశారు. అస్వస్థతకు గురైన డ్రైవర్‌ను మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కారు దగ్ధం

ఉడుపిలో గురువారం రాత్రిఓ కారు కాలి బూడిదైంది. ఈ ఘటన మణిపాల్ బబ్బుస్వామి దేవస్థానం వద్ద జరిగింది. రోడ్డు పక్కలో నిలిపిన కారు బానెట్‌లో మంటలు వ్యాపించి కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

దరఖాస్తుల స్వీకరణ



గ్రామసభలో మాట్లాడుతున్న యూనియన్ చైర్మన్ కేశవమూర్తి

కెలమంగలం: కెలమంగలం సమితి ఉడేదుర్గం పంచాయతీ యూ.పురం, మెట్రి పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామసభ సమావేశాల్లో యూనియన్ చైర్మన్ కేశవమూర్తి ఇళ్ల నిర్మాణాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కరుణానిధి గృహవసతి పథకం ద్వారా పేదలకు ఇళ్ల నిర్మించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. అందులో భాగంగా ప్రత్యేక గ్రామసభ సమావేశాల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. గ్రామసభలో ఉడేదుర్గం పంచాయతీలో 37 మంది, మెట్రి పంచాయతీలో 50 దరఖాస్తులను స్వీకరించారు. పరిశీలించి అర్హులైన వారికి ఇళ్ల నిర్మాణల కోసం అనుమతి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్కీం బీడీవో శాంతి, ఉడేదుర్గం ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి మునిరాజ్, మెట్రి పంచాయతీ అధ్యక్షులు యశోధమ్మ సంపంగి తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా కోటమారియమ్మ కుంభాభిషేకోత్సవం



విశేష అలంకరణలో అమ్మవారు



ఆలయంలో అన్నదానం

హోసూరు: హోసూరు పట్టణలోని రామ్‌నగర్‌లో వెలసిన ప్రసన్న స్వయంభు కోటమారియమ్మ ఆలయ ద్వితీయ వార్షిక కుంభాభిషేకోత్సవం శుక్రవారం విశేషంగా జరిగింది. రామ్‌నగర్‌లో వెలసిన కోటమారియమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రెండేళ్ల క్రితం ప్రస్తుత ఎంపీ కే. గోపీనాథ్‌చే పునరుద్దరణ గావించి మహా కుంభాభిషేకోత్సవాన్ని జరిపించారు. ఆలయ పారంపర్య ధర్మకర్మ గోపీనాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శ్రీధర్ నేతృత్వం వహించారు. పారంపర్య అర్చకులు నేతృత్వం వహించారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం, ఆరాధన, వివిధ హోమాలు జరిపించారు. శుక్రవారం వేకువ జాము నుంచి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు, 9 గంటల నుంచి 10 గంటల వరకు మహా కుంభాభిషేకం నిర్వహించారు. వేలాది మందికి అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

అంచెట్టిని యూనియన్ కేంద్రంగా మార్చాలి



సమస్యలను వివరిస్తున్న కౌన్సిలర్లు

కెలమంగలం: తాలూకా కేంద్రం స్థాయికి పెంచిన అంచెట్టిని యూనియన్ కేంద్రంగా తీర్చిదిద్దాలని శుక్రవారం తళి బీడీవో కార్యాలయంలో జరిగిన యూనియన్ కమిటీ సమావేశంలో తీర్మానించారు. యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీడీవో అధికారులు, యూనియన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ... కొద్ది సంవత్సరాల క్రితం డెంకణీకోట తాలూకాను రెండుగా విభజించి అంచెట్టిని తాలూకా కేంద్రంగా ఏర్పాటు చేశారు. అయితే బీడీవో కార్యాలయం తళిలోనే ఉండడంతో అంచెట్టి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం తళికి వెళ్లవలసి ఉంది. సకాలంలో సరైన బస్సు వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి అంచెట్టిని యూనియన్ కేంద్రంగా మార్చాలని, దీంతో పాటు దట్టమైన అటవీ ప్రాంతాలకు రోడ్డు వసతులు, బస్సు వసతులు కల్పించాలని, కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి హోసూరు ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటును ప్రకటించడం హర్షదాయకమని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యక్తి అరెస్ట్

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరిలో అనుమతి లేకుండా టపాకాయల దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... సూళగిరి పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ సయ్యద్‌బాషా నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సమయంలో విజిపి నగర్ ప్రాంతంలో టపాకాయల దుకాణంలో తనిఖీ చేయగా ఎటువంటి అనుమతి లేదని తేలింది. దీంతో నిర్వాహకుడు కామనదొడ్డికి చెందిన పృథ్వీరాజ్ (35)ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

రుణ ప్రణాళిక విడుదల

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 21988.30 కోట్ల రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ శరయు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నబార్డ్, ఇండియన్ బ్యాంక్ సంయుక్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళిక సిద్ధం చేసిందని, ప్రధానంగా వ్యవసాయాభివృద్ధికి 14794.37 కోట్లు, చిన్న, సన్నకారు పరిశ్రమల ఏర్పాటు కోసం రూ. 5496.67 కోట్లు, విద్యా రుణాలు రూ. 30.34 కోట్లు, ఇళ్ల నిర్మాణానికి రూ. 113.50 కోట్లు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఈ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పెరియస్వామి, కుమార్, తంగరాజ్, ప్రసన్న బాలమురుగన్, వేల్ మురుగన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి ఆత్మహత్య

కెలమంగలం: మద్యం మత్తులో ఇంటికెళ్లిన కొడుకును తల్లిదండ్రులు మందలించడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన తళి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. తళి సమీపంలోని గుడిసాధనపల్లి గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్ (24) కాయగూరల వ్యాపారి. ఇతనికి తాగుడు అలవాటుంది. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటికెళ్లిన కొడుకును తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక మృతి చెందాడు. తళి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

వేశ్యావాటికలపై దాడి

క్రిష్ణగిరి: క్రిష్ణగిరిలో పలు చోట్ల వ్యభిచార కేంద్రాలపై పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. వివరాలు...పట్టణంలో పలు చోట్ల వ్యభిచారం జరుగుతున్నట్లు పట్టణ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు పాతపేటలోని ఓ లాడ్జిలో ఆకస్మిక దాడి చేశారు. ఈ సమయంలో మధ్యవర్తి శరవణన్‌ను పట్టుకున్నారు. అదే విధంగా నేతాజీ రోడ్డులోని ఓ ఇంట్లో దాడి జరపగా 45 ఏళ్ల మహిళ పట్టుబడింది. రాయకోట రోడ్డులో వ్యభిచారం నిర్వహిస్తున్న 35 ఏళ్ల మహిళ పట్టుబడింది. వీరిని అరెస్ట్ చేసి పరారీలో ఉన్న శక్తి, అబ్దుల్ రహమ్మాన్‌ల కోసం గాలిస్తున్నారు.

ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులను నియంత్రించాలి

హోసూరు: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు కార్పొరేషన్‌లో యంత్రాంగం, వివిధ స్వచ్ఛంద సంస్థలచే పారిశుద్ధ నగరంగా తీర్చుదిద్దుతున్న తరుణంలో ప్రధాన ప్రాంతాల్లో ఇష్టానుసారంగా ఎటువంటి అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, ప్రకటనల బోర్డులను పెడుతున్నారని, దీనివల్ల నగర అందం దెబ్బతింటుందని సేవా కార్యకర్తలు చెబుతున్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా గోడలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నారని, ఈ నేపథ్యంలో కొంత మంది రోడ్ల పక్కన, పార్కులున్న ప్రాంతాల్లో ప్రకటన బోర్డులు అతికించడంతో నగరం అందం లోపిస్తుందన్నారు. వీటికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలని, కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి లక్షల టోకరా

హోసూరు: ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నా అమాయకుల్లో జాగృతి కనిపించడం లేదు. తాజాగా ఓ ఉపాధ్యాయుడికి సైబర్ కేటుగాళ్లు లక్షలు మోసం చేశారు. బాధితుడు క్రిష్ణగిరి పాతపేట ప్రాంతానికి చెందిన కుమార్. గతనెల 28న కుమార్ సెల్‌కు ఒక మెసేజ్ వచ్చింది. అందులో షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభం వస్తుందని సారాంశం. దీంతో వారిని సంప్రదించి వారు చెప్పిన విధంగా వివిధ బ్యాంకు ఖాతాలకు రూ. 20.85 లక్షలు జమ చేశాడు. అనంతరం అవుతలి వైపు నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన కుమార్ క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యూహాలు... ప్రతివ్యూహాలు...

ఆరంభంలో లెఫ్టార్మ్ పేసర్లను ఎదుర్కోవడంలో రోహిత్ ఇబ్బంది పడే బలహీనతను సొమ్ము చేసుకునేందుకు జాన్సెన్‌ను దక్షిణాఫ్రికా ఉపయోగించవచ్చు. ఫామ్‌లో లేని కోహ్లిపై రబాడ పైచేయి సాధించే ప్రయత్నం చేస్తాడు. డికాక్‌ను బుమ్రా నిలువరించగలిగితే భారత్‌కు ఆధిపత్యం ఖాయం. పంత్ జోరును ఆపేందుకు లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను వాడే అవకాశం ఉంది. మిడిలార్డర్‌లో అక్షర్, కుల్దీప్, జడేజాల స్పిన్‌ను క్లాసెన్, మిల్లర్‌లు ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే మ్యాచ్ గమనం ఆధారపడి ఉంది.



ఇద్దరికీ చివరి మ్యాచా?

భారత్ క్రికెట్‌కు సంబంధించి ఆల్‌టైమ్ గ్రేట్‌లుగా రోహిత్, కోహ్లిలది ప్రత్యేక స్థానం. గత 11 ఏళ్లుగా భారత్ ఓడిన ఐసీసీ ఫైనల్స్‌లో వీరిద్దరూ సభ్యులుగా ఉన్నారు. వన్డే వరల్డ్ కప్ చేజారాక టి20 వరల్డ్ కప్ విజయంతోనైనా ముగించాలనే పట్టుదలతో ఈ టోర్నీకి సిద్ధమయ్యారు. టెస్టు, వన్డేలను పక్కన పెడితే ఈ ఫార్మాట్‌లో కొత్త కుర్రాళ్లు దూసుకొచ్చేశారు. సత్తా చాటి తమదైన అవకాశం కోసం సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇంకా కొనసాగడం అనేది ఇద్దరికీ మేలు చేయకపోవచ్చు. కాబట్టి గెలిచినా, ఓడినా వీరికి ఇదే చివరి అంతర్జాతీయ టి20 మ్యాచ్ అయ్యే చాన్స్ ఉంది. రోహిత్ 2007 టి20 వరల్డ్ కప్ నెగ్గిన జట్టులో సభ్యుడు కాగా, కోహ్లి 2011 వన్డే వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ మెంబర్.

ఈసారి వదలొద్దు!

నేడు టి20 వరల్డ్ కప్ ఫైనల్

దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'

రెండో టైటిల్ వేటలో టీమిండియా

తొలి వరల్డ్ కప్ కోసం సఫారీలు

రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): టి20 క్రికెట్‌లో ప్రపంచ చాంపియన్‌ను తేల్చే సమయం ఆసన్నమైంది. 27 రోజులు, 54 మ్యాచ్‌ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తొమ్మిదో టి20 వరల్డ్ కప్ ఫైనల్ సమరానికి సర్వం సిద్ధమైంది. కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో నేడు జరిగే తుది పోరులో భారత్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. గతంలో భారత్ ఒకసారి ఈ టోర్నీని గెలుచుకోగా, దక్షిణాఫ్రికా ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. ఆఖరి సమరానికి ముందు ఇరు జట్లు టోర్నీలో ఓటమి లేకుండా అజేయంగా ఉన్నాయి. భారత్ తాము ఆడిన ఏడు మ్యాచ్‌లు, దక్షిణాఫ్రికా తాము ఆడిన ఎనిమిది మ్యాచ్‌లు గెలిచి సమరోత్సాహంతో ఫైనల్‌కు 'సై' అంటున్నాయి. ఎవరు విజయం సాధించినా... ఓటమి లేకుండా టైటిల్ అందుకున్న తొలి జట్టుగా నిలుస్తుంది. గతంలో జరిగిన డే అండ్ నైట్ ఫైనల్ మ్యాచ్‌లకు భిన్నంగా తొలిసారి టైటిల్ పోరు డే మ్యాచ్‌గా జరగనుండటం విశేషం.

మార్పుల్లేకుండా...

టీమిండియా ఈ టోర్నీలో ఆడిన 7 మ్యాచ్‌లలో 12 మంది బరిలోకి దిగారు. న్యూయార్క్ వేదికగా జరిగిన తొలి మూడు మ్యాచ్‌లలో పేసర్ సిరాజ్ ఆడగా, వెస్టిండీస్‌లో జరిగిన మ్యాచ్‌లలో అతని స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఆడాడు. ఇది మినహా మిగతా 10 మంది విషయంలో ఎలాంటి మార్పు జరగలేదు. ఇప్పుడు కూడా సెమీఫైనల్ ఆడిన టీమ్‌తోనే భారత్ తుది పోరుకు వెళ్లే అవకాశముంది. ఒక్క శివమ్ దూబే బ్యాటింగ్ విషయంలోనే కాస్త ఆందోళన కనిపించినా... మిడిలార్డర్‌లో అతనికి బదులు సంజూ సామ్సన్‌ను నేరుగా ఫైనల్లో ఆడించే సాహసం చేయకపోవచ్చు. రోహిత్ శర్మ బ్యాటింగ్ పదును ఏమిటో గత రెండు మ్యాచ్‌లలో కనిపించింది. అతను ఇదే జోరు సాగిస్తే ఆరంభంలోనే మ్యాచ్ భారత్ చేతుల్లోకి వచ్చేస్తుంది. కోహ్లి వరుసగా విఫలమైనా... రోహిత్ ఆశించినట్లుగా ఫైనల్లో అతని స్థాయి ప్రదర్శన కనబరిస్తే చాలు. సూర్యకుమార్ మెరుపు ఇన్నింగ్స్‌తో పాటు పంత్, పాండ్యాలు ధాటిగా ఆడితే జట్టుకు తిరుగుండదు. బౌలింగ్‌లో టీమిండియా మరింత బలంగా కనిపిస్తోంది. పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్‌లను సమర్థంగా ఎదుర్కోవడంలో ప్రత్యర్థి ఆటగాళ్లు విఫలమవుతుండగా... స్పిన్ త్రయం కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా చెలరేగితే సఫారీలు కుప్పకూలడం ఖాయం. ముఖ్యంగా కుల్దీప్ బౌలింగ్‌లో బ్యాటర్లు బాగా ఇబ్బంది పడగా, బుమ్రా ముందు అంతా తలవంచారు.

సమష్టితత్వంతో...


దక్షిణాఫ్రికా ఇద్దరు ప్రధాన పేసర్లు రబాడ, నోర్జే ఆరుకంటే తక్కువ ఎకానమీతో ప్రత్యర్థి వికెట్లను పడగొట్టారు. వీరు ఇన్నింగ్స్ ఆరంభంలో బ్యాటర్లను కట్టడి చేయగల సమర్థులు. జాన్సెన్ రూపంలో లెఫ్టార్మ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఆ జట్టులో ఉండటం అదనపు ప్రయోజనం. ఇద్దరు స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షమ్సీ కూడా అన్ని పిచ్‌లపై చెలరేగారు. అయితే పిచ్ పేస్‌కు అనుకూలంగా కనిపిస్తే ఒక స్పిన్నర్ స్థానంలో బార్ట్‌మన్‌ను తీసుకునే అవకాశం ఉంది. ఓపెనర్ డికాక్ బ్యాటింగ్‌కు మూలస్తంభంలా ఉండగా, మరో ఓపెనర్ హెన్‌డ్రిక్స్ చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. టోర్నీలో ఆకట్టుకోని కెప్టెన్ మార్క్‌రమ్ నుంచి ఒక మంచి ఇన్నింగ్స్ ఫైనల్లో రావాలని జట్టు ఆశిస్తోంది. మిడిలార్డర్‌లో క్లాసెన్, మిల్లర్‌లపైనే జట్టు ఆధారపడుతోంది. ఇప్పటి వరకు అంచనాలకు తగినట్లుగా ఆడకపోయినా స్టబ్స్ దూకుడుగా ఆడగలడు. విడిగా చూస్తే ఒక్కొక్కరి ప్రదర్శన గొప్పగా లేకపోయినా... జట్టుగా తాము ప్రభావం చూపగలమని టీమ్ విశ్వాసంతో ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), కోహ్లి, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), డికాక్, హెన్‌డ్రిక్స్, స్టబ్స్, క్లాసెన్, డేవిడ్ మిల్లర్, జాన్సెన్, కేశవ్ మహరాజ్, షమ్సీ, రబాడ, నోర్జే.

పిచ్, వాతావరణం



కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో తాజా ప్రపంచకప్‌లో 8 మ్యాచ్‌లు జరిగాయి. ఒక మ్యాచ్ రద్దు కాగా, మరో మ్యాచ్ స్కోర్లు సమమై 'సూపర్ ఓవర్' వరకు వెళ్లింది. మిగిలిన వాటిలో 3 సార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టు, 3 సార్లు ముందుగా బౌలింగ్ చేసిన జట్టు గెలిచాయి. కాబట్టి పిచ్ పెద్ద విషయం కాకపోవచ్చు. డే మ్యాచ్ కాబట్టి మంచు ప్రభావం ఉండదు. తీవ్ర ఒత్తిడి ఉండే మ్యాచ్ కాబట్టి టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు. భారత్ ఇప్పటికే ఈ పిచ్‌పై అఫ్గానిస్తాన్‌తో ఆడగా, దక్షిణాఫ్రికా ఇప్పటి వరకు ఆడలేదు. మ్యాచ్ రోజున వర్ష సూచన ఉంది. అయితే సెమీస్ తరహాలోనే అక్కడక్కడా అంతరాయాలు కలగవచ్చు కానీ పూర్తిగా మ్యాచ్‌కు ఇబ్బంది ఉండదు. మ్యాచ్‌ను శనివారమే పూర్తి చేసేందుకు నిర్ణీత సమయంకంటే అదనంగా మరో 190 నిమిషాల సమయం కేటాయించారు. ఫైనల్‌కు రిజర్వ్ డే కూడా ఉంది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లు పూర్తయితే శనివారమే ఫలితం తేల్చేస్తారు. అది కూడా సాధ్యం కాకపోతేనే ఎక్కడ ఆట ఆగిందో అక్కడి నుంచి రిజర్వ్ డే రోజు ఆట కొనసాగుతుంది. అదీ సాధ్యం కాకపోతే ఇరు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.



2013లో చాంపియన్స్ ట్రోఫీ విజేత... ఆ తర్వాత ఐదుసార్లు ఐసీసీ ఫైనల్ మ్యాచ్‌లు... అన్నింటా నిరాశే... 2014 టి20 వరల్డ్ కప్, 2017 చాంపియన్స్ ట్రోఫీ, 2021 టెస్టు చాంపియన్‌షిప్, 2023 టెస్టు చాంపియన్‌షిప్, 2023 వన్డే వరల్డ్ కప్... ఈ ఐదు సందర్భాల్లో బరిలో నిలిచిన భారత జట్టు సభ్యులకే కాదు... గెలుపును ఆశించిన అభిమానులకు కూడా తెలుసు ఆ వేదన ఎలాంటిదో! ముఖ్యంగా గత ఏడాది నవంబర్ 19న లక్ష మంది సొంత అభిమానుల సమక్షంలో ఆస్ట్రేలియా చేతిలో మన జట్టు ఓడిన క్షణాలు ఇంకా కళ్ల ముందే నిలిచాయి. వరుసగా 10 మ్యాచ్‌లలో విజయాల తర్వాత తుది మెట్టుపై రోహిత్ బృందం తడబడింది. ఇప్పుడు ఆ బాధను మరచి కాస్తంత ఉపశమనం పొందే అవకాశం వచ్చింది. 11 ఏళ్ల తర్వాత ఐసీసీ టైటిల్‌ను అందుకునే అరుదైన సందర్భం మళ్లీ టీమిండియా ముందు నిలిచింది. ఈసారి కూడా టోర్నీలో అజేయంగా భారత్ ఫైనల్ పోరుకు సిద్ధమైంది. ఆటగాళ్లంతా ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్‌గా వన్డే వరల్డ్ కప్‌లో చేజారిన ట్రోఫీని టి20ల్లో అందుకొని రోహిత్ శర్మ సగర్వంగా నిలుస్తాడా? తన అద్భుత కెరీర్‌లో లోటుగా ఉన్న టి20 ప్రపంచ కప్‌తో విరాట్ కోహ్లి సంబరాలు చేసుకుంటాడా ఈరోజు రాత్రికల్లా తేలిపోతుంది..!

మరోవైపు దక్షిణాఫ్రికా అన్ని అస్త్రాలతో సిద్ధంగా ఉంది. సఫారీ బృందం కూడా విజయం కోసం కసిగా, ఆకలిగా ఉంది... ఆ జట్టుకు కూడా వరల్డ్ కప్ టైటిల్ అనేది 32 ఏళ్ల కల... ఎప్పుడో 1998లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గెలిచినా ఆ లెక్క వేరు... మొత్తంగా ఐదుసార్లు వన్డే వరల్డ్ కప్‌లలో, రెండుసార్లు టి20 వరల్డ్ కప్‌లో సెమీ ఫైనల్ వరకు రాగలిగినా ఆ గండం దాటి ముందుకు వెళ్లలేకపోయింది. ఇప్పుడు మొదటిసారి ఫైనల్ వరకు వచ్చిన టీమ్ ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చేజార్చుకోరాదని పట్టుదలగా ఉంది. కీలక సమయాల్లో తడబడే 'చోకర్స్' ముద్రను చెరిపేసుకునే విధంగా సౌతాఫ్రికా టీమ్ చెలరేగింది. టోర్నీలో అక్కడక్కడా కాస్త ఇబ్బంది పడ్డా చివరకు ఫలితాన్ని తమవైపు మార్చుకొని వరుసగా ఎనిమిది విజయాలతో ఓటమి లేకుండా తుది పోరుకు అర్హత సాధించింది. అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లో ఏ ఒక్కరిపైనో ఆధారపడకుండా సమష్టి ప్రదర్శనతో టీమ్ దూసుకుపోతోంది. దశాబ్దం క్రితం అండర్–19 కెప్టెన్‌గా దక్షిణాఫ్రికాకు ఇప్పటి వరకు ఏకైక ప్రపంచకప్ ట్రోఫీని అందించిన మార్క్‌రమ్ గతంలో తమ దేశపు దిగ్గజాలకు సాధ్యం కాని ఘనతను నాయకుడిగా అందుకుంటాడా ఈరోజు రాత్రికల్లా తేలిపోతుంది...!

2 వన్డే, టి20 ఫార్మాట్‌లలో కేవలం రెండుసార్లు మాత్రమే రెండు జట్లు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా ఫైనల్‌కు చేరాయి. 1979 వన్డే వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్, వెస్టిండీస్ జట్లు... 2024 టి20 ప్రపంచకప్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఈ ఘనత సాధించాయి.

1 నేటి ఫైనల్లో విజేతగా నిలిచిన జట్టు అరుదైన ఘనత సాధిస్తుంది. ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా టి20 ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పుతుంది. వన్డే వరల్డ్‌కప్‌లో మాత్రం వెస్టిండీస్ (1975, 1979), ఆస్ట్రేలియా (2003, 2007) జట్లు రెండుసార్లు చొప్పున ఈ ఘనత సాధించాయి.

2 కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్) తర్వాత మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో జాతీయ జట్టుకు సారథ్యం వహించిన రెండో కెప్టెన్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందనున్నాడు.

26 అంతర్జాతీయ టి20ల్లో భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఇప్పటి వరకు 26 మ్యాచ్‌లు జరిగాయి. 14 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... 11 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఒక మ్యాచ్ రద్దయింది. టి20 ప్రపంచకప్‌లలో ఈ రెండు జట్ల మధ్య 6 మ్యాచ్‌లు జరిగాయి. 4 మ్యాచ్‌ల్లో భారత్, 2 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా గెలుపొందాయి.



"ఫలానావారి కోసం కప్ గెలవాలనే నినాదాలకు నేను వ్యతిరేకం. బాగా ఆడి మ్యాచ్ గెలవడం ముఖ్యం తప్ప ఇతర విషయాలు పట్టించుకోను. 12 నెలల వ్యవధిలో మూడు ఐసీసీ ఫైనల్స్‌కు చేరడం అదీ మూడు వేర్వేరు ఫార్మాట్‌లు కావడం మా జట్టు నిలకడను చూపించింది. ఫైనల్‌కు ముందు ప్రాక్టీస్ కోసం సమయం లేకపోయినా ఆటగాళ్లంతా సిద్ధమయ్యే ఉన్నారు. మానసికంగా కూడా ఎలాంటి గందరగోళం లేకుండా ప్రశాంతంగా తుది పోరుకు రెడీ అయ్యాం. ఇక్కడ ఇప్పటికే ఒక మ్యాచ్ ఆడటం మాకు సానుకూలాంశమే. వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌నుంచి పాఠాలు నేర్చుకోవడం వంటిదేమీ లేదు. దాని కోసం కూడా బాగా సిద్ధమయ్యాం కానీ ఆ రోజు ప్రత్యర్థి మాకంటే మెరుగ్గా ఆడింది. అయినా పరాజయాలు మరచి ముందుకు సాగిపోవడం ఆటగాళ్ల లక్షణం. రెండు అత్యుత్తమ జట్ల మధ్య జరగబోతున్న ఈ ఫైనల్ మాకు అనుకూలంగా సాగాలని కోరుకుంటున్నా"

–రాహుల్ ద్రవిడ్, భారత హెడ్ కోచ్

డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ



టెక్సాస్: యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా ద్వయం 16–21, 21–11, 21–19తో సెయి పె షాన్–హంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రియాన్షు 21–18, 21–16తో హువాంగ్ యు కాయ్ (చైనీస్ తైపీ)పై, మాళవిక 15–21, 21–19, 21–14తో తెరెజా స్వబికోవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందారు.

కాంస్య పతకాలు నెగ్గిన నిత్య, జ్యోతికశ్రీ





పంచ్‌కుల (హరియాణా): జాతీయ సీనియర్ ఇంటర్ స్టేట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండో రోజు శుక్రవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అథ్లెట్‌లకు ఒక్కో పతకం లభించింది. మహిళల 100 మీటర్ల విభాగంలో నిత్య గాంధీ, మహిళల 400 మీటర్ల విభాగంలో దండి జ్యోతికశ్రీ కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. నిత్య 11.79 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. జ్యోతికశ్రీ 52.11 సెకన్లలో రేసును ముగించి మూడో స్థానాన్ని దక్కించుకుంది.

షఫాలీ విశ్వరూపం

భారత మహిళా క్రికెటర్లా... మజాకా! దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో చెన్నైలో ఆరంభమైన ఏకైక టెస్టును టీమిండియా రికార్డుల జడివానతో మొదలుపెట్టింది. 'ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ'... తొలి వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం... ఒకేరోజు అత్యధిక జట్టు స్కోరు... ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు... ఇలా ఒకటే మిటి అన్ని కలగలిపి అతివల క్రికెట్లో అపూర్వ రికార్డుల జాతరను మన మహిళల జట్టు ఆవిష్కరించింది. ఈ మ్యాచ్‌ను చూసిన వారందరికి ఆడుతోంది అమ్మాయిలేనా? జరుగుతోంది టెస్టా లేదంటే వన్డేనా అన్న అనుమానం కలగకమానదు. అంతలా... ఆకాశమే హద్దన్నట్లుగా హర్మన్‌ప్రీత్ బృందం సఫారీపై సూపర్‌గా ఆడింది.



షఫాలీ డబుల్ సెంచరీ అభివాదం

చెన్నై: భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఏకైక టెస్టులో విశ్వరూపమే చూపెట్టింది. డాషింగ్ ఓపెనర్ షఫాలీ వర్మ (197 బంతుల్లో 205; 23 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించింది. మరో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (161 బంతుల్లో 149; 27 ఫోర్లు, 1 సిక్స్) కూడా సఫారీ బౌలర్లను చితగ్గొట్టి మరీ శతకాన్ని పూర్తి చేసుకుంది. దీంతో శుక్రవారం మొదలైన ఈ ఏకైక టెస్టులో భారత మహిళల జట్టు తొలి రోజు ఆట ముగిసేసరికి 98 ఓవర్లలోనే 4 వికెట్ల నష్టానికి 525 పరుగుల భారీస్కోరు కాదు... ఒక్క రోజే రికార్డు స్కోరు నమోదు చేసింది.

పరుగు... ప్రవాహమైందిలా!

టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ చేపట్టింది. ఓపెనర్లు స్మృతి, షఫాలీ పరుగులు మొదలు పెట్టారు. ఇది పట్టాలెక్కగానే ప్రవాహం ఆ వెంటే రికార్డుల విధ్వంసం రోజంతా కొనసాగింది. 14వ ఓవర్లో భారత్ స్కోరు 50కి చేరింది. స్మృతి 78 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. దీంతోనే ఇది టెస్టు కాదని వన్డేనేమో అనే అనుమానం మొదలైంది. షఫాలీ 66 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించడం, జట్టు స్కోరు వన్డేలకు దీటుగా 24.4 ఓవర్లలోనే 100కు చేరడంతో ఇది ఏ మ్యాచ్ అబ్బా అని అభిమానులు క్రికెట్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌లలో ఏ ఫార్మాట్ అనే ఎంక్వైరీ చేసుకునేలా చేసింది. లంచ్ విరామానికి 130/0 స్కోరు చేసింది. ఆ తర్వాత రెండో సెషన్‌లోనూ ఓపెనర్లు షఫాలీ, స్మృతిల బ్యాటింగ్ దూకుడుతో 39 ఓవర్లలోనే భారత్ 200 స్కోరును అవలీలగా దాటేసింది. ఈ క్రమంలో ముందుగా షఫాలీ 113 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకోగా, స్మృతి 122 బంతుల్లో శతకాన్ని సాధించింది.



స్మృతి

194 బంతుల్లో 'ద్విశతకం'

ఎట్టకేలకు 52వ ఓవర్లో స్మృతి అవుటైంది. 54వ ఓవర్లో జట్టు స్కోరు 300 పరుగులకు చేరుకుంది. అప్పుడు తెలిసొచ్చింది స్కోరైతే వన్డే తీరు... ఫార్మాట్ అయితే సంప్రదాయ పోరు అని! కాసేపటికే శుభా సతీశ్ (15) వెనుదిరిగింది. 334/2 స్కోరు వద్ద టీ బ్రేక్‌కు వెళ్లారు. తర్వాత జెమీమా రోడ్రిగ్స్ (94 బంతుల్లో 55; 8 ఫోర్లు) అండతో షఫాలీ 194 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించింది. 73వ ఓవర్లోనే భారత్ 400 పరుగుల మైలురాయిని వేగంగా అందుకుంది. షఫాలీ రనౌట్ కాగా... క్రీజులో పాతుకుపోయినా జెమీమా కూడా (85 బంతుల్లో) ఫిఫ్టీ సాధించింది. 95వ ఓవర్లో భారత్ 500 అసాధారణ స్కోరును ఒక్కరోజులోనే సాధించింది.

- టెస్టుల్లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ చేసిన భారత ఓపెనర్
- స్మృతి మంధాన సెంచరీ
- తొలి వికెట్‌కు ప్రపంచ రికార్డు భాగస్వామ్యం
- తొలి రోజే 525 పరుగులు చేసిన భారత మహిళల జట్టు

1 మహిళల క్రికెట్లో షఫాలీ 194 బంతుల్లో సాధించిన వేగవంతమైన డబుల్ సెంచరీ కొత్త రికార్డు. ఇదే ఏడాది దక్షిణాఫ్రికా జట్టుపైనే అనాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా) 248 బంతుల్లో ద్విశతకం చేసింది.

2 మిథాలీ రాజ్ (214; 2002లో ఇంగ్లండ్‌పై) తర్వాత టెస్టుల్లో డబుల్ సెంచరీ సాధించిన రెండో భారతీయ మహిళా క్రికెటర్‌గా షఫాలీ నిలిచింది.

292 తొలి వికెట్‌కు షఫాలీ, స్మృతి జోడించిన పరుగులు. ఇది కొత్త ప్రపంచ రికార్డు. 2004లో పాక్ ఓపెనర్లు సాజిదా, కిరణ్ బలూచ్‌లు విండీస్‌పై తొలి వికెట్‌కు 241 పరుగులు జతచేశారు.

525 టెస్టు క్రికెట్‌లో మ్యాచ్ తొలిరోజుతోపాటు ఒకే రోజు అత్యధిక పరుగులు చేసిన జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. 1935లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ తొలిరోజు 431 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

భారత మహిళల తొలి ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (రనౌట్) 205; స్మృతి (సి) డెర్క్‌సెన్ (బి) టకర్ 149; శుభ (సి) జాఫ్తా (బి) డి క్లెర్క్ 15; జెమీమా (సి) డి క్లెర్క్ (బి) టకర్ 55; హర్మన్‌ప్రీత్ (బ్యాటింగ్) 42; రిచా ఘోష్ (బ్యాటింగ్) 43; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (98 ఓవర్లలో 4 వికెట్లకు) 525. వికెట్ల పతనం: 1–292, 2–325, 3–411, 4–450. బౌలింగ్: క్లాస్ 14–2–63–0, డెర్క్‌సెన్ 11–0–60–0, నదినె 10–1–62–1, టుమి 10–0–55–0, నొంకు లులెకొ లబ 24–1–113–0, డెల్మి టకర్ 26–1–141–2, సునె లుస్ 3–0–15–0.

సుమిత్ ప్రత్యర్థి కిచ్‌మానోవిచ్

వింబుల్డన్ టోర్నీ 'డ్రా' విడుదల



లండన్: తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో పోటీపడుతున్న భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. సోమవారం మొదలయ్యే ఈ ప్రతిష్టాత్మక టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 53వ ర్యాంకర్ మియోమిర్ కిచ్‌మానోవిచ్ (సెర్బియా)తో ప్రపంచ 72వ ర్యాంకర్ సుమిత్ తలపడతాడు. నాలుగేళ్ల క్రితం జర్మనీలో జరిగిన ఏటీపీ–250 టోర్నీలో కిచ్‌మానోవిచ్‌తో ఏకైకసారి ఆడిన సుమిత్ మూడు సెట్‌లలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో సుమిత్ సెర్బియాకు చెందిన దుసాన్ లజోవిచ్‌తో కలిసి బరిలోకి దిగనున్నాడు. భారత నుంచి డబుల్స్‌లో రోహన్ బోపన్న, శ్రీరామ్ బాలాజీ, యూకీ బాంబ్రీ వేర్వేరు భాగస్వాములతో కలిసి ఈ టోర్నీలో ఆడనున్నారు. బోపన్న–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి రెండో సీడింగ్ లభించింది.

డోపింగ్‌లో పట్టుబడ్డ జావెలిన్ త్రోయర్ మనూ



పంచ్‌కుల (హరియాణా): పారిస్ ఒలింపిక్స్ ఆశాకిరణం, భారత జావెలిన్ త్రోయర్ డీపీ మనూ డోపింగ్ పరీక్షలో దొరికిపోయాడు. అతను నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు పరీక్షల్లో తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక నిషేధం విధించింది. ఈ ఏప్రిల్‌లో భారత గ్రాండ్‌ప్రిలో అతను పోటీపడ్డాడు. ఆ సమయంలో అతని నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను 'నాడా' ల్యాబ్‌లో పరీశీలించగా నిషిద్ధ ఉత్ప్రేరకాలు వాడినట్లు రిపోర్టులో వచ్చింది. గతేడాది ఆసియా చాంపియన్‌షిప్‌లో 24 ఏళ్ల మను రజత పతకం సాధించాడు.

సాక్షి బిజినెస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
210	34
79,033	24,011

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,835	▽ 24
డోజోన్స్	39,109	▽ 55
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,164	▽ 16
డాక్స్	18,235	△ 25
షాంఘై	2,967	▽ 22
నికాయ్	39,583	△ 242

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,835	△ 444
బంగారం (99.5 స్వచ్ఛత)	71,547	△ 442
వెండి (కిలో)	88,000	△ 497

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	83.00	84.02
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.21	106.77
€	యూరో	[illegible]	90.47	88.05
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	52.44	54.28
AUS	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	54.41	56.38
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.20	69.88
SAR	సౌదీ రియాల్	[illegible]	21.33	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.82	23.60
¥	చైనా యువాన్	[illegible]	10.35	12.43

పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు యథాతథం

కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్



న్యూఢిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు జూలై 1తో ఆరంభమయ్యే త్రైమాసికానికి యథాతథంగా కొనసాగుతాయని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. అంటే ప్రస్తుతం అమల్లో ఉన్న రేట్లే వచ్చే త్రైమాసికానికీ (జూలై–సెప్టెంబర్) కొనసాగనున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి (2024–25 ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు) నోటిఫై చేసిన రేట్లు కొనసాగుతాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రతి త్రైమాసికానికీ వివిధ పొదుపు పథకాల రేట్లను కేంద్ర సర్కారు సమీక్షిస్తుండడం తెలిసిందే.

వివిధ పథకాల రేట్లు..: సుకన్య సమృద్ధి యోజన పథకంలో పెట్టుబడులపై 8.2 శాతం రేటు అమలు కానుంది. పీపీఎఫ్ వడ్డీ రేటు 7.1 శాతంగా కొనసాగుతుంది. కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)లో పెట్టుబడులపై 7.5 శాతం రేటు అమలవుతుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)లో చేసే పెట్టుబడులపై 7.7 శాతం రేటు పొందొచ్చు. పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ పథకంలో రేటు 7.4 శాతంగా కొనసాగుతుంది. రికరింగ్ డిపాజిట్‌కు 6.7 శాతం రేటు వర్తిస్తుంది. సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్‌కు 8.2 శాతం రేటు వర్తిస్తుంది.

బేసిక్ డీమ్యాట్ ఖాతా పరిమితి పెంపు

రూ. 4 లక్షల నుంచి రూ. 10 లక్షలకు • పెట్టుబడులపై సెబీ తాజా నిర్ణయం



న్యూఢిల్లీ: చిన్న ఇన్వెస్టర్లను ఆకట్టుకునే యోచనతో సెబీ ప్రాథమిక(బేసిక్) డీమ్యాట్ ఖాతాలో పెట్టుబడుల పరిమితిని పెంచింది. ప్రస్తుతం ఈక్విటీలలో రూ. 2 లక్షలు, రుణ సెక్యూరిటీలు (బాండ్లు)లో రూ. 2 లక్షలు చొప్పున ఇన్వెస్ట్ చేసేందుకు వీటిని అనుమతిస్తున్నారు. సెబీ తాజా నిర్ణయంతో ఇకపై బేసిక్ సర్వీస్ డీమ్యాట్ ఖాతా(బీఎస్‌డీఏ)లో రూ. 10 లక్షల వరకూ పెట్టుబడులను కలిగి ఉండేందుకు వీలుంటుంది. తాజా మార్గదర్శకాలు సెప్టెంబర్ 1నుంచి అమలుకానున్నాయి. రెగ్యులర్ డీమ్యాట్ ఖాతా నుంచి 2012లో సెబీ బీఎస్‌డీఏను సెబీ ప్రవేశపెట్టింది. దీంతో చిన్న పోర్ట్‌ఫోలియోలు కలిగి ఉండే ఇన్వెస్టర్లకు డీమ్యాట్ చార్జీల భారాన్ని తగ్గించే ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. బీఎస్‌డీఏ అర్హత కలిగిన ఇన్వెస్టర్ రూ. 4 లక్షలలోపు విలువైన పోర్ట్‌ఫోలియో(ఈక్విటీ, డెట్)ను కలిగి ఉంటే డీమ్యాట్ ఖాతాకు వార్షిక నిర్వహణ చార్జీలు ఉండవు. రూ. 4 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకూ విలువగల ఖాతాలకు రూ. 100 చార్జీ వసూలు చేస్తారు. విలువ ఇంతకుమించితే రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాగా పరిగణిస్తారు.

అన్‌లిమిటెడ్ 'రెడ్ అలర్ట్ సేల్'కు అపూర్వ స్పందన



హైదరాబాద్: ఫ్యాషన్ దుస్తుల సంస్థ అన్‌లిమిటెడ్ ఇటీవల ప్రకటించిన 'రెడ్ అలర్ట్ సేల్' ఆఫర్‌కు అపూర్వ స్పందన లభిస్తుండంతో మరిన్ని కొత్త కలెక్షన్లను చేర్చింది. పరిమిత కాల ఆఫర్‌ను కస్టమర్లు వినియోగించుకోవాలని కంపెనీ కోరింది. బ్రాండెడ్ ఉత్పత్తుల కొనుగోలుపై 50% తగ్గింపుతో పాటు రూ.3000 కొనుగోలుపై రూ.3000 ఉచిత షాపింగ్ ఆఫర్ పొందవచ్చు.

మలబార్ 'నువా' డైమండ్ కలెక్షన్

బెంగళూరు: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'నువా' పేరుతో డైమండ్ కలెక్షన్ విడుదల చేసింది. యూఏఈలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బాలీవుడ్ నటి కరీనా కపూర్ ఖాన్ కొత్త కలెక్షన్‌ను ఆవిష్కరించారు. అత్యంత విలాసవంతమైన ప్రత్యేక వజ్రాలు ఇందులో పొందుపరిచారు. 'ప్రకృతిలోని రమణీయ అందాలు, స్త్రీలలోని మొక్కవోని ధైర్యసాహసాల నుంచి ప్రేరణ పొంది ఈ కలెక్షన్ తీర్చిదిద్దాము. భారత్‌లోని అన్ని మలబార్ స్టోర్లలోనూ 'నువా' డైమండ్ కలెక్షన్ అందుబాటులో ఉంటుంది' అని గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు.



ఎయిర్‌టెల్ చార్జీల వడ్డన

వొడాఫోన్ ఐడియా కూడా.. • టారిఫ్‌లు 10–24 శాతం పెంపు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం కంపెనీ ఎయిర్‌టెల్ చార్జీల మోత మోగించింది. ప్రీ–పెయిడ్, పోస్ట్ పెయిడ్ మొబైల్ టారిఫ్‌లను 10–21 శాతం పెంచుతున్నట్టు శుక్రవారం ప్రకటించింది. సవరించిన ధరలు జూలై 3 నుంచి అమలులోకి వస్తాయని వెల్లడించింది. పోటీ సంస్థ రిలయన్స్ జియో టారిఫ్‌లను అధికం చేస్తున్నట్టు ప్రకటించిన మరుసటి రోజే ఎయిర్‌టెల్ సైతం అదేబాట పట్టడం గమనార్హం. టెలికం రంగంలో గడిచిన రెండున్నరేళ్లలో ఈ స్థాయిలో చార్జీలను పెంచడం ఇదే తొలిసారి.

కొత్త చార్జీలు..

రోజుకు 1 జీబీ డేటా ఆఫర్ చేసే రూ.19 ప్లాన్ కాస్తా రూ.22 కానుంది. రోజుకు 2 జీబీ డేటాతో 365 రోజుల వ్యాలిడిటీ ప్యాక్ ధర రూ.2,999 నుంచి రూ.3,599కి చేరనుంది. 28 రోజుల కాలపరిమితితో రూ.179 ధర కలిగిన అపరిమిత వాయిస్ ప్లాన్ ఇక నుంచి రూ.199కి పెరగనుంది. రోజుకు 1.5 జీబీ డేటాతో 56 రోజుల వ్యాలిడిటీ గల రూ.479 ప్యాక్ ధర రూ.579 కానుంది. అలాగే పోస్ట్ పెయిడ్ రేట్ల సవరణతో ఒక్కో ప్లాన్‌పై కస్టమర్‌కు నెలకు రూ.50–200 అదనపు భారం కానుంది.

రోజుకు 70 పైసల లోపే..

చార్జీల భారం ఎంట్రీ లెవెల్ కస్టమర్లపై రోజుకు 70 పైసలలోపే ఉంటుందని ఎయిర్‌టెల్ ప్రకటించింది. దేశంలోని టెలికం కంపెనీలు ఆర్థికంగా ఆరోగ్యకర వ్యాపార విధానం అనుసరించాలంటే ఒక్కో వినియోగదారు నుంచి నెలకు సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ.300 కంటే అధికంగా ఉండాలని భారతీ ఎయిర్‌టెల్ వెల్లడించింది. ఈ స్థాయి ఏఆర్‌పీయూ ఉంటే నెట్‌వర్క్ టెక్నాలజీ, స్పెక్ట్రమ్‌లో అవసరమైన గణనీయ పెట్టుబడులు చేసేందుకు మార్గం ఏర్పడుతుందని తెలిపింది. కాగా, జూలై 3 నుంచి టారిఫ్‌లను 12–27 శాతం పెంచుతున్నట్టు రిలయన్స్ జియో గురువారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

వొడాఫోన్ ఇలా..

నష్టాల్లో ఉన్న వొడాఫోన్–ఐడియా సైతం చార్జీల వడ్డనకు సిద్ధం అయింది. జూలై 4 నుంచి మొబైల్ టారిఫ్‌లను 11–24 శాతం పెంచాలని నిర్ణయించింది. 28 రోజుల వ్యాలిడిటీతో రూ.179 విలువగల ప్రారంభ ప్లాన్ రూ.199 కానుంది. రోజుకు 1.5 జీబీ డేటాతో 84 రోజుల కాలపరిమితిగల రూ.719 ప్లాన్ కాస్తా రూ.859కి చేరింది. వార్షిక అపరిమిత ప్లాన్ ధర రూ.2,899 నుంచి రూ.3,499 అయింది.

కొత్త శిఖరాలు... చివరికి నష్టాలు

- బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణ
- వారాంతాన నష్టాలతో ముగిసిన సూచీలు



ముంబై: బ్యాంకింగ్, ఫైనాన్స్, టెక్ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో శుక్రవారం స్టాక్ సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 210 పాయింట్లు పతనమై 79,033 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు నష్టపోయి 24,011 వద్ద నిలిచింది. దీంతో సూచీల 3 రోజుల రికార్డుల ర్యాలీకి, 4 రోజుల లాభాలకు ముగింపు పడింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలతో ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 428 పాయింట్లు పెరిగి 79,672 వద్ద, నిఫ్టీ 130 పాయింట్లు బలపడి 24,174 వద్ద జీవితకాల గరిష్టాల నమోదు చేశాయి. ప్రథమార్ధమంతా స్థిరమైన లాభాలతో ట్రేడయ్యాయి. లాభాల స్వీకరణ ప్రభావంతో మిడ్‌సెషన్ నుంచి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చివరికి నష్టాలతో ముగిశాయి. మరోవైపు ఫార్మా, ఇంధన, మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, యుటిలిటీ, కమోడిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 0.56%, 0.41 శాతం పెరిగాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లపై ప్రభావం చూపే యూఎస్ పీసీఈ ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- తన టెలికం అనుబంధ సంస్థ జియో ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ సేవల టారిఫ్‌లను 12–27% మేర పెంచడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రాణించింది. బీఎస్‌ఈలో 2.31% లాభపడి రూ.3,132 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 3.27% పెరిగి రూ.3,161 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.47,777.57 కోట్లు ఎగసి రూ.21.18 లక్షల కోట్లకు చేరింది.
- జేకే టైర్స్ షేరు 9% పెరిగి రూ.430 వద్ద స్థిరపడింది. బ్రోకింగ్ సంస్థ ఎంకే గ్లోబల్ ఈ షేరుకు 'బై' రేటింగ్ కేటాయింపుతో పాటు షేరు టార్గెట్ ధరను రూ.700కు పెంచడం ఇందుకు కారణం. ట్రేడింగ్‌లో 10% ఎగసి రూ.435 వద్ద స్థిరపడింది.

ఐపీవో స్ట్రీట్

స్టాన్లీ లైఫ్‌స్టైల్స్ లిస్టింగ్ సక్సెస్



ముంబై: లగ్జరీ ఫర్నిచర్ బ్రాండ్ స్టాన్లీ లైఫ్‌స్టైల్స్ షేర్లు లిస్టింగ్‌లో అదరగొట్టాయి. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.369)తో పోలిస్తే 35% ప్రీమియంతో రూ.499 వద్ద లిస్టయ్యాయి. కొనుగోళ్ల మద్దతు లభించడంతో ట్రేడింగ్‌లో 38% ఎగసి రూ.510 వద్ద గరిష్టాన్ని తాకాయి. చివరికి 28% లాభంతో రూ.474 వద్ద స్థిరపడ్డాయి. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,702.62 కోట్లుగా నమోదైంది. ఎక్స్ఛేంజీలో మొత్తం 55.85 లక్షల ఈక్విటీలు చేతులు మారాయి. మంగళవారం ముగిసిన ముగిసిన ఈ ఐపీఓకి 96.98 రెట్ల అధిక స్పందన లభించింది.

ఎమ్‌క్యూర్ @ రూ. 960-1008

జూలై 3–5 మధ్య పబ్లిక్ ఇష్యూ



న్యూఢిల్లీ: బెయిన్ క్యాపిటల్‌కు పెట్టుబడులున్న హెల్త్‌కేర్ రంగ కంపెనీ ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 960–1008 ధరల శ్రేణిని ప్రకటించింది. జూలై 3న ప్రారంభంకానున్న ఇష్యూ 5న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.14 కోట్ల షేర్ల(రూ. 1,152 కోట్ల విలువ)ను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 1,952 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ప్రమోటర్ సతీష్ మెహతా, పీఈ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ ఐపీవోలో షేర్లను ఆఫర్ చేయనున్నాయి. రిటైలర్లు కనీసం 14 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయాలి.

బన్సల్ వైర్ ఐపీవో 3న

ధరల శ్రేణి రూ. 243–256



న్యూఢిల్లీ: స్టీల్ వైర్ల తయారీ కంపెనీ బన్సల్ వైర్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 243–256 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ జులై 3న ప్రారంభమై 5న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 2న షేర్లను కేటాయించనుంది. ఐపీవోలో భాగంగా రూ. 745 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 745 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా స్టీల్ వైర్ల తయారు చేసి విక్రయించడంతోపాటు.. ఎగుమతులను సైతం చేపడుతోంది. రిటైలర్లు కనీసం 58 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది.

వ్రజ్ ఐరన్ ఐపీవోకు క్యూ

119 రెట్లు అధిక స్పందన


న్యూఢిల్లీ: స్పాంజ్ ఐరన్, టీఎంటీ బార్ల తయారీ కంపెనీ వ్రజ్ ఐరన్ అండ్ స్టీల్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో చివరి రోజు శుక్రవారానికల్లా 119 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కంపెనీ 61,38,462 షేర్లు విక్రయానికి ఉంచగా.. 73 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 209 రెట్లు, అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి 164 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. ఇక రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 55 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. ఇష్యూ ధరల శ్రేణి రూ. 195–207.

సినిమా



• అనుష్క • విజయశాంతి • నభా నటేశ్

సేనాపతి... ఓ సూపర్ హీరో



• కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2'). 1996లో విడుదలైన బ్లాక్‌బస్టర్ సినిమా 'ఇండియన్'కి సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2, ఇండియన్ 3' సినిమాలు రూపొందాయి. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన ఈ సీక్వెల్స్‌లో ముందు 'ఇండియన్ 2' చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌లో సేనాపతిగా కమల్‌హాసన్ కొన్ని మార్షల్ ఆర్ట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు చేశారు. అయితే 'ఇండియన్' సినిమాలో సేనాపతికి 75 సంవత్సరాలు. ఈ ప్రకారం 2024లో ఆయన వయస్సు 103కి చేరుతుంది. అలాంటప్పుడు అంత వయసులో సేనాపతి మార్షల్ ఆర్ట్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా చేయగలుగుతున్నాడు అనే సందేహాలను వ్యక్తపరచారు కొందరు నెటిజన్లు. ఈ విషయంపై ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో శంకర్ స్పందించారు. ''నా దృష్టిలో సేనాపతి ఓ సూపర్ హీరో. 'భారతీయుడు' కథ రాసుకున్నప్పుడు సేనాపతిని ఓ స్వాతంత్ర్య సమరయోధుడిగా చూపించాలని అప్పుడు సేనాపతికి 75 సంవత్సరాలు అన్నట్లుగా చూపించాం. అప్పుడు సీక్వెల్ ఆలోచన లేదు. ఇప్పుడు 'భారతీయుడు 2'లో చైనా మార్షల్ ఆర్ట్స్ ఫైటర్‌గా సేనాపతి కనిపిస్తాడు. అత్యధిక వయసు కలిగిన ఫైటర్స్ చైనాలో ఉన్నారు. 108 సంవత్సరాలు ఉన్న లు జీజియన్ అనే చైనా మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ ఇప్పటికీ యాక్టివ్‌గా ఉన్నారు. వారి సాధన, క్రమశిక్షణ వారిని అలా తీర్చిదిద్దుతుంది. సేనాపతి కూడా అలాంటివాడే'' అని చెప్పుకొచ్చారు శంకర్. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా, ఎస్‌జే సూర్య, గుల్షన్ గ్రోవర్ కీలక పాత్రల్లో నటించారు. ఇక 'ఇండియన్ 3' చిత్రం వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల కానుంది.

సికందర్‌కు విలన్?



• ఫాహద్ ఫాజిల్

సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సికందర్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల ముంబైలోని ఓ స్టూడియోలో ప్రారంభమైంది. సల్మాన్ ఖాన్ పాల్గొంటుండగా యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో సికందర్‌గా సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్ చేస్తున్నారు. విలన్‌గా సత్యరాజ్ నటించనున్నట్లు వార్తలు వినిపించాయి. తాజాగా ఫాహద్ ఫాజిల్ పేరు తెరపైకి వచ్చింది. మరి... సత్యరాజ్, ఫాహద్ ఫాజిల్‌లలో 'సికందర్'కు విలన్‌గా ఎవరు ఉంటారు? లేకపోతే ఈ ఇద్దరూ నటిస్తున్నారా? అనే విషయాలపై క్లారిటీ రావాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయాలి. ఒకవేళ ఫాహద్ నటిస్తే ఆయనకు హిందీలో ఇదే తొలి చిత్రం అవుతుంది.

ఫైట్ షురూ



• తమన్నా

తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 2021లో వీక్షకుల ముందుకు వచ్చిన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ పతాకాలపై డి. మధు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం తమన్నా ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అత్యున్నత ప్రమాణాలతో ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ డిజైన్ చేసిన ఈ ఫైట్ సీన్స్ ప్రేక్షకులకు విజువల్ ట్రీట్‌గా ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్ .ఎస్.

దీక్ష పూర్తి



• ప్రతాని రామకృష్ణ గౌడ్

కిరణ్‌కుమార్, అలేఖ్య రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' మూవీ షూటింగ్ పూర్తయింది. ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శకత్వం వహించారు. ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్‌పై పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మించారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''కృషి, పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో ఈ మూవీని తెరకెక్కించాం. ఈ సినిమా ద్వారా నలుగురు హీరోయిన్స్‌ని పరిచయం చేస్తున్నాం. అలాగే 'మహిళా కబడ్డీ' అనే మరో చిత్రాన్ని 18 భాషల్లో తెరకెక్కించబోతున్నాం. కబడ్డీ ఆడగల యంగ్ హీరోయిన్స్ మమ్మల్ని సంప్రదించవచ్చు'' అన్నారు. ''దీక్ష'తో నాకు మంచి పేరుతో పాటు అవార్డ్స్ వస్తాయని ఆశిస్తున్నాను'' అన్నారు కిరణ్. రచయిత రాంప్రసాద్, నటి తులసి మాట్లాడారు.

జస్ట్ బ్రేక్... అంతే!

మనసుకి నచ్చిన కథ వచ్చే వరకూ కొందరు స్టార్స్ ఖాళీగా ఉంటారు తప్ప ఏ సినిమా పడితే అది చేయరు. కొందరికి నచ్చిన కథ వచ్చినా ఆరోగ్యం బాగా లేక ఇంటిపట్టున ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. వేరే వ్యక్తిగత కారణాల వల్ల కూడా కొందరు బ్రేక్ తీసుకుంటారు. కారణాలు ఏమైనా ఈ మధ్య కొందరు స్టార్స్ సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. బ్రేక్ తర్వాత కెమెరా ముందుకి వచ్చి, ఆ తారామణులు చేస్తున్న, చేసిన చిత్రాల గురించి తెలుసుకుందాం.

- తెలుగు ప్రేక్షకుల మనసుల్లో లేడీ సూపర్ స్టార్‌గా నిలిచిపోయారు నటి విజయశాంతి. 'నాయుడమ్మ' (2006) సినిమా తర్వాత పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి వెళ్లారామె. దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మహేశ్‌బాబు హీరోగా నటించిన 'సరిలేరు నీకెవ్వరు' (2020) సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చారు విజయశాంతి. ప్రొఫెసర్ భారతి పాత్రలో తనదైన నటనను, భావోద్వేగాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారామె. 'సరిలేరు నీకెవ్వరు' తర్వాత మళ్లీ రాజకీయాల్లో బిజీ అయిన విజయశాంతి దాదాపు మూడున్నరేళ్ల తర్వాత ఓ సినిమా కమిట్ అయ్యారు. కల్యాణ్ రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రంలో నటిస్తున్నారామె. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వైజయంతీ ఐపీఎస్ అనే పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నారు. ఈ నెల 24న విజయశాంతి పుట్టినరోజుని పురస్కరించుకుని ఆమె పాత్ర తాలూకు గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. 'వైజయంతీ ఐపీఎస్. తాను పట్టుకుంటే పోలీస్ తుపాకీకి ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యునిఫామ్‌కి పౌరుషం వస్తుంది.. తనే ఒక యుద్ధం. మేమే తన సైన్యం' అంటూ విడుదలైన గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వస్తోంది.
- తెలుగులో జేజమ్మగా ప్రేక్షకుల మనసు దోచుకున్నారు అనుష్క. గత ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు ఈ బ్యూటీ. 2018లో విడుదలైన 'భాగమతి' మూవీ తర్వాత 'నిశ్శబ్దం' (2020)లో కథానాయికగా నటించారు. ఈ రెండు చిత్రాలకు మధ్య 'సైరా'లో అతిథి పాత్ర చేశారు. 'నిశ్శబ్దం' తర్వాత కాస్త గ్యాప్ తీసుకుని, 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' (2023) చేశారు. ఈ చిత్రం విడుదలైన ఏడాదికి కొత్త చిత్రాలు కమిట్ అయ్యారు. ప్రస్తుతం ఆమె 'కథనార్–ది వైల్డ్ సోర్సెరర్' అనే మలయాళ సినిమాలో నటిస్తున్నారు. తెలుగులో అంగీకరించిన చిత్రం 'ఘాటీ'. ఈ చిత్రానికి క్రిష్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందుతోంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో జరిగిన వాస్తవ ఘటన నేపథ్యంలో 'ఘాటీ'ని తెరకెక్కిస్తున్నారని టాక్. అందుకే ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లో తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరిపారట. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది.
- మలయాళ తార మమతా మోహన్‌దాస్ తెలుగులో హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'యమదొంగ'(2007). ఈ చిత్రంలో 'చంపేస్తాన్రా రేయ్.. ఆగంద్రా.. రేయ్ యాడికి పోతాన్రా.. ఏదో ఒక రోజు దొరకాల.. నెల్లూరు ట్రంకు రోడ్డులో గుడ్డలూడదీసి తంతాను నాయాల్లారా..' అంటూ 'యమదొంగ'లో మమతా మోహన్‌దాస్ చెప్పిన డైలాగ్స్ బాగా పాపులర్ అయ్యాయి. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు అందుకున్నారామె. నాగార్జున హీరోగా నటించిన 'కేడీ (2009) తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు. దాదాపు 14 ఏళ్ల తర్వాత 'రుద్రంగి' (2023) చిత్రంతో తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చారు మమతా మోహన్‌దాస్. ఇటీవల ఆమె నటించిన 'మహారాజ' (విజయ్ సేతుపతి హీరో) సినిమా ఈ నెల 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది.
- తెలుగు ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని పేరు శోభన. కృష్ణ, చిరంజీవి, మోహన్‌బాబు, నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, జగపతిబాబు వంటి హీరోలందరికీ జోడీగా నటించారామె. ప్రత్యేకించి కార్తీ హీరోగా నటించిన 'అభినందన' (1988) సినిమాలో ఆమె నటన అద్భుతం. ఇక 'సూర్య పుత్రులు' (1997) తర్వాత దాదాపు పదేళ్ల తెలుగు సినిమాల నుంచి విరామం తీసుకున్న ఆమె మోహన్‌బాబు, విష్ణు మంచు నటించిన 'గేమ్' (2006) మూవీతో రీ ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రం తర్వాత తెలుగులో దాదాపు పద్దెనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' మూవీతో రీ ఎంట్రీ ఇచ్చారు శోభన. ఈ చిత్రంలో శంబాల రాజ్యానికి చెందిన నాయకురాలు మరియంగా తనదైన నటనతో ఆకట్టుకున్నారామె. ఈ చిత్రం ఈ గురువారం (మే 27) విడుదలైంది.
- 'ఛాతీ మీద చటాకు మాంసం లేదు నువ్వు పెద్ద రౌడీవా?, రేయ్.. నీకంటే పెద్ద రౌడీరా నేను.. ముందు నాతో కొట్లాడు.. సిద్ధిపేటలో అడుగు చాందినీ గురించి చెబుతారు' అంటూ 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంలో నభా నటేశ్ చెప్పిన మాస్ డైలాగులు ప్రేక్షకుల మనసుల్లో లోతుగా గుచ్చుకున్నాయి. సుధీర్ బాబు హీరోగా నటించిన 'నన్ను దోచుకుందువటే' (2018) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారీ బ్యూటీ. ఆ తర్వాత 'అదుగో', ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్' వంటి మూవీల్లో నటించారు. కాగా 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో హిట్‌ని తన ఖాతాలో వేసుకోవడంతో పాటు ప్రేక్షకుల్లో 'ఇస్మార్ట్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్నారు నభా. ఓ కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమె దాదాపు మూడేళ్లు సినిమాలకు బ్రేక్ ఇచ్చారు. ప్రస్తుతం నిఖిల్ హీరోగా రూపొందుతున్న 'స్వయంభూ'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు నభా.



• 'కల్కి'లో శోభన



• మమతా మోహన్‌దాస్

క్లుప్తంగా...

ఆగస్టు 1 నుంచి ఎండీఎస్ తరగతులు

సాక్షి, అమరావతి: మాస్టర్స్ ఆఫ్ డెంటల్ సర్జరీ (ఎండీఎస్) కోర్సులకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరానికి ఆగస్టు ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల ఒకటో తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించబోతున్నట్టు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) తెలిపింది. నీట్-ఎండీఎస్ షెడ్యూల్ 2024 ప్రకారం ఆల్ ఇండియా కోటాతో పాటు, డీమ్డ్/కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు జూలై ఒకటో తేదీ నుంచి 19వ తేదీల మధ్య తొలి దశ, జూలై 22 నుంచి ఆగస్టు 8 తేదీల మధ్య రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆగస్టు 12 నుంచి 29 మధ్య మూడో దశ, సెప్టెంబర్ 2 నుంచి 7 తేదీల మధ్య స్ట్రే వేకెన్సీ కౌన్సెలింగ్ ఉంటుంది. మరోవైపు జూలై 10 నుంచి రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. తొలి దశ కౌన్సెలింగ్ 10 నుంచి 27వ తేదీ వరకూ, రెండో దశ జూలై 31 నుంచి ఆగస్టు 14వ తేదీ వరకూ ఉంటుంది. ఇక మూడో దశ కౌన్సెలింగ్ ఆగస్టు 21 నుంచి 31, స్ట్రే వెకెన్సీ సెప్టెంబర్ 5 నుంచి 10వ తేదీల మధ్య ఉండనున్నది.

చంద్రబాబుపై మరో పోరాటానికి సిద్ధం

పీవీ రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఎస్సీ వర్గీకరణ చేస్తానని కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు పూర్తి వ్యతిరేకమని పీవీ రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెండో అతి పెద్ద సామాజికవర్గంగా ఉన్న మాలలు మొదటి నుంచీ రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు ప్రయత్నాలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాలలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. వచ్చే నెలలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని అశోక్‌కుమార్ తెలిపారు.

సీపెట్ డిప్లొమా కోర్సుల్లో ప్రత్యేక ప్రవేశాలు

సాక్షి, అమరావతి: భారత ప్రభుత్వ విద్యా సంస్థ సీపెట్-విజయవాడలో 10వ తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మూడేళ్ల వ్యవధితో డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ వసతి, అర్హులైన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 78935 86494 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టీఎఫ్‌డీఐఈఈఎఫ్ కార్యాలయం ప్రారంభం

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): తెలుగు ఫిలిం అండ్ డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (టీఎఫ్‌డీఐఈఈఎఫ్) కార్యాలయం శుక్రవారం విజయవాడలోని గాంధీనగర్‌లో ప్రారంభమైంది. ఫెడరేషన్ కార్యాలయాన్ని టీఎఫ్‌డీఐఈఈఎఫ్ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వెల్లంకి శ్రీనివాసరావు, అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ ప్రారంభించారు. విజయవాడ ప్రధాన కేంద్రంగా విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి నగరాల్లోనూ కార్యకలాపాలు కొనసాగిస్తామన్నారు.

తక్షణమే తప్పుకోండి..

- వర్సిటీ వీసీలకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ అల్టిమేటం
- మంత్రి పీఏ నుంచి నేరుగా రిజిస్ట్రార్‌లకు ఫోన్ ద్వారా సమాచారం
- జేఎన్‌టీయూ (ఏ), ఎస్కేయూ, ఏయూ, కృష్ణా, ద్రవిడ వర్సిటీల వీసీలూ, రిజిస్ట్రార్లు రాజీనామా
- ప్రజా వ్యతిరేక టీడీపీ మార్క్ పాలన ప్రారంభమైందని విద్యావేత్తల ఆవేదన



అనంతపురం/విశాఖ సిటీ/గుడుపల్లె (చిత్తూరు జిల్లా)/కోనేరు సెంటర్ (మచిలీపట్నం) : అధికారంలోకి వచ్చిన క్షణం నుంచే కక్ష సాధింపు చర్యలకు తెగబడుతున్న టీడీపీ ప్రభుత్వం.. చివరకు సరస్వతీ నిలయాలైన విశ్వవిద్యాలయాలపైనా విరుచుకుపడుతోంది. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న వైస్ ఛాన్సలర్లు వెంటనే రాజీనామా చేసి వెళ్లిపోవాలని అల్టిమేటం జారీచేసింది. ఈ మేరకు ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పీఏ నుంచి రిజిస్ట్రార్‌లకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయా పదవులకు వీసీలు, రిజిస్ట్రార్‌లు రాజీనామా చేసి వెళ్లిపోవాలని చెప్పారు.

అధికారికం కాదులే అని ఆగినా..

లోకేశ్ పీఏ పేరుతో ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోదని వీసీలు తొలుత భావించారు. అదే నిజమైతే అధికారికంగా ఉత్తర్వులు ఇస్తారు కదా అని అనుకున్నారు. ఎవరో ప్రాంక్ కాల్‌చేసి ఉండవచ్చని వీసీలు మిన్నకుండిపోయారు. దీంతో నేరుగా వైస్‌ఛాన్సలర్ల వాట్సాప్ గ్రూపులో అధికారికంగా మెసేజ్ పెట్టారు. తక్షణమే వీసీలు, రిజిస్ట్రార్‌లు తప్పుకోవాలని అందులో ఆదేశించారు. ఈ నేపథ్యంలో.. జేఎన్‌టీయూ (ఏ), ఎస్కేయూ వీసీలు, రిజిస్ట్రార్‌లు తమ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో..

- జేఎన్‌టీయూ (ఏ) వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు గురువారం సాయంత్రమే తన పదవికి రాజీనామా చేశారు. రిజిస్ట్రార్ ప్రొ. సి.శశిధర్ సైతం రిలీవ్ అయ్యారు. దీంతో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణను నియమించిన వీసీ శ్రీనివాసరావు.. అనంతరం తన రాజీనామా పత్రాన్ని ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపారు.
- అలాగే, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. హుస్సేన్‌రెడ్డి కూడా శుక్రవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య మాత్రం పదవిలో కొనసాగేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.
- ద్రవిడ వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి కూడా శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలు రాజీనామా చేస్తున్నారు కాబట్టి మీరు కూడా రాజీనామా చేయాలని శుక్రవారం ఉదయం ఎవరో ఫోన్ ద్వారా ఆమెను ఒత్తిడి చేశారని సమాచారం. రాజీనామా చేయకపోతే వచ్చే సోమవారం ద్రవిడ వర్సిటీలో ఆందోళన చేస్తామని వీసీని హెచ్చరించారని తెలిసింది. దీంతో ఆమె శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామా చేసి, రాజీనామా పత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా గవర్నరుకు పంపించారు. సాయంత్రమే ద్రవిడ వర్సిటీ వదిలి వెళ్లిపోయారు.
- అలాగే, కృష్ణా యూనివర్సిటీ వీసీ జి. జ్ఞానమణి సైతం శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. పైనుంచి వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గి ఆయన తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.


జ్ఞానమణి


మధుజ్యోతి


ప్రసాదరెడ్డి


స్టీఫెన్

అప్పటికీ, ఇప్పటికీ అదే తేడా..

నిజానికి.. జేఎన్‌టీయూ (ఏ)లో అప్పటి వీసీ ప్రొ. శ్రీనివాస్‌కుమార్ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నియమితులయ్యారు. 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినా.. శ్రీనివాస్‌కుమార్‌ను వీసీగానే కొనసాగించారు. ఎవరూ రాజీనామా చేయాలని కోరలేదు. ఏపీపీఎస్సీ చైర్మన్‌గా ఉదయ్‌భాస్కర్ కూడా 2015లో నియమితులైనా.. ఆరేళ్లపాటు చైర్మన్ పదవీ కాలం పూర్తయ్యే వరకు ఆయన పదవిలో కొనసాగారు. కానీ, టీడీపీ ప్రభుత్వం మాత్రం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకంగా వైస్‌ఛాన్సలర్లనే తప్పుకోమనే సంస్కృతికి తెరతీసింది. ప్రజా వ్యతిరేక పాలనను టీడీపీ ప్రభుత్వం తన మార్క్‌గా చూపించేందుకు ఇదే నిదర్శనమని విద్యావేత్తలు భావిస్తున్నారు.

పదవి కోసం వైఎస్సార్ విగ్రహం తాకట్టు..

ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎందరో జీవితాలకు బాటలు వేసిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఈ ఏడాది ఆరంభంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఏర్పాటుచేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన మూడో రోజే విగ్రహాన్ని తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ నేతలు, టీడీపీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. విగ్రహం తొలగిస్తే మీరు పదవుల్లో కొనసాగుతారని వీసీ, రిజిస్ట్రార్‌లను హెచ్చరించారు. దీంతో వారు 24 గంటల్లో వైఎస్సార్ విగ్రహాన్ని అధికారికంగా తొలగించారు. అయినప్పటికీ వారిని ఇంటికి పంపేందుకు ఏర్పాట్లుచేయడం గమనార్హం. ఇదిలా ఉంటే.. జేఎన్‌టీయూ (ఏ)లో అధునాతనంగా నిర్మించిన ఆడిటోరియానికి ఎన్టీఆర్ పేరు పెట్టారు. అక్కడే ఎన్టీఆర్ విగ్రహాన్ని సైతం ఏర్పాటుచేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ ఎన్టీఆర్ విగ్రహం ఔన్నత్యాన్ని కాపాడారు. కానీ, టీడీపీ మాత్రం ఎస్కేయూలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించడాన్ని అందరూ తప్పుపడుతున్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా

విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొ. పీవీజీడీ ప్రసాదరెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. లేఖను గవర్నర్ కార్యాలయానికి పంపించారు. ఆయనతో పాటు రిజిస్ట్రార్ స్టీఫెన్ కూడా తన పదవి నుంచి వైదొలిగారు. వెంటనే ఆయన రాజీనామాకు ఆమోదం తెలిపారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ఏయూ అకడమిక్ డీన్‌గా ఉన్న ప్రొ.కిషోర్‌బాబును నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వాస్తవానికి.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రసాదరెడ్డికి బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఒకవైపు స్థానిక టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు ప్రసాదరెడ్డిపై రాజకీయ ఆరోపణలు ఎక్కుపెట్టగా.. మరోవైపు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నుంచి ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి ఫోన్లుచేసి రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారు. రాజీనామా చెయ్యకపోతే దాడులకు తెగబడతామని పార్టీ శ్రేణులు సైతం హెచ్చరించాయి. దీనిపై ఆయన మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెదిరింపులకు పాల్పడింది హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినప్పటికీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే, ఏయూలోని వీసీ కార్యాలయం వద్ద నిత్యం నిరసనల పేరుతో టీడీపీ నేతలు, కార్యకర్తలు హడావుడి చేస్తూనే ఉన్నారు. పలుమార్లు వీసీని అడ్డుకోడానికి ప్రయత్నించారు.

ప్యాకేజీలు వద్దు.. హోదానే ఇవ్వాలి

- ప్యాకేజీల వల్ల పరిశ్రమలు రావు.. ఉపాధి అవకాశాలుండవు
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు డిమాండ్
- సభ దృష్టికి ఎన్నికల ఫలితాల అనంతరం ఏపీలో దాడి ఘటనలు



సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీలు వద్దని, ప్రత్యేక హోదానే ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్యాకేజీల వల్ల రాష్ట్రానికి పరిశ్రమలు రావని, యువతకు ఉపాధి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శుక్రవారం రాజ్యసభలో జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ తరపున బాబూ రావు ప్రసంగించారు. ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న సీఎం చంద్రబాబు ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేయాలని అన్నారు. విభజన తర్వాత వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ నుంచి సభకు ఎంపికైన తొలి దళిత సభ్యుడైనందుకు గర్వంగా ఉందన్నారు.

రాష్ట్రంలో దాడులను అరికట్టాలి

ఎన్నికల ఫలితాల అనంతరం ఆంధ్రప్రదేశ్ అంతటా దాడులు జరుగుతున్నాయని ఎంపీ బాబూరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దాడులను ప్రోత్సహిస్తోందని, కేంద్ర హోం మంత్రి జోక్యం చేసుకొని దాడులను ఆపాలని కోరారు.

పోలవరంపై నిర్లక్ష్యం తగదు

జాతీయ హోదా ప్రాజెక్టు అయిన పోలవరంని కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలని బాబూరావు చెప్పారు. కేవలం ప్యాకేజీల కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతలు తీసుకొని ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, రైల్వే జోన్ పదేళ్లుగా కాగితాలపైనే ఉందని, వీటన్నింటినీ పరిష్కరించకపోతే రాష్ట్రం చాలా నష్టపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

విజయవాడలో ప్రేమోన్మాది ఘాతుకం

- ప్రేమించానంటూ ఓ యువతికి వేధింపులు
- మందలించిన యువతి తండ్రిపై కక్ష
- ఆమె కళ్లెదుటే ఆమె తండ్రిని కిరాతకంగా హతమార్చిన యువకుడు
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు?

కృష్ణలంక (విజయవాడ తూర్పు): విజయవాడ నగరంలో ఓ ప్రేమోన్మాది కిరాతకానికి ఒడిగట్టాడు. ప్రేమించానంటూ ఓ యువతి వెంట పడటమే కాకుండా, ఆ యువతి ముందే ఆమె తండ్రిని అతి దారుణంగా హత్య చేశాడు. గురువారం రాత్రి నగరంలోని బృందావన్ కాలనీలో ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన కంకిపాటి శ్రీరామ్‌ప్రసాద్ (56) లబ్బీపేట బృందావన్ కాలనీ, సింధు భవన్ రోడ్డులో అశ్విని అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో శ్రీ వంశీ జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్నాడు. ఆయన పెద్ద కుమార్తె బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. ఆమె ఇంటర్మీడియట్ చదివే సమయంలో ఓ స్నేహితురాలి ద్వారా భవానీపురం గుప్తా సెంటర్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గడ్డం శివమణికంఠ (29) పరిచయమయ్యాడు. కొన్నాళ్ల తర్వాత తనను ప్రేమించాలని, లేదంటే నీ సంగతి చూస్తానంటూ మణికంఠ ఆ యువతిని వేధించడం ప్రారంభించాడు. అతని వేధింపులు భరించలేక ఆ యువతి బాధపడుతుండేది. అది గమనించిన తల్లిదండ్రులు కుమార్తెను అడగ్గా విషయమంతా చెప్పింది. దీంతో శ్రీరామ్‌ప్రసాద్ పొరుగింటి వారితో కలిసి మణికంఠ ఇంటికి వెళ్లి అతని తల్లితో మాట్లాడి, తన కుమార్తె జోలికి రావద్దని మణికంఠను హెచ్చరించాడు. దీంతో ఆయనపై మణికంఠ పగ పెంచుకున్నాడు. ఆయన్ని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు.



నిందితుడు శివమణికంఠ (ఫైల్)

రోడ్డుపైనే అతి కిరాతకంగా

యథావిధిగా గురువారం ఉదయం శ్రీరామ్‌ప్రసాద్ షాప్‌కు వెళ్లాడు. ఆయన కుమార్తె మధ్యాహ్నం భోజనం తీసుకువచ్చింది. రాత్రి షాపు మూసి ఇద్దరూ ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరారు. అప్పటికే అక్కడ మాటు వేసిన మణికంఠ బైక్‌తో వారిని ఢీకొట్టాడు. వారిద్దరూ కింద పడిపోగానే మణికంఠ తన వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో రోడ్డుపైనే రామ్‌ప్రసాద్‌పై విరుచుకుపడ్డాడు. ముఖం, తల, మెడ, ఇతర శరీర భాగాలపై విచక్షణ రహితంగా పొడిచాడు. ఆయన కుమార్తె బిగ్గరగా ఏడుస్తూ మణికంఠను అడ్డుకోబోగా, ఆమెను కూడా పొడిచాడు. ఈ దాడిని గమనించిన స్థానికులు అక్కడికి చేరుకోవడంతో మణికంఠ పరారయ్యాడు. తీవ్ర గాయాలతో ఉన్న రామ్‌ప్రసాద్‌ను స్థానికులు హుటాహుటిన సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రామ్‌ప్రసాద్ కుమార్తె ఫిర్యాదు మేరకు మణికంఠపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం రాత్రే మణికంఠ పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. కాగా, యువతి, ఆమె తండ్రిపై మణికంఠ విరుచుపడిన తీరు ను స్థానికులు సెల్‌ఫోన్‌లలో తీసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

మాకున్న భద్రత కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వండి

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి పిటిషన్లు





సాక్షి, అమరావతి: మంత్రిగా ఉన్నప్పుడు తనకు కల్పించిన 5+5 భద్రతను యథాతథంగా కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే తనకున్న 4+4 భద్రతను కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కూడా పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు.. రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డికి భద్రత కల్పన విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను వచ్చే నెల 8కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎందుకు ఉపసంహరించారో చెప్పడం లేదు...

మంత్రిగా ఉన్నప్పుడు తనకు 5+5 భద్రత ఉండేదని, ఇప్పుడు 2+2 భద్రత సిబ్బందిని కూడా పంపడంలేదని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ పెద్దిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ చక్రవర్తి శుక్రవారం విచారణ జరిపారు. పెద్దిరెడ్డి తరపున న్యాయవాది గుడిసేవ నరసింహారావు వాదనలు వినిపిస్తూ, ప్రాణహాని ఉన్న నేపథ్యంలో రామచంద్రారెడ్డికి గతంలో ఉన్న భద్రతను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు ఉన్న భద్రతను ఏకపక్షంగా ఉపసంహరించారని, ఎందుకో కూడా చెప్పడం లేదన్నారు. ఉపసంహరణ ఉత్తర్వులూ ఇవ్వలేదన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. మంత్రి హోదాలో 5+5 ఇచ్చారని, ఇప్పుడు ఆయన మంత్రి కాదు కదా అని ప్రశ్నించారు. భద్రత విషయంలో ఉన్న నియమ, నిబంధనలు ఏమిటని రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ఎవరెవరికి ఏ రకమైన భద్రత కల్పించాలో 1997లో జారీ చేసిన జీవో 655లోని మార్గదర్శకాల ప్రకారమే భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. మంత్రిగా ఉన్నప్పుడు రామచంద్రారెడ్డికి 5+5 భద్రత కల్పించామని, ఇప్పుడు ఆయన మంత్రి కాదని, ఎమ్మెల్యేనే అయినందున ఆ మేరకు భద్రత కల్పిస్తామన్నారు. భద్రతపై నిర్ణయం తీసుకోవాల్సింది సెక్యూరిటీ రివ్యూ కమిటీయేనన్నారు. గతంలో ఆయనకు మంత్రి హోదాలోనే 5+5 ఇచ్చారే తప్ప, ప్రాణహాని, భద్రత కారణాలతో కాదన్నారు. ప్రాణహాని ఉందని అనుకుంటే అదనపు భద్రత కోసం జిల్లా ఎస్పీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రామచంద్రారెడ్డి స్పీకి దరఖాస్తు చేసుకున్నారని, అయితే అదనపు భద్రత అవసరం లేదని ఎస్పీ తేల్చారన్నారు. భద్రతపై సెక్యూరిటీ రివ్యూ కమిటీ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉందని, అప్పటివరకు వేచి చూడాలని దమ్మాలపాటి తెలిపారు. దీంతో న్యాయమూర్తి ఈ వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. అప్పటి వరకు 5+5 భద్రత కొనసాగించేలా ఆదేశాలివ్వాలని నరసింహారావు కోరారు. మిథున్‌రెడ్డికి సైతం గతంలో ఉన్న భద్రతను కొనసాగించడంలేదని తెలిపారు. ఆయనకు ప్రాణహాని ఉందన్నారు. తగినంత భద్రత లేకపోవడం వల్ల కొన్ని గ్రామాల్లోకి వెళ్లలేకపోతున్నారని తెలిపారు. ఈ విషయంలోనూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు.

ఐదేళ్లు... 65 పేపర్ల లీకులు

2019-24 మధ్య దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాల లీకేజీ

- మొదటి రెండు స్థానాల్లో యూపీ, బిహార్
- పరీక్షల నిర్వహణలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సూపర్
- ఎకడ్బందీగా నిర్వహణతో ఒక్కసారి కూడా ఏ పేపరూ లీక్ కాలేదు

సాక్షి, అమరావతి : దేశంలో ప్రశ్నపత్రాల లీకులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై దేశవ్యాప్తంగా ఆందోళనలు.. దానిపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించిన నేపథ్యంలో ఇప్పుడు ప్రశ్నపత్రాల లీకేజీ అంశాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలు.. వైద్య, ఇంజినీరింగ్ తదితర కోర్సుల్లో చేరేందుకు ప్రవేశపరీక్షలు, వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాలు లీకుకావడం అంతకంతకూ పెరుగుతోంది. ప్రధానంగా 2019 నుంచి 2024 వరకు ప్రశ్నపత్రాలు లీకులు అమాంతంగా పెరిగాయి. ఈ ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లో ఏకంగా 65 రకాల పరీక్షల ప్రశ్నపత్రాలు లీకుకావడం గమనార్హం.

గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా ప్రశ్నపత్రాల లీకుల వివరాలివీ..

- 2019-24 మధ్య దేశంలో పోటీ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, వార్షిక పరీక్షలకు సంబంధించి 65 ప్రశ్నపత్రాలు లీకయ్యాయి. వాటిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వాటిలో సైన్యంలో నియామకాల కోసం నిర్వహించిన ఆర్మీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్-2021, ఉపాధ్యాయుల నియామకం కోసం నిర్వహించిన సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటీఈటీ)-2023, నీట్-యూజీ-2021, జాయింట్ ఎంటన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2021 ప్రధానమైవి.
- ప్రశ్నపత్రాలు లీకైన వాటిలో 45 పరీక్షలు ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు 45 ఉన్నాయి. మొత్తం మూడు లక్షల ఉద్యోగాల భర్తీకోసం ఆ పరీక్షలు నిర్వహించారు. వాటిలో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో టీచర్ల నియామక పోటీ పరీక్షలు, అసోం, రాజస్థాన్, కర్ణాటక, జమ్మూ-కశ్మీర్‌లలో పోలీసు నియామక పరీక్షలు, ఉత్తరాఖండ్ అటవీ శాఖలో ఉద్యోగాల భర్తీ పరీక్ష, తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్‌లలో జూనియర్ ఇంజినీర్ పోస్టుల భర్తీ పరీక్షలు మొదలైనవి ఉన్నాయి.
- ఇక ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలకు కోసం నిర్వహించిన 17 ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాలూ లీకయ్యాయి.
- మొత్తం మీద గత ఐదేళ్లలో ఇలా 65 రకాల ప్రశ్నపత్రాలు లీక్ కాగా.. వాటిలో 27 పరీక్షలను రద్దుచేయడంగానీ వాయిదా వేయడంగానీ చేశారు.
- అలాగే, గత ఐదేళ్లలో 19 రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలు లీకయ్యాయి. మొదటి రెండు స్థానాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్ ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎనిమిది ప్రశ్నపత్రాలు, బిహార్‌లో ఆరు లీకయ్యాయి. గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో నాలుగు చొప్పున.. హరియాణా, కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లలో మూడేసి ప్రశ్నాపత్రాలు.. తెలంగాణ, ఢిల్లీ, మణిపూర్‌లలో రెండేసి ప్రశ్నపత్రాలు లీక్ కాగా.. జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్‌లలో ఒక్కో ప్రశ్నపత్రం లీకైంది.

శభాష్ ఏపీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఘనత ఇదీ..

2019-24 మధ్య కాలంలో పోటీ పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా విఫలమైనప్పటికీ ఏపీకు మాత్రం ఆ మరక అంటలేదు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల కోసం నిర్వహించిన పోటీ పరీక్షలు, ఉన్నత విద్యా సంస్థల్లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశపరీక్షలను పకడ్బందీగా నిర్వహించింది. ఏకంగా ఒకేసారి 1.50 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామక పరీక్ష, 6,500 మంది పోలీసుల నియామక పరీక్ష, గ్రూప్-1, గ్రూప్-2 తదితర ప్రవేశ పరీక్షలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించింది.

సిద్దార్థ కళాశాల సీట్లన్నీ ఏపీవారికే కేటాయించాలి

వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ వీసీకి వినతి

సాక్షి, అమరావతి/గుంటూరు మెడికల్: విజయవాడ సిద్దార్థ వైద్య కళాశాలలోని ఎంబీబీఎస్ సీట్లన్నీ ఏపీ విద్యార్థులకే కేటాయించాలని కోరుతూ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బాబ్జీకి ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కోశాధికారి నరసింహారావు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర విభజన తర్వాత పదేళ్ల వరకూ తెలంగాణ విద్యార్థులకు 36 శాతం సీట్లు కేటాయించాలని చట్టంలో ఉందన్నారు. పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆ 36 శాతం సీట్లు కూడా మన విద్యార్థులకే కేటాయించాలని కోరారు. అదే విధంగా కొత్త వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల విధానాన్ని రద్దు చేయాలని కోరా రు. తాము అధికారంలోకి వస్తే సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని టీడీపీ ఎన్నికల వాగ్దానం చేసిందని పేర్కొన్నారు.

11న ట్రిపుల్ ఐటీ ఎంపిక జాబితా

అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకా కుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో 20 24-25కు సంబంధించిన ఎంపిక జా బితాను జూలై 11న విడుదల చేయనున్నట్టు ఆర్జీయూకేటీ అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రిపుల్ ఐటీలకు 53,863 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఎంపిక జాబితాను క్యాంపస్‌ల వారీగా విడుదల చేస్తామని తెలిపారు. ఏ క్యాంపస్‌లో సీటు వస్తే అక్కడే చేరాలని, క్యాంపస్‌ల మార్పు అనేది ఉండదని స్పష్టం చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

సామూహిక వివాహాలతో పేదలకు మేలు



వధూవరులకు తాళిబొట్లు అందిస్తున్న మునిస్వామి, సుశీల దంపతులు

బళ్లారిఅర్బన్: సామూహిక వివాహాలతో పేదలకు ఎంతో మేలని కర్ణాటక రక్షణ యువ వేదిక జిల్లా అధ్యక్షుడు మునిస్వామి తెలిపారు. సమీపంలోని సిరివార అమరేశ్వర దేవస్థానంలో ప్రతి ఏడాదిలా ఈసారి కూడా వేదిక నేతృత్వంలో 21 జంటలకు ఉచిత సామూహిక వివాహాలను ఘనంగా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ వేదిక ఆధ్వర్యంలో గత 18 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు 921 జంటలకు వివాహాలు జరిపించామన్నారు. తన తండ్రి దివంగత రామచంద్రరావు ఆశయం మేరకు ఈ సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నానన్నారు. తన ఊపిరి ఉన్నంత వరకు తన భార్య సుశీలతో కలిసి ఈ సంకల్పం నిరంతరం కొనసాగిస్తానన్నారు.

కార్యవర్గం ఎంపిక



ఎంపికైన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

గంగావతి రూరల్: భత్తదనాడు గంగావతి లయన్స్ క్లబ్‌కు నూతన అధ్యక్షుడుగా శ్రీరామనగర్ కె.సుబ్రహ్మణ్యేశ్వరరావుతోపాటు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్ర సిరిగేరి, ట్రెజరర్‌గా ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ మల్లనగౌడ హెచ్, శ్రీకాంత్ ఎం, సతీష్ వి.బోజెనెట్టర్‌తోపాటు లయన్స్ సభ్యులను ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మానవతా, సేవా దృక్పథంతో క్లబ్ సభ్యులందరూ పని చేయాలని కోరారు. లయన్స్ క్లబ్ అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు చంద్రప్ప, సోమరాజ్, మాధవ్ శెట్టి, లయన్స్ సీనియర్ సభ్యులు రామారావు, ఎం.వెంకటరత్నం, 5 గ్యారెంటీల జిల్లా అమలు సమితి అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, హులిహైదర్ జెడ్పీ నాయకుడు రమేశ్ నాయక్, ఆర్.వి.సత్యనారాయణ, కల్లుడి ప్రసాద్ వట్టికూటి, ముస్తూరు చిన్నా, సాంబమూర్తి, శ్రీరామనగర్ సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ ఫెస్ట్ విజయవంతం

హుబ్లీ: కేఎల్‌ఈ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అండ్ రీసర్చ్ కళాశాలలో రాష్ట్రస్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్- 2024 శుక్రవారం విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హెస్కాం జనరల్ మేనేజర్ డాక్టర్ సిద్దు ఉల్లోలి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. లక్ష్యం లేని శ్రమ కాలహరణం, లక్ష్యంతో కూడిన శ్రమ విజయానికి సోపానం అని ఆయన విద్యార్థులకు హితవు చెప్పారు. సంస్థ డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఓటమి గెలుపునకు మెట్టు అని, అందువల్ల గెలుపు ఓటమిపై చింతించకుండా పాల్గొనాలని విద్యార్థులు సలహా ఇచ్చారు. కుమార్ మోటార్స్ సేల్స్ విభాగం హుబ్లీ ముఖ్యస్తులు యశ్వంత్ షాన్‌బాగ్, డాక్టర్ అమిత్ అంగడి, ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ శెట్టి, విద్యార్థి శాంభవి తదితరులు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తూ ప్రైవేట్ క్లినిక్‌ల మూత



మూతపడిన దుకాణాలు, క్లినిక్‌లు

రాయచూరు రూరల్: వారం రోజుల క్రితం నగరంలోని ఆజాద్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రోగి మరణించడంతో ఆయన తరఫున బంధువులు ఆస్పత్రి వైద్యుడిపై దాడి చేసిన సంగతి విదితమే. దాడిని నిరసిస్తూ నగర వ్యాప్తంగా సుమారు వంద ప్రైవేట్ ఆస్పత్రులు, 250 మందుల దుకాణాలు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడింది. రోజు 500 మంది రోగులు వస్తుండగా నేడు 1000 మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందారు.

కేంద్ర మంత్రితో ఎంపీ భేటీ



కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ కుమార నాయక్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో ఉక్కు పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపట్టాలని రాయచూరు లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్ కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖా మంత్రి భూపతిరాజుకు విన్నవించారు. గురువారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఆయన మాట్లాడారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లో ఉక్కు పరిశ్రమల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

అవినీతిపై కదం తొక్కిన బీజేపీ

- కీలక సూత్రధారి ఎవరో తేల్చాలని ఒత్తిడి
- కాంగ్రెస్ సర్కార్‌పై కమలనాథులు నిప్పులు
- సీబీఐ దర్యాప్తుకు అప్పగించాలని డిమాండ్
- శ్రీరాములు ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ



బళ్లారిలో చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న నాయకులు



బళ్లారిలో అండర్‌బ్రిడ్జి గుండా సాగిన కార్యకర్తల ర్యాలీ

సాక్షి,బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో చోటు చేసుకున్న రూ.187 కోట్ల అవినీతిలో కింగ్‌పిన్ ఎవరో తేల్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ కేసులో నిజాలు పూర్తిగా బయటకు రావడం లేదని, సిట్ అధికారుల దర్యాప్తుతో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేవన్నారు. నగరంలోని కనక దుర్గమ్మ ఆలయం నుంచి బీజేపీ కార్యకర్తలు, నేతలు ప్లకార్డులు పట్టుకుని జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీజేపీ కార్యకర్తలతో నగరం కాషాయమయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రాన్ని లూటీ చేస్తోందని ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున జనం చేరడంతో పోలీసు బలగాలను మోహరించి జిల్లాధికారి కార్యాలయం వద్ద బ్యారికేడ్లను ఏర్పాటు చేసి నేతలను, కార్యకర్తలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

సీఎం రాజీనామా చేయాలి–శ్రీరాములు

అనంతరం మాజీ మంత్రి శ్రీరాములు మాట్లాడుతూ వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతికి నైతిక బాధ్యత వహించి సీఎం సిద్దరామయ్య తన పదవికి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి నాగేంద్ర రాజీనామాతోనే సరిపోదని పెద్ద చేపలు అందరూ కూడా బయట పడాలన్నారు. పేదల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను అప్పనంగా కాజేయడం కంచే చేను మేసిన చందంగా ఉందని మండిపడ్డారు. సిట్ ద్వారా ఈ కేసులో పురోగతి లేదని, సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలన్నారు. సీఎం రాజీనామా చేయకపోతే దశల వారీగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్, మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్పొరేటర్లు గోవిందరాజులు, శ్రీనివాస్ మోత్కూరు, హనుమంతు, సురేఖ, బీజేపీ నాయకులు హెచ్.హనుమంతప్ప, గురులింగనగౌడ, మహిపాల్, మాజీ బుడా అధ్యక్షుడు పాలన్న తదితరులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం రాత్రి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అక్కడే కలెక్టరేట్ ఆవరణలోనే అహోరాత్రి ధర్నా కొనసాగించారు.

రాయచూరులో..

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అధికారులు ఆత్మహత్యలు చేసుకోవడానికి ప్రజాప్రతినిధులే కారణమని, మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అవినీతికి బాధ్యత వహించి గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ రాజీనామా చేయాలని బీజేపీ జిల్లాధ్యక్షుడు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం టిప్పు సుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనలో మాట్లాడారు. అవినీతిపై సీబీఐతో సమగ్ర విచారణ జరపాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.



రాయచూరులో ఆందోళన చేస్తున్న నేతలు

సజావుగా టెట్ నిర్వహణకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

హొసపేటె: విజయనగర జిల్లాలోని వివిధ పరీక్ష కేంద్రాల్లో కర్ణాటక టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)- 2024ను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు జిల్లాధికారి అనురాధ తెలిపారు. జిల్లా పరిపాలన భవన్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కర్ణాటక ఉపాధ్యాయ అర్హత పరీక్ష సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. కర్ణాటక ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ గతంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా జిల్లాలో ఈ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రద్ధ, పట్టుదలతో చదివిన ఏ విద్యార్థికైనా పరీక్షల్లో అన్యాయం జరగకూడదన్నారు. పరీక్షల నిర్వహణకు కేటాయించిన అధికారులు, సిబ్బంది సామాజిక స్పృహతో వ్యవహరించాలన్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా 15 పరీక్ష కేంద్రాల చుట్టు పక్కల 200 మీటర్ల ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా ప్రకటిస్తూ జిల్లాధికారి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

పశు వైద్యులను నియమించరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న వీరేష్

రాయచూరు రూరల్: జిల్లాలో పలు ప్రాంతాల్లో పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న వైద్యుల ఉద్యోగాలను భర్తీ చేయాలని కరవే డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద రాష్ట్ర పశు సంవర్ధక, పట్టు పరిశ్రమల శాఖా మంత్రి వెంకటేష్‌కు వినతిపత్రం సమర్పించిన జిల్లాధ్యక్షుడు వీరేష్ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ఎద్దులకు గాలి కుంటు వ్యాధి, సొప్ప రోగాలు వ్యాపించే అవకాశాలున్నాయని, వాటిని నివారించడానికి పశు వైద్యులను నియమించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

కట్టడ కార్మికుల ఆందోళన



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కట్టడ కార్మికులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఒత్తిడి చేస్తూ సీఐటీయూ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు శరణ బసవ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిజమైన కట్టడ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, సాంఘిక భద్రత కల్పించాలన్నారు. అసంఘటిత వలయ కార్మికులకు ఉన్న భద్రత సంఘటిత కార్మికులకు కేటాయించి జీవనోపాధికి ఉద్యోగాలు కేటాయించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

క-కలో పట్టు సాగు విస్తీర్ణం పెంచండి



మాట్లాడుతున్న మంత్రి వెంకటేష్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో పట్టు పంట సాగు విస్తీర్ణాన్ని పెంచాలని రాష్ట్ర పశు సంవర్ధక, పట్టు పరిశ్రమల శాఖా మంత్రి వెంకటేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా పంచాయతీ సభాభవనంలో జరిగిన ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, పట్టు పరిశ్రమల శాఖల మధ్య సమన్వయం కొరత ఉందన్నారు. కలబుర్గి డివిజన్‌లోని ఆరు జిల్లాల్లో 6250 ఎకరాల్లో పట్టు పంటను పండించడాన్ని తప్పుబట్టారు. విజయనగర జిల్లాలో మూడు వేల ఎకరాల్లో పట్టు పంటను పండిస్తున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని మిగతా జిల్లాల్లో కూడా విస్తరించే దిశలో రైతులను చైతన్యపరచాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నామన్నారు. సెప్టెంబర్‌లోగా పశువులకు టీకాలు, వ్యాక్సిన్‌లు వేయాలన్నారు. అక్టోబర్ నుంచి పశువుల సర్వే పనులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్, అదనపు జిల్లాధికారి దురుగేష్, అధికారులున్నారు.

సీఎం మార్పుపై స్వామీజీల వ్యాఖ్యలు తగదు: రాష్ట్రంలో ముఖ్యమంత్రిని మార్పు చేయాలని వివిధ మఠాలకు చెందిన స్వామీజీలు వ్యాఖ్యానించడం తగదని మంత్రి వెంకటేష్ పేర్కొన్నారు. జెడ్పీ సభాభవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం పదవిని వక్కలిగులకు అప్పగించాలని స్వామీజీలు ముఖ్యమంత్రి సిద్దరామయ్యని కోరారన్నారు. గోవధ నిషేధం విషయంలో సర్కార్ ముందు ఎలాంటి ప్రతిపాదనలు లేవన్నారు. మూడు ఉప ముఖ్యమంత్రి పదవుల విషయంపై పార్టీ అధిష్టానం పునరాలోచిస్తుందన్నారు.

ఉపాధ్యాయ సమస్యల్ని పరిష్కరిస్తాం



ఎమ్మెల్సీ డీటీ శ్రీనివాస్‌ను సత్కరించిన దృశ్యం

కోలారు: ఉపాధ్యాయ సమస్యలన్నింటిని దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ డీటీ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి నూతనంగా ఎన్నికైన ఆయనను శ్రీనివాసపురం ఉపాధ్యాయ బృందం సభ్యులు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ 7వ వేతన సంఘం కమిషన్ నివేదిక అమలులోకి తెస్తామన్నారు. ఎన్‌పీఎస్ రద్దు గురించి ఎన్నికల ప్రణాళికలోనే చెప్పామన్నారు. దీనిని అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జేఓసీ సమస్యలు, ఉపాధ్యాయుల వేతన తారతమ్యం, పదోన్నతి, అన్ ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల సేవా భద్రత తదితర అనేక సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

బెళగావి-ధార్వాడ కొత్త రైలు మార్గం నిర్మించండి

- కేంద్ర రైల్వే మంత్రికి బెళగావి లోక్‌సభ సభ్యుడు జగదీశ్ శెట్టర్ వినతి

హుబ్లీ: బెళగావి-కిత్తూరు-ధార్వాడ కొత్త రైలు మార్గ పథకాన్ని త్వరగా ప్రారంభించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు బెళగావి ఎంపీ, మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ విజ్ఞప్తి చేశారు. ఆయన ఈ మేరకు శుక్రవారం న్యూఢిల్లీలో రైల్వే మంత్రిని కలిసి కొత్త రైలు మార్గ పథకంపై సమగ్రంగా చర్చించారు. రెండేళ్ల క్రితమే భూస్వాధీనం కోసం ప్రతిపాదనను సమర్పించిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి భూమిని రైల్వే శాఖకు అప్పగించలేదన్నారు. బెళగావి-కిత్తూరు-ధార్వాడ కొత్త రైలు మార్గం పథకం చాలా అవసరం అన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అనుకూలం అయ్యేలా చేయాలని నైరుతి రైల్వే శాఖకు అవసరమైన భూమిని తక్షణమే అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొనేలా సూచించాలని రైల్వే మంత్రికి వివరించారు. బెళగావిలో తిరిగి ప్రారంభించిన కొత్త రైల్వే స్టేషన్ అన్ని విధాలుగా వసతులను కలిగి ఉంది. బెళగావి లోక్‌సభ నియోజకవర్గ నివాసుల డిమాండ్ మేరకు ఈ కొత్త రైలు మార్గాన్ని నిర్మించాలని ఆయన కోరారు. అలాగే బెళగావి-బెంగళూరు-బెళగావి వందే భారత్ ఎక్స్‌ప్రెస్, బెళగావి-పుణె వందేభారత్ ఎక్స్‌ప్రెస్, బెళగావి-అయోధ్య-బెళగావి, బెళగావి-పండరాపుర-బెళగావి, బెళగావిలో నివసించే కేరళ మలయాళీ ప్రజల అనుకూలం కోసం హుబ్లీ- కొచ్చివెలి-హుబ్లీ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను బెళగావి వరకు పొడిగించాలని శెట్టర్ రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఆస్పత్రిలో రోగులు ఫుల్.. వైద్యసేవలు నిల్



ఉడుంగల్ ఖానాపూర్‌లోని పీహెచ్‌సీ



మందులు ఇస్తున్న స్టాఫ్ నర్స్ రత్న



రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రి



గైర్హాజరును చూపుతున్న అటెండెన్స్ బుక్

- 24 గ్రామాల ప్రజలకు అందని వైద్యం
- వైద్యులు, సిబ్బంది విధులకు డుమ్మా

రాయచూరు రూరల్: వైద్యో నారాయణో హరి అంటూ రోగులు సర్కారీ ఆస్పత్రులకు వెళితే వారికి వైద్యం, ఆరోగ్యం లభించడం మేడిపండు చందంగా మారింది. రాయచూరు నుంచి 15 కి. మీ.దూరంలో ఉడుంగల్ ఖానాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అందులో వైద్యులు, సిబ్బంది పూర్తి స్థాయిలో ఉంది. అయితే విధులు మాత్రం ఇద్దరే నిర్వహిస్తున్నారు. 24 గ్రామాల ప్రజలకు వైద్య, ఆరోగ్య సౌకర్యాలు కల్పించాల్సిన వైద్యులు, సిబ్బంది వేళకు విధులకు రాకుండా డుమ్మా కొడుతున్నారు. వానాకాలంలో మలేరియా, డెంగీ, అతిసార ప్రబలే అవకాశమున్న తరుణంలో వైద్యులు తమకేమీ పట్టనట్లు స్వంత పనుల్లో మునిగారు. ఉడుంగల్ ఖానాపూర్ ఆస్పత్రిలో 19 మంది ఉండగా ఆరుగురు ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 10 మంది స్వంత పనుల్లో జిల్లా కేంద్రంలో ఉంటారు. 15 మంది వైద్యులు విధులకు గైర్హాజరయ్యారు. రోగులు ప్రతినిత్యం సుమారు 40 మందికి పైగా ఆస్పత్రికి వస్తున్నారు. రోగులకు నేటి వరకు డాక్టర్ ఎవరో తెలియదని గ్రామస్థులు వాపోయారు.

మేయర్ పీఠం అధిష్టించేది ఎవరో?

- అభ్యర్థిత్వం తేలేది నేడే
- సీనియార్టీకి ప్రాధాన్యత

హుబ్లీ: రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన హుబ్లీ-ధార్వాడ నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు సంబంధించి శనివారం ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ రెండు పదవులకు తగినంత మెజార్టీ కలిగిన బీజేపీలో తీవ్ర పోటీ నెలకొనగా సీనియార్టీతో పాటు మొదటి హామీ ఇచ్చినట్లుగా పాలకులను ఆ పార్టీ ఎన్నుకోనుంది. ఈ మేరకు 37వ వార్డు కార్పొరేటర్ ఉమేష్ కౌజగేరి, 43వ వార్డు కార్పొరేటర్ బీరప్ప కండేకర్ పేర్లు జోరుగా వినిపిస్తున్నాయి. ధార్వాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 30వ వార్డు కార్పొరేటర్ రామన్న బడిగేరకు కూడా మేయర్ పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లుగా బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. నాలుగో సారి పాలికెలో అడుగు పెట్టిన రామన్న బడిగేరకు గతంలో రెండు సార్లు ఈ పదవి వచ్చినట్లే వచ్చి జారిపోయిందని చెబుతున్నారు. మూడు సార్లు కార్పొరేటర్‌గా ఎన్నికైన కండేకర్, అలాగే ఉణకల్ ప్రాంత కార్పొరేటర్ కౌజగేరి కూడా మేయర్‌గిరీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరో కార్పొరేటర్ తిప్పన్న మజ్జిగికి అన్ని అర్హతలు ఉన్నా బీజేపీ మహానగర అధ్యక్షుడిగా ఉన్నందు వల్ల ఆయన పేరును పరిగణించపోవచ్చని చెబుతున్నారు.

రామన్న బడిగేర వైపే మొగ్గు

బీజేపీ నుంచి కురుబ వర్గాలు దూరం కాగా ఈసారి ఆ కులం వారికే మేయర్‌గిరి ఇవ్వాలని కులాలకు అతీతంగా బీజేపీ నేతలపై ఒత్తిడి తెచ్చినా ఆ ఛాన్స్ కూడా తక్కువే అంటున్నారు. ముఖ్యంగా ధార్వాడ పశ్చిమ ఎమ్మెల్యే అరవింద బెల్లద రామన్న బడిగేర వైపే మొగ్గు చూపుతున్నారు. ఏదిఏమైనా ప్రధాన సూత్రధారి మాత్రం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషినే అని పార్లమెంట్ సమావేశాల్లో బిజీగా ఉన్న ఆయన అప్పుడో ఇప్పుడో హుబ్లీకి విచ్చేసి పాలక ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తారన్నది తథ్యమే. ఆ మేరకు శుక్రవారం రాత్రి గోకుల్ రోడ్డు అనంతగ్రాండ్‌లో కీలక సమావేశం జరగనుంది. జోషి సారథ్యంలో జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు అరవింద బెల్లద, మహేష్ టెంగినకాయి, ఎమ్మెల్సీ ప్రదీప్ శెట్టర్, ఎస్‌వీ సంకనూరు పాల్గొననున్నారు. ఇక్కడి కార్పొరేటర్ల అభిప్రాయాన్ని తెలుసుకొని శనివారం నామినేషన్‌కు కొన్ని క్షణాల ముందు మాత్రమే పాలకుల పేర్లు వెల్లడి కానున్నాయని తెలిసింది.

డిప్యూటీ మేయర్ ఆశావహులు వీరే

ఇక డిప్యూటీ మేయర్ పదవికి దుర్గమ్మ శశికాంత బిజవాడ లేదా చంద్రిక వెంకటేష్ మెస్త్రీలలో ఒక్కరు ఎన్నిక కావచ్చు. దుర్గమ్మ బిజవాడకు పార్టీలో చేరేటప్పుడే హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. 82 మంది సభ్యులు ఉన్న పాలికెలో 39 మంది బీజేపీ, 33 మంది కాంగ్రెస్, 3 మంది ఏఐఎంఐఎం, 6 మంది ఇండిపెండెంట్‌లతో పాటు ఓ జేడీఎస్ కార్పొరేటర్ కూడా ఉన్నారు. గత ఎన్నికల వేళ పార్టీ విప్‌ను ఉల్లంఘించిన బీజేపీ కార్పొరేటర్ సరస్వతి వినాయక దొంగడికి కూడా ఓటు హక్కు లభించిన సంగతి తెలిసిందే. మొత్తానికి పాలికెపై బీజేపీ బావుటా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా తగినంత మెజార్టీలేని కాంగ్రెస్ నాయకులు కూడా ఈ పదవులపై కన్నేసి ఆ మేరకు శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆ పార్టీ కార్పొరేటర్లు ఇక్బాల్ నవలూరు, ఇమ్రాన్ ఎలెగార మేయర్ అభ్యర్థులుగా, డిప్యూటీ మేయర్ అభ్యర్థులుగా తెలుగు మహిళ సువర్ణ కల్లకుంట్ల, మంగమ్మ హిరేమని, కవితా కబ్బేరాలు పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

డెంగీపై జాగృతి జాతా



జాతాను ప్రారంభిస్తున్న అధికారులు

హొసపేటె: ఇకపై ప్రతి శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఈడిస్ ఈజిప్ట్ దోమల ఉత్పత్తి కేంద్రాలను నాశనం చేయాలనే ప్రచారాన్ని ఏకకాలంలో చేపట్టాలని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు సూచించారు. ఆయన శుక్రవారం నగరంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంపై ఇప్పటికే జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, పురపాలక సంఘం, టీపీ, జీపీ అధికారులు అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి డెంగీ వ్యాప్తిని అరికట్టే దిశలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రచారానికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా కమ్యూనికేబుల్ డిసీజ్ కంట్రోల్ ఆఫీసర్ కమల, వైద్యులు జంబయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాయచూరులో..

రాయచూరు రూరల్: జిల్లాలో నానాటికీ ప్రబలుతున్న డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణకు సహకరించాలని జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని నిజలింగప్ప కాలనీలో ప్రచార జాతాకు ఆయన శ్రీకారం చుట్టి మాట్లాడారు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలను చైతన్యపరచాలన్నారు. వానాకాలంలో ఇంటి ముందు శుభ్రతను పాటించాలన్నారు. దోమల నియంత్రణకు గ్రామ స్థాయిలో ఫాగింగ్, బ్లీచింగ్ వంటివి చేయాలన్నారు. జాతాలో అధికారులు గణేష్, యశోద, తాలూకా ఆరోగ్య అధికారి ప్రజ్వల్, మడ్డిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుష్మా పాటిల్, సిబ్బందిలున్నారు.

పండరీనాథుని పాదయాత్రకు శ్రీకారం



పాండురంగ పాదయాత్ర బయలుదేరిన భక్తుల బృందం

బళ్లారిఅర్బన్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీక్షేత్ర పండరీనాథుని పాదయాత్ర 14వ సంవత్సరపు పాదయాత్రకు శుక్రవారం ఉదయం శ్రీకారం చుట్టారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని ఉంతకల్ గ్రామంలో వెలసిన రుక్మిణి పాండురంగ దేవస్థానం సన్నిధిలో తెల్లవారు జామున ఈ పాదయాత్ర ప్రారంభమైంది. కొప్పళ జ్ఞానమఠం కృష్ణాజీరావ్ ఆశీర్వాదంతో వీణాకారి కురుబ ఎర్రిస్వామి, కుమారుడు లక్ష్మిరెడ్డి, ఆ గ్రామ పెద్దలు, ప్రముఖులు అక్కడి భజన బృందం సహాయ సహకారాలతో ఈ యాత్ర జరుగుతోంది.

భారత జట్టుకు విద్యార్థుల శుభాశీస్సులు



జట్టుకు శుభాశీస్సులు కోరుతున్న విద్యార్థులు

బళ్లారి రూరల్: టి-20 క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో భారత జట్టు విజయం సాధించాలని నగరంలోని వాసవి ఎడ్యుకేషనల్ ట్రస్టు పాఠశాల విద్యార్థులు శుక్రవారం శుభాశీస్సులు తెలిపారు. టి-20 ప్రపంచకప్ క్రికెట్ పోటీల్లో భారత్ సెమీఫైనల్స్‌లో గెలుపొంది, శనివారం జరిగే ఫైనల్స్‌లో సౌతాఫ్రికా జట్టుపై విజయం సాధించి కప్ గెలవాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులు జాతీయజెండా, భారత జట్టు ఆటగాళ్లు, కోచ్‌ల ఫొటోలు, క్రికెట్ బ్యాట్, బాల్, వికెట్లతో వాసవిమాతకు పూజ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తుల రక్షణపై దండోరా



దండోరాతో చాటింపు వేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: పవిత్ర పుణ్యస్థలం నారద గడ్డ క్షేత్రం ఆస్తుల రక్షణ, నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు రాయచూరు తహసీల్దార్ సురేష్ వర్మ వెల్లడించారు. గురువారం తాలూకాలోని వివిధ గ్రామాల్లో ఆయా పంచాయతీల ద్వారా ప్రజలకు దండోరాతో చాటింపు వేసి ఈనెల 30న మఠం ఆస్తులను కాపాడుతూ, పంటలను సాగు చేస్తున్నట్లు రికార్డులతో హాజరు కావాలని, వారి అభిప్రాయాల సేకరణకు కలబురిగి హైకోర్టు బెంచ్ ఇచ్చిన ఆదేశాల మేరకు మఠాధిపతులు, రాజకీయ నాయకులు, రైతులు కూడా తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఓ ప్రకటనలో తెలిపారు.